
అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
మంగళవారం 2-1-2018
సమగ్ర తెలుగు దినపత్రిక


సంపుటి : 4 సంచిక : 5 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

బీజేపీకి భయమా!



- ఆరు లోక్‌సభ స్థానాలు ఖాళీగా ఉండగా.. మూడింటికే ఉప ఎన్నికలా..?
- ఈసీ తన బాధ్యతలను విస్మరించొద్దు.. : సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ: లోక్‌సభ ఉప ఎన్నికల విషయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ తీరును సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తప్పుపట్టారు. దేశంలో మొత్తం ఆరు లోక్‌సభ స్థానాలు ఖాళీగా ఉండగా, మూడింటికి మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించడాన్ని ఏచూరి ప్రశ్నించారు. రాజస్థాన్‌లోని అల్వార్, అజ్మేర్, బెంగాల్‌లోని ఉల్‌బెరియా లోక్‌సభ స్థానాలకు ఈ నెల 29న ఎన్నికలు నిర్వహించనున్నట్టు గత నెల 28న కమిషన్ ఓ ప్రకటనలో తెలిపింది. కానీ, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్, బీహార్‌లోని అరేరియా లోక్‌సభ స్థానాలు ఖాళీగా ఉన్నా, వాటిపై ప్రకటనలో పేర్కొనకపోవడాన్ని ఏచూరి తప్పు పట్టారు. యోగి ఆదిత్యనాథ్ యూపీ సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో ఆయన ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పూర్, ఉప ముఖ్యమంత్రిగా కేశవ్‌ప్రసాద్‌మౌర్య బాధ్యతలు చేపట్టడంతో ఆయన ప్రాతినిధ్యం వహించిన ఫూల్‌పూర్‌కు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. ఆర్‌జేడీ ఎంపీ మహ్మద్‌తస్లీముద్దీన్ మరణించడంతో అరేరియా స్థానం ఖాళీగా ఉన్నది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల విషయంలోనూ ఈసీ తీరు విమర్శలకు గురైన విషయాన్ని ఏచూరి గుర్తు చేశారు. హిమాచల్‌ప్రదేశ్ తోపాటు గుజరాత్‌లో ఎన్నికలు నిర్వహించకుండా ...9లో



3రోజులు @ 420 కోట్లు

న్యూ ఇయర్‌లో మద్యం కిక్

చిందేసి చిత్తుగా తాగిన మందుబాబులు

2016 డిసెంబర్ చివరి మూడు రోజుల్లో రూ.319 కోట్ల.. ఆదాయం



సర్కారుకు న్యూ ఇయర్ బొనాంజ తగిలింది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం ప్రియులు అధిక మొత్తంలో తాగి సర్కారు ఊహించనంతగా ఆదాయాన్ని సమకూర్చి పెట్టారు. 2017 డిసెంబర్ చివరి వారంలో కేవలం మూడంటే మూడురోజుల్లో రూ.420 కోట్ల మద్యం అమ్ముడు పోయింది. డిసెంబర్ 31న రూ.130 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. 2016 డిసెంబర్ చివరి మూడు రోజుల్లో రూ.319 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. 2016 డిసెంబర్ చివరి మూడు రోజుల ఆదాయంతో పోలిస్తే 2017 డిసెంబర్ చివరి మూడు రోజుల్లో సర్కారుకు రూ.101 కోట్లు అదనపు ఆదాయం సమకూరింది. 9



చివరి మూడు రోజుల్లో అమ్మకాలు

నెల	అమ్మకాలు (కోట్లలో)
2017 డిసెంబర్ 29	165
2017 డిసెంబర్ 30	125
2017 డిసెంబర్ 31	130
మొత్తం	420

మద్యపానంపై సామాజిక కోణమేదీ..?

మద్య పానం వల్ల జరిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. తాగుడువల్ల మందు బాబులకు నష్టాలే గాని లాభాలంటూ ఏమీ వుండవు.ఆ దురలవాటు వ్యక్తినీ, కుటుంబాన్ని, సమాజాన్ని కబళిస్తోంది దీంతో ఎన్నో బతుకులు ఆర్థికంగా, ఆరోగ్య పరంగా చితికిపోతున్నాయి. మద్యం అమ్మకాలతో ఖజానా ఎంతగా నిండింది. తాగుబోతులను పట్టుకుని ఎన్ని కోట్ల మేర చలానాలు వచ్చాయని లెక్కలేసుకోవటంలో అధికారులు బిజీ అయిపోతున్నారు. ఆరోగ్య తెలంగాణ కోసం ఈ తరహాలో ఖజానా నింపుకోవటం తగునా..అని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

మత్తు దిగింది



విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు 9

విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్

- జనవరి నుంచే అమల్లోకి
- 24/7 కరెంటు వారి ఘనతే
- డి. ప్రభాకరరావును ఆలింగనం చేసుకొని సీఎం అభినందన



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"రాష్ట్రంలో 24/7 కరెంటు రావటానికి విద్యుత్ ఉద్యోగులు పడిన కష్టమే కారణం. వారికి ప్రత్యేక అభినందనలు. రాష్ట్రానికి ఇంత గొప్ప ఖ్యాతిని ఆర్జించిపెట్టిన వారికి ఈ ఏడాది జనవరి నుంచి అమల్లోకి వచ్చేలా ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇస్తాం" వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అమల్లోకి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు విద్యుత్ ఉద్యోగులను ఉద్దేశించి చెప్పిన మాటలు ఇవి. ఈ సందర్భంగా ఆయన టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావును ఆలింగనం చేసుకొని అభినందించారు. రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులు రైతులతో సహా అన్ని వర్గాల ప్రజల నూతన సంవత్సర ఆనందాన్ని రెట్టింపు చేశారని ఈ సందర్భంగా సీఎం అన్నారు. వారి పనితీరు పట్ల తాను పూర్తి తృప్తిగా, ఆనందంగా ఉన్నానని చెప్పారు. సోమవారం ప్రగతిభవన్‌లో దేవులపల్లి ప్రభాకరరావుతో పాటు టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జి రఘుమారెడ్డి, డైరెక్టర్ (హెచ్ఆర్) కమాలుద్దీన్ అహ్మద్, ట్రాన్స్‌కో జేఎమ్‌డీ శ్రీనివాసరావు, డైరెక్టర్ జి నర్సింగరావు, జెన్‌కో డైరెక్టర్లు అశోక్‌కుమార్, వెంకటరాజం, లలిత్‌కుమార్, టీఎస్ఈఆర్సీ చైర్మెన్ ఇస్మాయిల్ అలీఖాన్, పీజీసీఐఎల్ ...9లో

ఉత్తమ్‌తో గ్రూపులకు ఆజ్యం

- అధ్యక్ష పదవిస్తే... పార్టీని అధికారంలోకి తెస్తా
- 24 గంటల విద్యుత్‌తో భూస్వాములకే లబ్ది
- సీఎంకు యాదాద్రిగుట్టపై ఉన్న శ్రద్ధ నిమ్స్‌పై ఏదీ..?
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి

9



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

నుమాయిష్‌లో ఫ్రీ వైఫై

ఎగ్జిబిషన్ సొసైటీకి అన్ని విధాలుగా అండ : మంత్రులు మహమూద్ అలీ,కడియం, ఈటల 9



వైద్యం ప్రయివేటుకే!



9

- ఎన్ఎంసీ బిల్లుపై నేడు లోక్‌సభలో చర్చ
- అమల్లోకొస్తే ఆరోగ్యశాఖ ఆగమాగం
- పెరగనున్న ప్రయివేటు వైద్య కళాశాలల పెత్తనం
- నేడు దేశవ్యాప్తంగా స్తంభించనున్న వైద్యం



మనం ఓట్లడిగినప్పుడు వారంత యువ ఓటర్లు సార్.. ఇప్పుడంతా యువ నిరుద్యోగులు..!!

ఎలక్షన్ ఎక్స్‌ప్రెస్...

తాయిలాలు.. సంక్షేమ పథకాలు...

- ఆర్థికంగా ఈ యేడాదికి ఇవే కీలకం
- ఎకరానికి నాలుగు వేలు ప్రతిష్టాత్మకం
- బకాయిల విడుదలపై సందిగ్ధం
- మిషన్ భగీరథకు వాటా ఇవ్వాల్సిన వైనం

గతేడాది రెవెన్యూ లోటు, బకాయిలతో కొనసాగిన టీఆర్ఎస్ సర్కారుకు.. నూతన సంవత్సరం ఆర్థికంగా మరింత కీలకం, సంక్లిష్టం కానున్నది. 2019లో సాధారణ ఎన్నికలు ఉండటమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలు, తాయిలాల చుట్టూ ఆర్థిక పరిస్థితి పరిభ్రమణం చేయనుంది. ఈ క్రమంలో గతేడాది కొనసాగించిన వివిధ కార్యక్రమాలకు తోడు మరిన్ని పథకాలు ముందుకు రానున్నాయని సమాచారం. అయితే వాటికి నిధుల సమీకరణే ఇప్పుడు సర్కారు ముందున్న అతిపెద్ద సవాల్. 3





ఢిల్లీలో భారీ ట్రాఫిక్ జామ్

- రెండున్నర లక్షల మందితో కిక్కిరిసిన ఇండియా గేట్ ప్రాంతం

న్యూఢిల్లీ : నూతన సంవత్స ర వేడుకల సందర్భంగా దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇండియా గేట్ పర్యాటకులతో కిక్కిరిసిపో యింది. దాదాపు రెండున్న లక్షల మంది ఇండియాగేట్ వద్ద గుమికూడారు. దీంతో మధ్య ఢిల్లీలో ట్రాఫిక్ గంటలపాటు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఇండియా గేట్ పరిసరాలతో పాటు తిలక్ మార్గ్, మండి హౌజ్ సర్కిల్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడటంతో వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. వేలాది వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. అయితే ఊహించిన దానికంటే ఏడురెట్లకుపైగా ప్రజలు అక్కడకు చేరుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేశారు.

సీపీఐ(ఎం) కార్యకర్తపై దాడి ఘటన

- కాషాయ గూండాల అరెస్టు

తిరువనంతపురం : తిరువనంతపురంలో సీపీఐ(ఎం)కార్యకర్త ఎల్ఎస్ షాజుపై దాడికి చేసిన ఆరెస్సెస్ కాషాయ గూండాలు ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. షాజుపై డిసెంబరు 28న ఆరెస్సెస్‌కు చెందిన ముగ్గురు పదునైన ఆయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో షాజుకు తలపై తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరెస్సెస్‌కు చెందిన ముగ్గురిని అరెస్టు చేశామని, షాజుపై జరిగిన దాడిని ప్రతీకార దాడిగా సందేహిస్తున్నామని పోలీసులు చెప్పారు. అరెస్టు చేసిన ముగ్గురిలో ఒకరు గత ఏడాది జులైలో తిరవనంతపురంలో హత్యకు గురైన ఆర్ఎస్ఎస్ కార్యకర్త రాజేష్‌తో సంబంధమున్న వ్యక్తి అని పోలీసు వర్గాలు తెలిపారు. షాజుపై కూడా అదే ప్రదేశంలో దాడి జరిగిందన్నారు. ఈ దాడితో ప్రమేయమున్న మరికొందరి కోసం గాలింపు జరుపుతున్నట్టు వారు తెలిపారు.

యుద్ధ విమానాల ఆధునీకరణకు రూ.5 వేల కోట్లు

న్యూఢిల్లీ : జాగ్వార్ యుద్ధ విమానాల ఆధునీకరణ కోసం భారత వైమానిక దళం (ఐఏఎఫ్) రూ.5 వేలకోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవుతోంది. 2011లో యూపీఏ-2 ప్రభు త్వం విమానాల ఆధునీకరణ ప్రాజెక్టును ప్రకటించింది. 2017 డిసెం బరు కల్లా ఆధునీకరణ పనులు పూర్తిచేస్తామని ఆనాడు పార్లమెంట్‌కు తెలిపింది. కానీ ప్రాజెక్టు గడువు ముగిసినా అసలు పనే ప్రారంభం కాలేదు. దీంతో యుద్ధ విమానాల ఆధునీకరణ పనులు నిలిచిపోయినట్టేనని అనుకుంటున్నవేళ ఐఏఎఫ్ ఈ ప్రకటన చేసింది. ప్రస్తుతం ఐఏఎఫ్ వద్ద మిగ్ యుద్ధ విమానాలు మొత్తం 42ఉన్నాయి. కానీ ఇందులో 21మిగ్ విమానాల్ని పూర్తిస్థాయిలో వైమానిక దళాలకి అందుబాటులో రాలేదు. కాబట్టి, జాగ్వార్ విమానాలు అందుబాటులోకి మరింత శక్తివంతమవుతామని వైమానిక దళం భావిస్తున్నది. జామ్‌నగర్, గోరఖ్‌పూర్, అంబాలా కేంద్రాల్లో దాదాపు 100కు పైగా జాగ్వార్ యుద్ధ విమానాల ఇంజన్ల ఆధునీకరణ పనులు జరపనున్నారు. ప్రస్తుతమున్న జాగ్వార్ యుద్ధ విమానాలు మూడు దశాబ్దాల క్రితంనాటివని, అయినప్పటికీ అవి సేవలు అందించగలవని భారత వైమానిక దళ ఉన్నతాధికారి ఒకరు మీడియాకు చెప్పారు.

నేడు సంపూర్ణ చంద్ర దర్శనం

- 31న బ్లూమూన్

పణాజీ/ముంబయి: ఖగోళ ప్రేమికులకు నేడు కనువిందు చేసే విధంగా మంగళవారం రాత్రి సంపూర్ణ చంద్ర (సూపర్‌మూన్) దర్శనం లభించనున్నది. 2018లో తొలి పున్నమి రోజే ప్రజలకు కనువిందు చేస్తూ చందమామ నిండు కళలతో కనువిందు చేయనున్నది. మంగళ వారం వేకువ జామున చంద్రుడు సాధారణ స్థాయి కన్నా 14శాతం పెద్దగానూ, 30శాతం అధిక ప్రకాశవంతంగానూ కన్పిస్తాడని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇదే ఈ ఏడాది కన్పించే అతి పెద్ద చంద్ర దర్శనమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి చుట్టూ పరిభ్రమించే చంద్రుడు భూమికి సమీపంలోకి వచ్చినపుడు ఈ సూపర్‌మూన్ దర్శనమిస్తుంది. భూమికి అత్యంత సమీపంలోకి రావటంతో చంద్రగ్రహం సాధారణ స్థాయి కన్నా పెద్దదిగానూ, ప్రకాశవంతంగానూ కన్పిస్తుంది. ఈ సారి సూపర్‌మూన్ పశ్చిమ ప్రాంతంలో వేకువ జామున కన్పిస్తుండటంతో ఈ ప్రాంతంలో ఎక్కడి నుండయినా ప్రజలు సంపూర్ణ చంద్ర దర్శనం చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

31న బ్లూమూన్

అదే విధంగా ఈ నెల 31న వచ్చే పౌర్ణమి రోజు మరోసారి పూర్ణ చంద్ర దర్శనం కలుగనున్నదని, అయితే అదే రోజు చంద్ర గ్రహణం కావటంతో ఇది పాక్షికంగా మాత్రమే కన్పిస్తుందని చెబుతున్నారు. జనవరి 31 నాటి సంపూర్ణ చంద్ర దర్శనం ఉత్తర అమెరికా, పసిఫిక్ ప్రాంతం నుండి ఆసియా తూర్పు ప్రాంతాల వారికి కనువిందు చేస్తుందని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. చంద్ర గ్రహణ సమయంలో చంద్రుడు తన సహజ కాంతిని కోల్పోయి సూర్యకాంతితో అరుణవర్ణంతో కన్పిస్తాడని, అందువల్లే ఈ సంపూర్ణ చంద్ర గ్రహణాలను 'బ్లడ్‌మూన్స్' అని పిలుస్తారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాగా కొన్ని ప్రాంతాల వారికి మాత్రమే కన్పించే సంపూర్ణ చంద్ర దర్శనం ఒకే నెలలో కన్పించే రెండో సూపర్‌మూన్ కావటం విశేషం.

సీమాంతర ఉగ్రవాదాన్ని నిలిపివేస్తేనే పాక్‌తో క్రికెట్

- కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్

న్యూఢిల్లీ : సీమాంతర ఉగ్రవాదాన్ని, కాల్పులను పాక్ ఆపే వరకు భారత్ దానితో ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ ఆడదని విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ తెలిపారు. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆమె ఈవిషయాన్ని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి ఎం.జె. అక్బర్, విదేశాంగ శాఖ కార్యదర్శి ఎస్. జైశంకర్ హాజరయ్యారు. భారత్‌లో పాక్ రాయబారితో తాను భేటీ అయినట్టు సుష్మా చెప్పారు. 70 ఏళ్ళ వయస్సు పైబడిన ఖైదీలను ముఖ్యంగా మానసిక అనారోగ్యం ఉన్న వారిని, మహిళలను మానవతా కోణంలో విడిచి పెట్టాలని సుష్మా ప్రతిపాదించారని సమావేశానికి హాజరైన సభ్యులలో ఒకరు చెప్పారు. ఉగ్రవాదం, క్రికెట్ ఒకదానికొకటి పొగసవని సుష్మా వ్యాఖ్యానించినట్టు వెల్లడించారు.

పుల్వామా దాడి ఘటనలో మరో ఉగ్రవాది మృత దేహం లభ్యం

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడి సంఘటనకు సంబంధించి మరో ఉగ్రవాది మృతదేహాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఉగ్రవాదులపై భద్రతా బలగాలు చేపట్టిన ప్రతిఘటన చర్యలు ముగిశాయని డీజీపీ ఎస్.పి.వెయిద్ తెలిపారు. అంతకుముందు ఆదివారం ఇద్దరు ఉగ్రవాదుల మృత దేహాలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. పుల్వామా జిల్లాలో లెథ్‌పోరా వద్ద ఆదివారం తెల్లవారుఝామున ఉగ్రవాదులు జరిపిన దాడిలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఐదుగురు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలైన సంగతి తెలిసిందే. పుల్వామా జిల్లాలోని లెథపోరా వద్ద ఉన్న పారామిలటరీ బలగాల శిబిరంపైకి భారీగా ఆయుధాలు ధరించిన పోలీసులు చొచ్చుకు పోయి దాడి జరిపారు. పాకిస్తాన్‌కు చెందిన జైష్ ఎ మహ్మద్ ఈ దాడికి తమదే బాధ్యత అని ప్రకటించింది. పుల్వామా జిల్లా డ్రబ్గామ్‌కు చెందిన మంజూర్ అహ్మద్, ట్రాల్ జిల్లాలోని నజీం పోరాకుచెందిన ఫర్దీన్ అహ్మద్ ఖాన్‌డే మృత దేహాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

పదేపదే సవాల్ చేస్తే.. వచ్చి చూపిస్తా..

- రాజకీయ ప్రవేశంపై ప్రకాశ్‌రాజ్



బెంగళూరు : రాజకీయాలంటే తనకు ఆసక్తి లేదనీ, పదేపదే సవాలుచేస్తే మాత్రం రాజకీయాల్లో వచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ అన్నారు. 'ఈ ఏడాది (2017) వ్యక్తి' పురస్కారంతో ప్రకాశ్‌రాజ్‌ను బెంగళూరు ప్రెస్ క్లబ్ సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'దేశంలో మతతత్వ రాజకీయాలకు ప్రాధానం పెరిగింది. హిట్లర్ పాలనలో ప్రబలంగా ఉన్న మెజారిటేరియనిజం, నిరంకుశతత్వం ప్రబలంగా ఉంది. మనదేశంలో అది మరింతగా పెరుగుతోంది. అది జరగనివ్వకుండా చేద్దాం. దానికి వ్యతిరేకంగా మా స్వరాన్ని వినిపించాల్సిన సమయం వచ్చింది' అన్నారు. వారి లక్ష్యాలను సాధించడానికి హింసాత్మక మార్గాలను మతతత్వ శక్తులు ఉపయోగించుకుంటున్నాయని ప్రకాశ్ రాజ్ విమర్శించారు. ఈ హింసాత్మక దళాలను ఓడించడం ద్వారా వారికి ఒక పాఠం నేర్పాలన్నారు. ఈ దళాల గురించి అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలో ప్రతి ఒక్క ఇంటినీ సందర్శించాలి. రాబోయే ఎన్నికల్లో వారిని ఓడించడంలో ఇది మనకు సహాయపడుతుంది' అన్నారు. నరేంద్రమోడీ, అమిత్ షా సహా బీజేపీ నాయకులపై ప్రకాశ్ రాజ్ గత కొన్ని రోజులుగా విమర్శనాస్త్రాలను సంధిస్తూనే ఉన్నారు. జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్యోదంతం తనలో మార్పు తీసుకొచ్చిందని తెలిపారు. సమాజంలో జరుగుతున్న దారుణాలపై గళమెత్తాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. సీనియర్ పాత్రికేయులే తనకు ప్రశ్నించే ధైర్యాన్నిచ్చారని, వారి మార్గదర్శకత్వంలో పెరిగిన ఏకలవ్య శిష్యుడినని అన్నారు సమాజంలో బాధ్యతగా మాట్లాడేందుకు ప్రెస్‌క్లబ్ అందించిన పురస్కారం మరింత ధైర్యాన్ని ఇచ్చిందన్నారు.

సోషల్ లుటలుటి



బీజేపీకి జిగ్నేశ్ సవాల్

- రాజ్యాంగాన్ని మారిస్తే.. దాన్ని ఎలా అడ్డుకోవాలో మాకు తెలుసు
- దాన్ని గౌరవించని నేతలకు చట్టసభల్లో కొనసాగే అర్హత లేదని వ్యాఖ్య



పూణె : రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో దళిత నేత, గుజరాత్ అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే జిగ్నేశ్ మెవానీ ఆ పార్టీకి సవాలు విసిరారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటూ కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలను జిగ్నేశ్ తప్పుపట్టారు. 'రాజ్యాంగం, దేశంలో నెలకొని ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థను మార్చాలని అనుకుంటే, దానిని రక్షించునే ఆలోచన కూడా మేంచేస్తాం. రక్షించుకునే శక్తి మాకుంది. నేను నా లాంటి భావజాలం కలిగిన వ్యక్తులు ఆపనిని ఎట్టిపరిస్థితుల్లోనూ జరగనివ్వబోం. ప్రజల అభీష్టం, వారి రక్షణ కోసం చట్టాల రూపకల్పన జరగాలి. కానీ, పార్టీలు, నేతలు తమ ఇష్టానుసారం మారుస్తుంటే చూస్తూ ఊరుకోబోం' అని జిగ్నేశ్ మెవానీ అన్నారు. భీమ-కోరేగావ్ యుద్ధం స్మారకార్థం పూణెలోని ఎల్గార్ పరిషత్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జిగ్నేశ్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో దళితులు, మైనార్టీలు, రైతులు, అట్టడుగువర్గాల ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటువేశారని, బీజేపీ సీట్లు 99కి పడిపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. '2019 ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా అన్ని పక్షాలు, సంస్థలు భేదాభిప్రాయాలను పక్కనపెట్టి పోరాడాల్సిన అవసరం ఉందని జిగ్నేశ్ తెలిపారు. 'గుజరాత్‌లో 150సీట్లు గెలుచుకోవాలన్న బీజేపీ లక్ష్యాన్ని మేము అడ్డుకోగలిగాం. మనమంతా కలిసికట్టుగా పోరాడితే.. 2019 ఎన్నికల్లో బీజేపీకి రెండంకెల సీట్లు మాత్రమే వచ్చేలా చేయగలం' అన్నారు. 'కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికలు ఈ ఏడాదిలో జరగనున్నాయి. పేదల అనుకూల ప్రజలంతా ఒక్క తాటికి మీదికి రావాలి. ఎన్నికల్లో గెలిచే వ్యక్తి ముఖ్యంకాదు. ముస్సోలినీ, హిట్లర్ భావజాలాలను అనుసరిస్తూ, బీజేపీ మాత్రం ఓడిపోవాల్సిందే' అన్నారు. సభలో రోహిత్ వేముల తల్లి రాధిక, భీమ్‌ఆర్మీ ప్రెసిడెంట్ వినయ్‌రతన్‌సింగ్, బిఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్(మాజీ ఎంపీ), జేఎన్‌యూ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్ తదితరులతోపాటు దళిత నేతలు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరవేళ...

- నిలిచిన వాట్సాప్ సేవలు
- నెటిజన్లలో నిరుత్సాహం



న్యూఢిల్లీ : నూతన సంవత్సరం సందర్భంగా సందేశాల తాకిడి ఎక్కువై ఆదివారం అర్ధరాత్రి 'వాట్సాప్' సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. డిసెంబరు 31న అర్ధరాత్రి 12 నుంచి 1 గంట మధ్య వాట్సప్ పనిచేయటం ఆగిపోవటం, నెట్‌జన్లను తీవ్రంగా నిరుత్సాహపర్చింది. సంక్షిప్త సందేశాలను, ఫొటోలను, వీడియో సందేశాలను పంపడం కోసం, సంభాషణల కోసం ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు వాడుతున్న సామాజిక మాధ్యమం 'వాట్సాప్'. మొన్నటి డిసెంబరు 31 ఆదివారం అర్ధరాత్రి కొత్త ఏడాదిలోకి అడుగుబెడుతున్నవేళ, అనేకమంది భారతీయులు తమ స్నేహితులు, బంధువులకు శుభాకాంక్షలు తెలియజేయటంలో మునిగిపోయారు. ఆ సమయంలో హఠాత్తుగా 12గంటల నుంచి 1 గంట వరకు(భారత కాలమానం ప్రకారం) వాట్సాప్ సేవలు నిలిచిపోయాయి.

స్నేహితులు, కుటుంబ సభ్యులకు సందేశాలు వెళ్లకపోవడంతో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. ఇలా జరిగిన వెంటనే చాలా మంది నెటిజన్లు తీవ్ర అసహనానికి గురయ్యారు. వారి మిత్రులకు సందేశాలు పంపించలేక ట్విట్టర్‌ను ఆశ్రయించి వాట్సాప్ సమస్య గురించి మాట్లాడుకోవాల్సి వచ్చింది. కొంత మంది కోపంగా, మరికొంత మంది సరదాగా వాట్సాప్‌పై కామెంట్లు చేశారు. "సర్వర్ డౌన్ అవ్వడంతో వాట్సాప్ సేవలకు అంతరాయం ఏర్పడింది. వీలైనంత తక్కువ సమయంలో మా యాప్ సేవల్ని పునరుద్ధరిస్తామని, అంతరాయానికి మేము చింతిస్తున్నామని వాట్సాప్ నుంచి నోటిఫికేషన్స్ కూడా వచ్చాయి.

అసోంలో భారత జాతీయుల గుర్తింపు ప్రక్రియ

- తొలి జాబితాలో 1.9 కోట్ల మంది

గువహతి: అసోంలోని మొత్తం 3.29 కోట్ల మంది జనాభాలో తొలి విడతగా 1.9 కోట్ల మందిని భారత జాతీయులుగా గుర్తించారు. దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) ముసాయిదాను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. అసోం నుండి భారతీయ పౌరసత్వం కోసం 3.29 కోట్ల మంది దరఖాస్తులు చేసుకున్నారని, వీరిలో ఇప్పటివరకు 1.9 కోట్ల మందిని భారతీయులుగా నిర్ధారించామని భారత రిజిస్ట్రార్ జనరల్ శైలేష్ మీడియాకు చెప్పారు. వీరి దరఖాస్తులు వివిధ దశల్లో పరిశీలనలో వున్నాయని ఆయన వివరించారు.

ప్రస్తుతం తాము విడుదల చేసింది ముసాయిదా జాబితాలో భాగం మాత్రమేనని, ఇప్పటి వరకూ పౌరసత్వం నిర్ధారించిన 1.9 కోట్ల మంది పేర్లు ఇందులో వున్నాయని ఆయన చెప్పారు. మిగిలిన దరఖాస్తు దారుల పేర్లు వివిధ దశల్లో పరిశీలనలో వున్నాయని, పరిశీలన ముగిసిన అనంతరం మరో ముసాయిదా జాబితాను విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పేర్ల పరిశీలన సంక్లిష్టమైన ప్రక్రియ అని, అందువల్ల ఒకే కుటుంబానికి చెందిన వారిలో కొందరి పేర్లు ఈ తొలి ముసాయిదాలో వుండే అవకాశం లేదని ఎన్ఆర్‌సి రాష్ట్ర సమన్వయ కర్త ప్రతీక్ హజేలా వివరించారు.

నేడు రాజ్యసభకు ట్రిపుల్ తలాక్ బిల్లు

న్యూఢిల్లీ: వివాదాస్పద బిల్లు 'ట్రిపుల్ తలాక్'ను మంగళవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. గత నెల 28న ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఏ వ్యక్తి అయిన తన భార్యకు మూడు సార్లు తలాక్ చెప్పి విడాకులు ఇచ్చినట్టయితే ఆ వ్యక్తికి మూడేండ్లపాటు జైలు శిక్ష విధించేలా బిల్లును రూపొందించారు. ముస్లిం మహిళల వివాహ పరిరక్షణ బిల్లు-2017ను కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. తలాక్ విధానంలో విడాకులు పొందిన మహిళ న్యాయస్థానాన్ని ఆశ్రయించి తనకు, పిల్లలకు 'జీవనాధార భత్యాన్ని' కోరే హక్కును ఈ బిల్లు కల్పిస్తుంది. అలాగే తన మైనర్ పిల్లలను కస్టడీని పొందే హక్కు కూడా ఉంటుంది.

విడాకులు కోరుకునే వ్యక్తి నోటి మాట ద్వారా లేదా రాత పూర్వకంగా లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమంలోగానీ తలాఖ్ చెప్తే అది చట్ట విరుద్ధమవుతుంది, చెల్లదు. మరోవైపు ఈ బిల్లును రాజ్యసభలో కూడా ఆమోదిస్తే దేశంలో ఉన్న వివిధ ముస్లిం బోర్డులతో కలిసి సుప్రీంకోర్టుకు వెళ్తామని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎమ్ఎల్) ఆగ్రహం వ్యక్తం చేసింది. సభలో కేంద్ర ప్రభుత్వానికి మెజారిటీ లేనందున బిల్లు నిలిచిపోతే దాన్ని సమీక్షించాల్సిందిగా పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి రాజ్యసభ సూచించవచ్చు.

రజనీకాంత్ వెబ్‌సైట్ ప్రారంభం

చెన్నై : రాజకీయాలలోకి ప్రవేశిస్తానని ప్రకటించిన మరుసటి రోజే ప్రముఖ నటుడు రజనీ కాంత్ తన రాజకీయ పార్టీకి సంబంధించి అభిమానుల కోసం ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. **rajinimandram.org** పేరుతో వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. రాజకీయాలలోకి ప్రవేశించాలన్న తన నిర్ణయానికి మద్దతిచ్చిన వారందరికి తన అధికారిక ట్విట్టర్ పేజిలో ఒక చిన్న వీడియోను పోస్ట్ చేయడం ద్వారా రజనీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడు రాజకీయాలలో మార్పు రావాలని కోరుకుంటున్న వారందరూ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చునని ఆయన చెప్పారు. పేర్లతో పాటు ఓటరు గుర్తింపు కార్డు వివరాలను కూడా రిజిస్టర్ చేయాలన్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాలలోకి వస్తారని గత రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెర దించుతూ తాను రాజకీయాలలోకి ప్రవేశించనున్నట్టు ప్రకటించారు.

త్వరలో తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 234 నియోజక వర్గాలలోను పోటీ చేయనున్నట్టు తెలిపారు. "ఎన్నికలకు కొన్ని నెలల ముందు రాజకీయ పార్టీని ప్రారంభిస్తాం. ప్రజలకు పార్టీ సిద్ధాంతాలను, విధానాలను వివరిస్తాం, నేను ఏం చేస్తానో చెబుతాను, అలా చేయని పక్షంలో మూడేళ్ళలో రాజీనామా చేస్తాను" అని ఆయన చెప్పారు.

కింది కోర్టుల్లో 5,984 జడ్జీలపోస్టులు ఖాళీ..!

- పెండింగ్ కేసులు 2కోట్ల 61లక్షలు..!!



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జిల్లా కోర్టులుసహా కింది కోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగిపోయాయి. 2017, డిసెంబర్ 1నాటికి సబ్‌ఆర్డినేట్ కోర్టుల్లో 5,984 జడ్జిల(26శాతం) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దేశంలోని సబ్‌ఆర్డినేట్ కోర్టులకు మంజూరైన మొత్తం పోస్టులు 22,677 కాగా, ప్రస్తుతం పని చేస్తున్నవారి సంఖ్య 16,693. కింది కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య 2 కోట్ల 61 లక్షలు ఉన్నట్టు ఓ అధికారి తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లోని కోర్టుల్లో ఖాళీల సంఖ్య అధికంగా ఉన్నది. మేఘాలయకు 97 పోస్టులు మంజూరు కాగా, 58 పోస్టులు(60 శాతం) ఖాళీగా ఉన్నాయి. మిజోరంలో 52 శాతం, అరుణాచల్‌ప్రదేశ్‌లో 39 శాతం, మణిపూర్‌లో 37 శాతం, సిక్కింలో 35 శాతం,నాగాల్యాండ్‌లో 32 శాతం, త్రిపురలో 29 శాతం ఖాళీగా ఉన్నాయి.

పెద్ద రాష్ట్రాల్లో బీహార్‌లో 1826 పోస్టులు మంజూరు కాగా, 825 పోస్టులు(45 శాతం) ఖాళీగా ఉన్నాయి. ఉత్తర్ ప్రదేశ్‌లో 3204 పోస్టులు మంజూరు కాగా, 1344 పోస్టులు(42శాతం) ఖాళీగా ఉన్నాయి. ఢిల్లీలో 799 పోస్టులకు 316 పోస్టులు(40శాతం) ఖాళీగా ఉన్నాయి. మధ్య ప్రదేశ్‌లో 2021పోస్టులకు 748 పోస్టులు(37 శాతం) ఖాళీగా ఉన్నాయి. దేశంలోని మొత్తం 24 హైకోర్టులలో 1079 పోస్టులు మంజూరు కాగా 392(36 శాతం) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సుప్రీంకోర్టులో 31 మంది జడ్జిలు ఉండాల్సి ఉండగా, ఆరు(19 శాతం) పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఢిల్లీ కాలుష్యం దెబ్బకు.. వలస పక్షులు దూరం



న్యూఢిల్లీ : ఢిల్లీ కాలుష్యం..అక్కడి ప్రజల్నేగాక పక్షుల్ని సైతం స్వేచ్ఛగా విహరించకుండా చేసింది. ప్రతి ఏటా చలికాలంలో ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లోని అభయారణ్యాలకు పెద్ద సంఖ్యలో అరుదైన అటవీ పక్షులు వలస వస్తూ ఉండేవి. కానీ ఈసారి కాలుష్యం తీవ్రస్థాయిలో నెలకొనటం వల్ల వలస పక్షులు పెద్దగా ఇక్కడికి రాలేదు. హర్యానాకు చెందిన సుల్తాన్‌పూర్, బసాయి, యూపీలోని సూరజ్‌పూర్, దాద్రి, ఢిల్లీలోని ఓఖ్లా పక్షి అభయారణ్య కేంద్రాలన్నీ ఒకప్పుడు అరుదైన అటవీ పక్షుల రాకతో కిటకిటలాడేవి. ఇప్పుడు కనీసం పదుల సంఖ్యలో కూడా ఆ పక్షులు కానరావటం లేదు. వాతావరణంలో నెలకొన్న కాలుష్యం ఇక్కడి జీవావరణ వ్యవస్థను దెబ్బతీయటమే దీనికి కారణమని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు.

దీని గురించి జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ (జెఎన్‌యూ) జీవశాస్త్రవేత్త డా.సూర్యప్రకాష్ మాట్లాడుతూ..."ఢిల్లీ, దేశ రాజధాని పరిసర ప్రాంతాలకు అరుదైన అటవీ పక్షులు వలస వస్తుండేవి. కానీ ఈసారి ఎక్కడా కూడా అరుదైన పక్షుల రాక చూడలేకపోయాం. కారణం తీవ్రమైన కాలుష్యం. ఎక్కడైనా అరుదైన పక్షుల వలస వచ్చాయంటే, అది సరైన జీవావరణ వ్యవస్థకు గుర్తుగా మనం భావించాలి. అయితే ఈ ఏడాది వర్షాల వల్ల వలస పక్షులకు అనుకూల వాతావరణం ఏర్పడింది. కానీ ఊహించిన విధంగా అటవీ పక్షులు ఇక్కడి అభయారణ్య పార్కులకు వలస రాలేదు" అని తెలిపారు. అభయారణ్యాల నిర్వహణ తీరు సరిగా లేకపోవటం, అక్రమ మైనింగ్, అడవుల నరికివేత కూడా పక్షుల వలసలను ప్రభావితం చేసింది.

సైన్స్ కమ్యూనికేషన్‌లలో ప్రాంతీయభాషల వినియోగం

- శాస్త్రవేత్తలకు మోడీ సూచన

కోల్‌కతా: శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన కమ్యూనికేషన్లలో ప్రాంతీయభాషల వినియోగాన్ని విస్తరించాలని ప్రధాని నరేంద్రమోడీ సూచించారు. ప్రాంతీయ భాషల్లో శాస్త్ర విజ్ఞాన కమ్యూనికేషన్లను ప్రోత్సహిస్తే యువతలో సైన్స్ పట్ల మక్కువ పెరుగుతుందని, ఇందుకు ద్వితీయ భాష ఏ మాత్రం అడ్డంకి కాబోదని ఆయన అన్నారు. సోమవారం ఇక్కడ ప్రారంభమైన సత్యేంద్రనాథ్ 125వ జయంతి సందర్భంగా ఏర్పాటైన స్మారకోపన్యాస కార్యక్రమాన్ని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. శాస్త్ర విజ్ఞానాన్ని ప్రాంతీయభాషల్లో బోధన ప్రారంభించి బెంగాలీ సైన్స్ మ్యాగజైన్‌ను ప్రారంభించిన ఘనత బోస్‌దేనన్నారు. శాస్త్ర విజ్ఞానంపై యువతకు అవగాహనతో పాటు మక్కువను పెంచాల్సిన అవసరం వుందని, ఇందుకు సైన్స్ కమ్యూనికేషన్‌ను ప్రోత్సహించటం అత్యంత కీలకమైన అంశమని అన్నారు.

ఈ లక్ష్యసాధనకు భాష అడ్డంకి కాకూడదని ఆయన స్పష్టం చేశారు. శాస్త్రవేత్తలు తమ ప్రాథమిక శాస్త్రవిజ్ఞానాన్ని ప్రజల దైనందిన జీవితంలో ఉపయోగపడే విధంగా సహకరించాలని ప్రధాని సూచించారు. శాస్త్ర పరిశోధనలు, ఆవిష్కరణల తుది ఫలితాల ప్రభావాన్ని అవి పేద ప్రజల జీవితాలపై ఏ మేరకు సానుకూల ప్రభావాన్ని చూపాయన్న అంశం ఆధారంగా నిర్ణయిస్తారన్నారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సవాళ్లను దృష్టిలో వుంచుకుని శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను కొనసాగించాలన్నారు. 1894లో జన్మించిన సత్యేన్‌బోస్ 1920లలో క్వాంటమ్ మెకానిక్స్‌లో విస్తృత పరిశోధనలు జరిపి ప్రముఖ భౌతిక శాస్త్రవేత్తగా ప్రఖ్యాతి చెందారు.

పొగ మంచు కారణంగా 300 విమానాలు ఆలస్యం

- 8 విమానాలు రద్దు



న్యూఢిల్లీ : ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద సోమవారం ఉదయం దట్టమైన పొగ మంచు వ్యాపించడంతో దాదాపు 300 విమానాలు ఆలస్యంగా నడిచాయి. 8 విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీకి రాకపోకలు సాగించే దాదాపు అన్ని విమానాలపై పొగ మంచు ప్రభావం పడింది. 265 దేశీయ విమానాలు, 67 అంతర్జాతీయ సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. దేశీయంగా నడిచే 8 విమానాలు రద్దయ్యాయి. ఉదయం 7.30-9.30 గంటల మధ్య ఏ విమానం బయలుదేరి వెళ్ళలేదని విమానాశ్రయం అధికారులు తెలిపారు. సుమారు 100 నుంచి 125 మీటర్ల వరకు రన్‌వే కనిపించకపోడమే దీనికి కారణమని చెప్పారు.

సహజంగా 125 మీటర్ల కన్నా ఎక్కువ దూరం రన్‌వే కనిపిస్తేనే విమానాలు బయలుదేరి అవకాశముందని చెప్పారు. ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండింగ్ కావాల్సిన విమానాలు కూడా ఆలస్యంగా చేరకున్నాయన్నారు.. ఢిల్లీ విమానాశ్రయంలో నెలకొన్న పరిస్థితిని విస్తార చీఫ్ స్ట్రాటజీ అండ్ కమర్షియల్ ఆఫీసర్ సంజయ్ కపూర్ ట్విట్టర్‌లో వివరించారు. "దట్టమైన పొగ మంచు కారణంగా విమానాలు బయలు దేరి వెళ్ళలేదు. ఇక్కడకు చేరుకోవలసిన విమానాలు కూడా చేరుకోలేక పోయాయి. విమానాలన్నీ ఇక్కడ విమానాశ్రయంలో నిలిచిపోవడం వల్ల, ఇక్కడకు చేరుకునే విమానాల ల్యాండింగ్‌కు అవకాశం లేకుండా పోయిందని, మొత్తం మీద విమానాల రాకపోకల్లో తీవ్ర జాప్యం నెలకొందని." ఆయన ట్వీట్‌చేశారు.

సెమీ హై స్పీడ్ రైల్ ట్రాక్ నిర్మాణానికి కేరళ ముసాయిదా ప్రణాళిక

తిరువనంతపురం : కాసరగోడ్ నుండి తిరువనంతపురం వరకు సెమీ హై స్పీడ్ ఎలివేటెడ్ డబుల్ రైల్ ట్రాక్ (సెమీ హై స్పీడ్ రైళ్ళ కోసం స్తంభాలపై నిర్మించనున్న జంట రైలు మార్గం) ను నిర్మించాలని కేరళ యోచిస్తోంది. ఇందుకోసం ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రస్తుతమున్న రైల్వే లైనుకు, రహదారులకు పైన ఈ ట్రాక్ వుంటుంది. ఈ ప్రణాళికకు సంబంధించి ప్రాథమిక డిజైన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రైల్వే బోర్డుకు సమర్పించింది. దీనికి రు.43వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. వచ్చే ఏడాది నిర్మించతలపెట్టిన రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రణాళికా పత్రమైన పింక్ బుక్‌లో ఈ ప్రాజెక్టుకు చోటు దక్కుతుందని కేరళ ప్రభుత్వం భావిస్తోంది. అక్టోబరులో ముఖ్యమంత్రి విజయన్ ఢిల్లీలో రైల్వే బోర్డు చైర్మన్ అశ్వని లోహనిని కలుసుకుని ప్రాజెక్టు పత్రాన్ని సమర్పించినపుడు అయన దీన్ని పింక్ బుక్‌లో చేర్చడానికి అంగీకరించారు. డిసెంబరుకల్లా ముసాయిదా డిజైన్ రూపొందించి అందచేయాల్సిందిగా కోరారు.

ఆ మేరకు కేరళ ప్రభుత్వం రూపొందించి అందచేసింది. కేరళ రైల్వే అభివృద్ధి కార్పొరేషన్‌కి చెందిన నిపుణులు ఈ డిజైన్‌ను రూపొందించారు. సమాంతర జంట మార్గం (ప్యారలల్ డబుల్ ట్రాక్), సమాంతర ఆకాశ మార్గం (ప్యారలల్ స్కై ట్రాక్), న్యూ స్కై ట్రాక్ వంటి మూడు రకాలైన ప్రతిపాదనలను కేరళ అందచేసింది.

ఎలక్షన్ ఎక్స్‌ప్రెస్...

- బి.వి.యన్.పద్మరాజు



ఈ ఒరవడిలో ఇప్పటికే ప్రకటించిన 'రైతులకు ఎకరానికి రూ.4 వేల సాయం..' కేసీఆర్ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకం కానుంది. లబ్దిదారులను గుర్తించటం, వారికి సమర్థవంతంగా సాయాన్ని అందజేయటం కష్టంతో కూడుకున్న పనిగా ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇందుకోసం రూ.8 వేల కోట్లు అవసరమవుతాయని ఆర్థికశాఖ ఇప్పటికే అంచనా వేసిన నేపథ్యంలో.. వీటిని ఏ విధంగా సమీకరిస్తారనేది వేచి చూడాల్సిన అంశంగా మారింది. రైతులకు రుణమాఫీ కింద గతేడాది వరకు సంవత్సరానికి రూ.4,250 కోట్ల చొప్పున నాలుగుసార్లు ప్రభుత్వం విడుదల చేసింది. 2017తో ఈ పథకం పూర్తయింది. అందువల్ల ఇప్పటి వరకూ రుణమాఫీ కోసం విడుదల చేసిన రూ.4,250 కోట్లను ఇప్పటి నుంచి 'ఎకరానికి నాలుగు వేల' పథకానికి మళ్లించనున్నారని సమాచారం. ఇవిపోను మిగతా రూ.3,250 కోట్లను ప్రభుత్వం సమకూర్చుకోవాల్సి ఉంటుంది. దీంతోపాటు మిషన్ భగీరథ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన 20 శాతం (రూ.4 వేల కోట్లు) నిధులను ఈ యేడాది విడుదల చేయాల్సి ఉంది. ఈ పథకాన్ని 2018 చివరి నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను కచ్చితంగా విడుదల చేయాలని ఆర్థికశాఖ వర్గాలు వివరించాయి. ఇప్ప టి వరకూ బ్యాంకులు, నాబార్డు రుణాల (బడ్జెటేతర)తో వీటి ని నడిపించారు. ఇందుకోసం ఆయా సంస్థలు దాదాపు రూ.25 వేల కోట్లను విడుదల చేశాయి. గతేడాది ప్రభుత్వం ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించింది. రానున్నది ఎన్నికల సంవత్సరం కాబట్టి రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీ లను దగ్గరకు చేర్చుకోవాలన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలో బీసీ కార్పొరేషన్‌కు కూడా పెద్ద మొత్తంలో నిధులను కేటాయించే అవకాశముంది. వీటిని ఏ విధంగా సమీకరిస్తారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇక సర్కారును కలవరపరిచే మరో అంశం భారీ స్థాయిలో పేరుకుపోయిన బకాయిలు. ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్పులు, ఆరోగ్య శ్రీ, ఉపాధి కల్పనా పథకాలు, డిస్కామ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కో, పౌర సరఫరాల శాఖ, పరి శ్రమలు, వడ్డీ లేని రుణాలు, స్థానిక సంస్థలు, వ్యవసాయ యాంత్రీకరణ, పాలీహౌజ్‌లు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం తదితరాంశాలకు కలిపి రూ.24 వేల కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

మూడున్నరేండ్ల టీఆర్ఎస్ హయాంలో వీటి గురించి పట్టించుకున్న నాథుడు లేడు. కానీ ఈ యేడాది వీటిని కచ్చితంగా విడుదల చేయాలి. లేదంటే వీటి ప్రభావం ఎన్నికలపై ఉంటుందని విశ్లేషకుల అంచనా. ఈ నేపథ్యంలో బకాయిల విడుదలకు అవసరమైన నిధుల సమీకరణ కత్తిమీద సామే కానుంది.

మరింత బొగ్గు సరఫరా చేద్దాం

- సింగరేణి సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు 24గంటలు విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిం దని, ఆ లక్ష్యానికి అనుగుణంగా మరింత బొగ్గు ఉత్పత్తి, సరఫరాను చేపట్టాలని సింగరేణి సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం నాడాయన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలల కాలవ్యవధిలో సంస్థ సాధించిన ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గతేడాదికంటే అధికంగా బొగ్గురవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో సంస్థ సాధించిన ప్రగతిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. 2016 డిసెంబర్ నాటికి సింగరేణి సంస్థ 427 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయగా, ఈ ఏడాది అదే సమయానికి 9 శాతం వృద్ధితో 467 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్టు తెలిపారు. ఓవర్ బర్డెన్‌లో గత ఏడాదికంటే 28 శాతం వృద్ధితో 282.9 మిలియన్ క్యూబిక్ మీటర్లు తొలగించినట్టు వివరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 419 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. మార్చి నెలాఖరు నాటికి రోజుకు 2.33 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.14 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలని లక్ష్యంగా నిర్దేశించుకు న్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్కేంద్రాలకు ఎలాంటి బొగ్గు కొరత రాకుండా సింగరేణీయులు శ్రమించాలని చెప్పారు.

గవర్నర్‌కు కేసీఆర్ కొత్త సంవత్సరం శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్‌కు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఉదయం ఆయన రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం గవర్నర్‌తో సీఎం పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా తెలుగు మహాసభల నిర్వహణ, రాబోవు బడ్జెట్ రూపకల్పన, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులపై చర్చించినట్టు తెలిసింది. సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి, సిటీ పోలీస్ కమిషనర్ వివి శ్రీనివాస్‌రావు, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డితో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు.

శాస్త్రీయ విద్యతోనే సమాజ మార్పు

- ఎంబి ట్రస్టు చైర్మెన్ తమ్మినేని వీరభద్రం
- ఎస్ఆర్ శంకరన్ స్టడీ హాల్ ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాస్త్రీయ విద్యతోనే సమాజ మార్పు సాధ్యమవుతుందని మాకినేని బసవపున్నయ్య (ఎంబి) ట్రస్టు చైర్మెన్ తమ్మినేని వీరభద్రం అన్నారు. ఎస్ఆర్ శంకరన్ నూతన స్టడీహాల్, సోలార్ ప్లాంట్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ముషీరాబాద్ చౌరస్తా దగ్గరలో ఉన్న భోలక్‌పూర్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ సమాజానికి ఎస్ఆర్ శంకరన్ వంటి ఉత్తమ మానవతా విలువలు కలిగిన ఐఏఎస్‌లు అవసరమని అన్నారు. ఈ ప్రయత్నం కోసమే ట్రస్టు ప్రారంభించామని చెప్పారు. సివిల్స్, ఇతర పోటీ పరీక్షల కోసం చదువుకునే అభ్యర్థులకు ఉపయోగపడాలని స్టడీహాల్, సోలార్ ప్లాంటును ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. కొత్త సంవత్సరంలో అనుకున్న లక్ష్యాలు సాధించేందకు అధ్యాపకులు సహక రించాలని, గట్టిగా కృషి చేయాలని కోరారు. ట్రస్టు సభ్యులు నంద్యా ల నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిజి నరసిం హరా వు, ఎస్వీకే కార్యదర్శి ఎస్ వినయకుమార్, సభ్యులు బి బిక్షమయ్య, ఎం శ్రీనివాస్, శంకర్‌స్వామి, శ్రీనివాసరావు, ఫ్యాకల్టీలు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమి కోఆర్డినేటర్ కె సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా గీట్ల ముకుందరెడ్డి

నవతెలంగాణ-జమ్మికుంట



సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కమిటీ కార్యదర్శిగా గీట్ల ముకుందరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా వర్ణవెంకట్‌రెడ్డి, మర్రి వెంకటస్వామితో పాటు మరో 8 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

రైతుల జీవితాల్లో వెలుగులు

- 24గంటల విద్యుత్‌ను ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

నిరంతర విద్యుత్ సరఫరాతో రైతుల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయని విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం అర్ధరాత్రి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కుడకుడ గ్రామ శివారులో గల కోమటికుంట ప్రాంతంలో రైతు జానకిరాములు వ్యవసాయక్షేత్రంలో 24గంటల విద్యుత్ సరఫరాను మంత్రి ప్రారంభించారు. రాష్ట్ర విభజన అనంతరం విద్యుత్ లోటుతో అత్యంత దయనీయ స్థితిలో ఉన్న రాష్ట్రాన్ని లోటును అధిగమించి ముఖ్యమంత్రి అగ్రస్థానంలో నిలిపారని అన్నారు. ఎన్ని అవాంతరాలు ఏర్పడినా రైతులకు 24గంటల కరెంట్ అందించి తీరుతామని స్పష్టం చేశారు. ఈ పథకం దేశ చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతుందని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ వై. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

24 గంటల కరెంట్‌తో ఇబ్బందే..!

- భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం : విలేకర్ల సమావేశంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-క్లాక్‌టవర్

24 గంటల కరెంట్‌తో రైతులకు ఇబ్బందులు తప్పవని అధికారులు చెబుతున్నా కేసీఆర్ మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ 24గంటల ఉచిత విద్యుత్‌ను ఇస్తున్నామని గొప్పుగా చెప్పుకుంటున్నాడని, కానీ రైతులు మాత్రం 24 గంటల విద్యుత్ సరఫరా వద్దని మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి నిర్వహించిన సభలో ఆందోళనలు చేశారని గుర్తు చేశారు. 10 గంటల పాటు కరెంట్ ఇస్తే సరిపోతుందని, 24 గంటల పాటు ఇవ్వడం వల్ల భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎకరాకు కోటి రూపాయల పంట పండించే కేసీఆర్‌కు ఈ విషయం తెలియదా అని ఎద్దేవా చేశారు. కొంత మంది నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో ఏ ఒక్క నాయకున్ని కూడా తాను తిట్టలేదన్నారు. ఒక్క రూపాయ కూడా లంచం తీసుకోలేదన్నారు. నిజాయితీగా నిబద్ధతతో పనిచేస్తున్నాని అన్నారు.

ఒక్క యూనిట్ విద్యుత్తూ ఉత్పత్తి కాలే

బహిరంగ చర్చకు సిద్ధం :

టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-హుజూర్‌నగర్

సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ఒక్క యూనిట్ విద్యుత్ ఉత్పత్తి కూడా జరగలేదనీ, దీనిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల కార్యకర్తల, ప్రజల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల బలిదానాలు చూసి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారాలకే పరిమితమైందన్నారు. నాగార్జునసాగర్, పోచంపాడు, శ్రీశైలం ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించారన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదన్నారు. జైపూర్ విద్యుత్‌ప్రాజెక్టు 1200మెగావాట్లు, భూపాలపల్లి విద్యుత్‌ప్రాజెక్టు 600మెగావాట్లు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మంజూరై పనులు ప్రారంభించారన్నారు. రాజకీయ కక్షతోనే తన నియోజకవర్గంలో ఇండ్ల నిర్మాణాలను నేటికీ పూర్తిచేయకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వరికి క్వింటాకు రూ.2వేలు, పత్తికి రూ.5వేలు, మిర్చికి రూ.10వేలు మద్దతు ధర కల్పిస్తామన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. నిరుద్యోగులకు నెలకు 3వేల రూపాయల భృతి ఇస్తామన్నారు. పింఛన్లు పెంచుతామని, షాదీఖానా, కళ్యాణలక్ష్మి పథకాలకు మరిన్ని నిధులు వెచ్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యరగాని నాగన్న, తన్నీరు మల్లిఖార్జున్, అమర్‌నాథ్‌రెడ్డి, జక్కుల మల్లయ్య, నిజామొద్దీన్‌పాల్గొన్నారు.

సెలవురోజూ సాట్స్‌లో హడావుడి!

పాత ఫైళ్లన్నీ వెతికిన సిబ్బంది

- సాట్స్ అధికారుల అవినీతి రెండో అంకం వెలుగులోకి



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'ప్రతిభ ఉంటే కాదు...పైసలిస్తేనే' శీర్షికతో నవతెలంగాణలో సోమవారం ప్రచురితమైన కథనంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (సాట్స్) అధికారుల్లో ఆందోళన మొదలైంది. సోమవారం సెలవుదినమైనా కొంతమంది ఉన్నతాధికారుల సూచనలతో కొందరు సిబ్బంది సాట్స్ కార్యాలయానికి వచ్చి పాత ఫైళ్లన్నీ పరిశీలించారు. కొందరికి ఫోన్ల ద్వారా సమాచారం సేకరించే ప్రయత్నం చేశారు. 'నవతెలంగాణ' కథనంతో 2017-18 విద్యాసంవత్సరంలో స్పోర్ట్స్‌కోటాలో ఎంబీబీఎస్ సీట్లు పొందిన వారి వివరాలు, వారు పొందుపర్చిన సర్టిఫికెట్లను పరిశీలించాలని ఓ ఉన్నతాధికారి ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. అయితే ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫైళ్లు ఆఫీసులో కనిపించలేదని సమాచారం. ఆంధ్రప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని 2017 జనవరిలో రాజస్థాన్‌లో జరిగిన రూలర్ స్కేటింగ్ ఇన్‌లైన్ హాకీ జాతీయ సీనియర్ ఉమెన్స్ విభాగంలో పాల్గొన్నది. కానీ సాట్స్ అధికారులు మాత్రం ఆ విద్యార్థినికి పతకం వచ్చినట్టు సర్టిఫై చేశారు. దీంతో ఆ విద్యార్థినికి స్పోర్ట్స్ కోటాలో ఎంబీబీఎస్ సీటు లభించింది. వాస్తవానికి విద్యార్థినికి 2016 డిసెంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండోస్థానంలో నిలిచింది. ఇదే విషయాన్ని 'నవతెలంగాణ' కథనం ఎత్తిచూపింది. ఇప్పటికే డబ్బులు ఇవ్వకపోవడంతో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు గుర్తింపు ఇవ్వలేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సాట్స్ సర్టిఫికెట్ల పరిశీలన కమిటీ ప్రతినిధులు, తాజాగా మరో వివాదంలో ఇరుక్కోవడంతో అధికారుల్లోనూ తీవ్ర అలజడి మొదలైంది. అయితే సాట్స్ అధికారులు సర్టిఫై చేసిన వివరాలూ వెబ్‌సైట్‌లోంచి తొలగించారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. సాట్స్ అధికారులపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది.

సమాచారమిచ్చేందుకు ససేమిరా..

అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా 2010 నుంచి 2017 వరకు మెడిసిన్, ఇంజినీరింగ్ విభాగాల్లో సీట్లు పొందిన వారి వివరాలు సమాచార హక్కు చట్టం ద్వారా ఇవ్వాలని ఒకరు సాట్స్ అధికారులను కోరారు. వీటికితోడు శాయ్ సర్టిఫై చేసిన క్రీడాకారుల వివరాలూ అడిగారు. అయితే అధికారులు జాతీయ స్థాయిలో ఆడిన వారి వివరాలు మాత్రమే ఇవ్వడంతో పాటు శాయ్ గుర్తించిన వివరాలు, ఇంజినీరింగ్ సీట్లు పొందిన వారి వివరాలను ఇవ్వలేదు. వాస్తవానికి అంతర్జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులకు సీట్లు లభించాయి. అయితే సరైన సమాచారం ఇవ్వకపోవడంతో రెండో అప్పిలెట్ అధికారికి ఆ వివరాలు కోరిన వ్యక్తి ఫిర్యాదు చేశారు. నిజంగా సర్టిఫికెట్ల పరిశీలన కమిటీ అధికారులు ఎలాంటి తప్పు చేయకుంటే, నిర్భయంగా అన్ని వివరాలు ఇవ్వొచ్చు కదా అని ఫిర్యాదుదారుడు వారిని ప్రశ్నిస్తున్నారు.

విద్యను రాజకీయ ఎజెండాగా మార్చాలి

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్

- టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాజకీయ ఎజెండాగా విద్యారంగాన్ని మార్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్ కోరారు. 2018 సంవత్సరంలో గ్రామస్థాయి నుంచి పార్లమెంటరీ వరకూ అన్ని రకాల ఎన్నికలు జరిగే అవకాశముందనీ, కాబట్టి ఈ సమయాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) 2018 నూతన సంవత్సర డైరీని, క్యాలెండర్‌ను ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కె నాగేశ్వర్ మాట్లాడుతూ...సామాజిక బాధ్యతను నిర్వహించాల్సిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆ పని మరిచిపోయా రని అన్నారు. ప్రజాసంఘాలతో కలిసి ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి, పాఠశాలలోని సదుపాయాలు, వసతులపై చర్చ పెట్టాలని కోరారు. ఉపాధ్యాయులు సర్కారు విధానాలను ప్రశ్నిస్తూనే, విధి నిర్వహణపైనా దృష్టిపెట్టాలని సూచించారు. శాసనమండలిలో యూటీఎఫ్ బలపరిచిన సభ్యులు లేకపోవడంతో విద్యారంగంపై ఆశించినంత చర్చ జరగడం లేదనీ, 2018 చివరి నాటికి మండలిలో యూటీఎఫ్ సభ్యులు చేరుతారనే విశ్వాసాన్ని అందరికీ కల్గించాలని అన్నారు.ఎస్‌టీఎఫ్ఐ ఉపాధ్య క్షులు నాగటి నారాయణ మాట్లాడు తూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే విధానాలను అవలంభిస్తున్నాయని మండిపడ్డారు. ఎస్‌టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు ఎం. సంయుక్త మాట్లాడు తూ...ప్రభుత్వాలు బాలిక విద్యకోసం ప్రత్యేక శ్రద్ధ వహించి, పాఠశాలల్లో వసతులు కల్పించడం ద్వారా డ్రాపౌట్స్‌ని తగ్గించవచ్చున్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎ నర్సిరెడ్డి, ఐక్య ఉపాధ్యా య పత్రిక సంపాదకులు మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు టి.లక్ష్మారెడ్డి, మేడె దేవదాసు, ఆంజనేయులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండల్‌రావు, సంజీవ్‌రావు పాటు వివిధ జిల్లాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన సీఎం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం (711) నూతన సంవత్సరం 2018 క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షులు కనకచంద్రం, ప్రధాన కార్యదర్శి శేఖర్, ప్రచార కార్యదర్శి పరంకుశం నాగేందర్, నాయకులు సిద్ధారెడ్డి, అశోక్, సురేష్, శ్రీను కలిసి సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం ప్రభుత్వ కాలేజీల అభివృద్ధికి కృషి చేస్తామని వారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం పాటుపడతామని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

అధికారం ఉన్నంత మాత్రాన ఎవరూ గొప్పవారు కాలేరు. దానిని వినియోగించే పద్ధతిని బట్టి గొప్పవారవుతారు. - విలియం జోన్స్

S & D

సంపాదకీయం

యువ భారతం

"మన్‌కీబాత్"లో ప్రధాని నరేంద్రమోడీ సుభాషితాలు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ ఆచరణే అందుకు విరుద్ధంగా ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. గత ఏడాది ఆఖరి 'మన్‌కీభాత్'లో ఆయన యువతను లక్ష్యంగా ఎంచుకున్నారు. 21వ శతాబ్దం ప్రారంభంలో జన్మించిన వారందరూ ఈ నూతన సంవత్సరంలో ఓటు హక్కును పొందబోతున్నారనీ.. వారే నవ భారత నిర్మాతలనీ కొనియాడారు. ఎన్నికల ప్రక్రియలో వారు ఎంత క్రియాశీలకంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకు అంత బలం చేకూరుతుందన్నారు. ఈ దేశంలో ప్రజాస్వామ్య విలువల గురించి, దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడం గురించి ఆయన యువతకు గొప్ప సందేశమిచ్చారు. కానీ గడిచిన మూడున్నరేండ్లుగా ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తూనే... అభివృద్ధి పథంలో యువతరం ఆశలను, ఆకాంక్షలను నిర్వీర్యం చేస్తూనే ఇప్పుడీ నీతులు వల్లించడం ఆయనకే చెల్లింది. కొత్తగా ఓటు హక్కు పొందబోయే ఈ సహస్రాబ్ది ఓటర్లతో కలిపి ఈ దేశంలో 18 నుండి 35 ఏండ్లలోపు ఓటర్లు 65శాతానికి పెరగనున్న నేపథ్యంలో ఈకొత్తతరం ఓట్లనన్నిటినీ గంపగుత్తగా ఒడిసిపట్టాలన్న తాపత్రయమే ఆయన ప్రసంగం నిండా కనిపిస్తోంది.

యువత రాజకీయాల్లోకి రావాలి. తమను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసే నేతలకు గుణపాఠం చెప్పాలి. దేశ జనాభాలో యువతరం 75శాతానికి చేరుకుంటున్న నేపథ్యంలో వారి ఆలోచనలకు, అభివృద్ధికి తగిన రాజకీయాల నిర్మాణం నేటి అవసరం.

ప్రధాని చెప్పినట్టు ఏదేశ నిర్మాణానికైనా యువతరమే కీలకం. కానీ మన దేశంలో యువత పరిస్థితేమిటి? అభివృద్ధిలో వారి పాత్ర ఏమిటి..? నిజానికి అపారమైన మానవ వనరులకు నిలయం మన దేశం. 130 కోట్లకు పైగా జనాభాతో చైనా తరువాత అత్యధిక జనాభా కలిగిన దేశంగా ప్రపంచంలో రెండవ స్థానంలో ఉన్నది. అయినప్పటికీ మానవ వనరులలో భారతదేశమే నెంబర్‌వన్...! ఎందుకంటే మన దేశ జనాభాలో 50శాతానికి పైగా యువజనులే..! ప్రపంచంలో మరేదేశానికి ఇంతటి యువసంపత్తి లేదంటే అతిశయోక్తి కాదు. కానీ విషాదమేమిటంటే మానవ వనరుల అభివృద్ధిలో మాత్రం ఈ దేశానిది అట్టడుగు స్థానం...!? "వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్" నివేదించిన గ్లోబల్ హ్యూమన్ క్యాపిటల్ ఇండెక్స్‌లో భారత్ 103వ స్థానంలో ఉంది. ప్రపంచ వ్యాపితంగా మానవ వనరులను అభివృద్ధి చేసుకుని, ఆ అభివృద్ధినే పెట్టుబడిగా ఉపయోగించుకోవడంలో వివిధదేశాల స్థితిగతులను తెలియజేస్తూ విడుదలైన ఈ సూచిలో భారత్‌కంటే వెనుకబడినవి పాకిస్థాన్, బంగ్లాదేశ్ మాత్రమే..! శ్రీలంక, నేపాల్ సైతం మనకంటే ముందుండడం గమనార్హం. తాను అందిస్తోన్న నైపుణ్యాభివృద్ధిని అందుకుని యువత అభివృద్ధిలోకి రావాలంటున్నారు ప్రధాని. అదే నిజమైతే ఈ దేశ యువతరంలో అత్యధికులు నైపుణ్యం అవసరం లేని ఉపాధిలోనే గడిపే దుస్థితి ఎందుకున్నదీ..? దశాబ్ధాలుగా నిరుద్యోగం ఈ దేశం నెత్తిన కత్తిలా వేలాడుతూనే ఉన్నది. ఇప్పుడు మోడీ హయాంలో కొత్తగా ఉద్యోగ అవకాశాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలు కూడా ఊడిపోతుండటంతో సమస్య మరింత తీవ్రమయింది. నేడు దేశంలో 30శాతానికి పైగా యువత ఉద్యోగం, ఉపాధి లేక కునారిల్లుతున్న స్థితికి కారకులెవరు..?



ఒకవైపు చదువుకు తగిన ఉపాధిలేక, ఉపాధికి అవసరమైన చదువు అందక నిరుద్యోగం దిన దిన ప్రవర్ధమానమవుతుంటే, మరోవైపు దేశంలో ప్రబలుతున్న అసహనం, అరాచకం, మతోన్మాదం, దిగజారుతున్న విలువలు యువతరం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. "యువతరానికి అన్నివేళలా బంగారు భవిష్యత్తును మనం నిర్మించలేకపోవచ్చు. కానీ భవిష్యత్ లక్ష్యాలకు దీటుగా వారిని మనం సిద్ధం చెయ్యగలం" అంటారు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్. ఆ తరహా దార్శనికతను ఏకోశానా కనపరచని మన ప్రధాని ప్రసంగాల్లో మాత్రం మాయచేస్తున్నారు. ఈ మూడున్నరేండ్ల మోడీ ఏలుబడిలో నిరుద్యోగంతో పాటు ఆకలి, పౌష్టికాహార లోపాలు అంతర్జాతీయ సగటును మించిపోయాయి. దేశంలో డిగ్రీలు అందుకున్న వారిలో 75శాతానికి ఉద్యోగ నైపుణ్యాలు లేవు. జనాభాలో సగానికి పైగా యువకులే ఉన్న ఈ దేశంలో చోటు చేసుకుంటున్న ఆత్మహత్యల్లో సగానికిపైగా 30ఏండ్ల లోపువారే అంటే అర్థమేమిటి..? నిరక్షరాస్యత, పేదరికం, ఆకలి, అనారోగ్యం, అసమానతలు ప్రపంచం ముందు దేశానికి తలవంపులు తెస్తున్నాయి. ఈ స్థితిని అధిగమించడానికి మోడీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలేమిటీ..? జాతి పురోభివృద్ధిలో యువతకు భాగస్వామ్యం కల్పించి, వ్యవస్థలోని లోపాలను సరిచేసుకుని ఆకలినీ, అవినీతినీ జయించిన దేశాలనేకం ఉన్నాయి. కానీ అటువంటి ఆలోచనలు, ప్రయత్నాలే లేకుండా కేవలం ప్రసంగాల వలన ప్రయోజనమేమిటి? ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటంలోని మర్మమేమిటి..?

ఇది యువత గుర్తించాలి. దేశాన్ని నిర్మించడానికి అవసరమైన రాజకీయ చైతన్యాన్ని అందిపుచ్చుకోవాలి. తమ భవిష్యత్తును, దేశ భవిష్యత్తును నిర్దేశించే చట్టసభల్లో భాగస్వామ్యం కోసం పోరాడాలి. ఈ దేశ సగటు భారతీయుడి వయసు 29 ఏండ్లు కాగా.. పార్లమెంట్ సభ్యుల సగటు వయసు 56 ఏండ్లు. దీనిని బట్టి మనదేశంలో రాజకీయాలకూ యువజనానికి మధ్య ఉన్న అగాధాన్ని అర్థం చేసుకోవచ్చు. ఈ అగాధాన్ని పూడ్చాలి. అందుకు యువత రాజకీయాల్లోకి రావాలి. తమను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసే నేతలకు గుణపాఠం చెప్పాలి. దేశ జనాభాలో యువతరం 75శాతానికి చేరుకుంటున్న నేపథ్యంలో వారి ఆలోచనలకు, అభివృద్ధికి తగిన రాజకీయాల నిర్మాణం నేటి అవసరం.

ప్రజావాణి

పంటల పండగ

ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతికి 10 రోజులు సెలవులు ఇచ్చేవారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత సంక్రాంతికి తెలంగాణ సర్కార్ మూడు రోజులే సెలవులు ఇవ్వడం సముచితంకాదు. సంక్రాంతి అంటే తెలుగువారందరికీ పెద్ద పండగ. ముఖ్యంగా ఇది పంటల పండగ. ఎడ్ల (బసవన్నల) పండుగ. పిండివంటల పండగ. పిల్లలు ఎంతో ఆనందంగా జరుపుకునే పతంగుల పండగ. రంగు రంగుల రంగవల్లులతో తెలుగువాకిళ్ళు శోభాయమానంగా కనువిందు చేసే కమనీయ పండగ. ఉద్యోగులు ఏదైనా విహార యాత్రకు కుటుంబ సమేతంగా వెళ్ళి రావాలన్నా కనీసం పదిరోజులు సెలవులు అవసరం అవుతాయి. ఇది కేవలం ఆంధ్రోళ్ళ పండగ కాదని, తెలుగువారంతా ఆనందగా ఆహ్లాదకరంగా జరుపుకునే పండుగ. కాబట్టి సంక్రాంతికి కూడా పాఠశాలలకు పదిరోజులు సెలవులు ఇవ్వాలని తెలంగాణ సర్కార్‌కి విజ్ఞప్తి.

ఎస్. భూదేవి, నిజామాబాద్.

బస్సులో చిల్లర లొల్లి

దేశంలోనే అతి పెద్ద రవాణా సంస్థగా ప్రసిద్ధి చెంది, లక్షలాది మంది ప్రయాణికులను గమ్యానికి చేర్చే రోడ్డు రవాణా సంస్థ చిల్లర గొడవలతో సతమతమవుతోంది. ముఖ్యంగా మహా నగరాలలో టికెట్ చార్జీలు రూ.7, రూ.11 ఇలా వివిధ ప్రాంతాలకు వివిధ రకాలుగా ఉంటాయి. ప్రయాణికులు రూ.7 టికెట్ కోసం పది ఇస్తే మూడు రూపాయలు టికెట్ వెనుక రాసి ఇవ్వడంతో బస్సు దిగే సమయంలో కొందరు ప్రయాణికులు మర్చిపోతుంటారు. మరికొందరు కండక్టర్లు ప్రయాణికుడు బస్సు దిగే సమయంలో చిల్లర లేదని గొడవ పెట్టి మూడు రూపాయలు ఇవ్వాల్సిన చోట రూపాయి, రెండు రూపాయలు ఇవ్వడమో లేదా అసలుకే లేదని చెప్పడంతో గొడవలు జరుగుతున్నాయి. కావాలనే బస్సు కండక్టర్లు ఇలా చేస్తున్నారని కొందరు వాపోతున్నారు. నిజానికి కండక్టర్లకు చిల్లర సమకూర్చవలసిన బాధ్యత డిపో వారు తీసుకోవాలి. అలా చేయకపోవడం లేదా తక్కువ చిల్లర ఇవ్వడం వంటి పరిణామాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కండక్టర్లు చెప్తున్నారు. ప్రయాణికులు మాత్రం చిల్లర కోసం తమను మధ్యలోనే ఆపి బస్సు నుండి దింపుతున్నారనీ, పరుష పదజాలంతో మాట్లాడుతున్నారనీ వారి బాధ వెళ్లగక్కుతున్నారు. బస్సు దిగేది లేదని ప్రయాణికులు గొడవ పడి పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లిన సందర్భాలున్నాయి. దీనికి పరిష్కార మార్గం బస్సుస్టేషన్‌లో చిల్లర మిషన్ ఏర్పాటు చేయడం. ఆర్టీసీ వారు తగిన చిల్లర కండక్టర్లకి ఇచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

- విజ్జు, హైదరాబాద్.

భారత పారిశ్రామికరంగం.. భ్రమ.. వాస్తవం!



సురజిత్ మజుందార్

వర్తమాన 2017-18 సంవత్సర రెండవ త్రైమాసికంలో స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు పునరుత్తేజం చెందటానికి కారణం పారిశ్రామిక రంగంలో వృద్ధి మెరుగుపడటమే కారణమని చెబుతున్నారు. 2017-18 సంవత్సర మొదటి త్రైమాసికంలో 1.2శాతానికి పడిపోయిన పారిశ్రామికరంగ వృద్ధి రేటు ఇదే ఏడాదిలోని రెండవ త్రైమాసికం కల్లా 7శాతానికి గంతు వేసింది. కాబట్టి నోట్ల రద్దు తరువాత కొంతకాలం పడిపోయిన పారిశ్రామిక వృద్ధి తిరిగి పట్టాలు ఎక్కినట్టు కనపడుతున్నది. అయితే 2011-12ను ఆధార సంవత్సరంగా చేసుకుని తయారుచేసిన స్థూల జాతీయోత్పత్తికి చెందిన తాజా డేటా భారత పారిశ్రామిక రంగానికి సంబంధించిన స్వల్ప, దీర్ఘ కాల ధోరణులను గందరగోళపరిచేదిగా ఉన్నది.

పారిశ్రామిక రంగంలో ఉద్యోగ కల్పన కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. వర్తమాన దశాబ్దం ఆరంభం కాకమునుపే ఉద్యోగ కల్పన దాదాపుగా సంఘటిత పారిశ్రామిక రంగంలోనే కేంద్రీకృతమైంది. ఇది కూడా 2011-12 సంవత్సరం తరువాత క్షీణించటం మొదలయింది. భారత పారిశ్రామిక రంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నది. వాస్తవం ఇందుకు భిన్నంగా ఉన్నదని ఎవరైతే వాదిస్తారో వారికి ఈ సంక్షోభానికిగల మౌలిక కారణాలను తెలుసుకుని, వాటిని పరిష్కరించే సామర్థ్యం ఉండకపోవచ్చు.

2015 సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తికి చెందిన నూతన డేటా సిరీస్ వచ్చిన దగ్గరి నుంచీ ఈ డేటాను సేకరించే పద్ధతి ఆమోదయోగ్యంగా లేదు. స్థూల జాతీయోత్పత్తిలో పారిశ్రామిక రంగం పాలును నిర్ధారించటానికి ఉపయోగించే జోడింపబడిన స్థూల విలువ(గ్రాస్ వాల్యూ యాడెడ్-జీవీఏ)ను మదింపుచేసే పద్ధతిలో తీసుకువచ్చిన మార్పు వివాదాస్పదమైంది. పారిశ్రామికంగా ఉత్పత్తి చేయబడిన అదనపు స్థూల విలువ అంటే ఒక పరిశ్రమలో ఉత్పత్తికి సంబంధించిన స్థూల విలువ నుంచి అందులో వినియోగించబడిన ఇంటర్‌మీడియట్ ఇన్‌పుట్స్‌ను తీసివేయగా వచ్చేది. ఈ విలువను గతంలో ఉత్పత్తిచేసే సంస్థ స్థాయిలో లెక్కగట్టే వారు. అయితే గత విధానాన్ని మార్చి ప్రస్తుతం దీనిని ఫ్యాక్టరీ స్థాయిలో లెక్కగడుతున్నారు. జీవీఏ డేటాతో కనిపించే వృద్ధి రేటుకు, ఉత్పత్తి పరిమాణాన్ని కొలిచే పారిశ్రామిక ఉత్పత్తి సూచిక(ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్-ఐఐపీ) ఆధారంగా తేలే వృద్ధికీ చాలా తేడా ఉండటం వలన ఈ పద్ధతి అనుమానాస్పదంగా కనపడుతున్నది. మొదటి పద్ధతితో పటిష్టమైన వృద్ధి రేటు ఉన్నట్టు కనపడుతుంటే, 2011-12 సంవత్సర ద్వితీయార్థం నుంచీ పూర్తి స్థాయిలో స్తబ్ధత నెలకొన్నట్టు రెండవ పద్ధతి ప్రకారం అందుతున్న డేటా తెలియజేస్తున్నది. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే స్థూల జాతీయోత్పత్తికి చెందిన డేటాను, పారిశ్రామిక ఉత్పత్తి సూచికకు సంబంధించిన డేటాను ఒకే సంస్థ అందిస్తున్నది. ఆ సంస్థ పేరు సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్(సీఎస్‌ఓ).

ఈ మధ్యకాలంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచికకు సంబంధించిన ఒక నూతన సిరీస్ ప్రవేశపెట్టారు. నూతన స్థూల జాతీయోత్పత్తి సిరీస్ లాగానే దీనికి కూడా 2011-12 సంవత్సరం ఆధార సంవత్సరంగా ఉన్నది(అంతకు ముందటి సిరీస్‌కు ఆధార సంవత్సరం 2004-05). 'ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న నిర్మాణాత్మక మార్పులను గ్రహించి సూచీల ప్రాతినిధ్యాన్నీ, నాణ్యతను మెరుగుపర్చటమే ఈ సవరణల లక్ష్యం' అని ప్రభుత్వం ప్రకటించింది. గత ఐఐపీ సిరీస్‌తో పోల్చినప్పుడు ఈ నూతన సిరీస్‌తో పారిశ్రామిక రంగానికి సంబంధించి మరింత పటిష్టమైన డేటా అందుతుందని ఎవరైనా ఆశిస్తారు. ఇది కొంత మేరకు జరిగినప్పటికీ పారిశ్రామిక ఉత్పత్తికి చెందిన జీవీఏ డేటాకు, ఐఐపీ డేటాకు మధ్య గల తేడా పరిష్కరించలేకపోయింది. 2011-12 సంవత్సరం తరువాత పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటును ఈ సూచీలు విభిన్నంగా చూపుతున్నాయి.

2012-13 నుంచి 2017-18 దాకా పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటును వివిధ సూచీలు విభిన్నంగా చూపటం మనకు కనిపిస్తుంది. వర్తమాన సంవత్సర మొదటి త్రైమాసికంలో కంటే రెండవ త్రైమాసికంలో పారిశ్రామిక వృద్ధి రేటు జీడీపీ డేటా సూచిస్తున్నంత పటిష్టంగా ఐఐపీ డేటా చూపడం లేదు. పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు పడిపోవటాన్ని మూడవ త్రైమాసికం మొదటి నెలలో కూడా గమనిస్తాం. ఇలా లేని వృద్ధి రేటును ఉన్నట్టుగా ప్రభుత్వం ప్రచారం కోసం వాడుకుంటున్నది. అయితే అందుబాటులోవున్న సమాచారం ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామికీకరణ ప్రక్రియ దీర్ఘకాలంగా దెబ్బతింటున్నదనే వాస్తవాన్ని ఈ ధోరణి మరుగు పరచటం చాలా తీవ్రమైన విషయం. వర్తమాన ధరలలో మొత్తం స్థూల జాతీయోత్పత్తిలో పారిశ్రామిక ఉత్పత్తి వాటా నిలకడగా తగ్గిపోతున్నట్టు ఈ నూతన జీడీపీ సిరీస్ కూడా తెలుపుతున్నది. దీనిని 2012-2013, 2013-2014, 2014-2015, 2015-2016, 2016-2017, 2017-2018 ప్రథమార్ధాలకు చెందిన పాత ఐఐపీ సూచికల నేపథ్యం(2004-05 ఆధార సంవత్సరం)లో 1.3, -0.8, 2.3, 2.0 నూతన ఐఐపీ(2011-12 ఆధార సంవత్సరం), 4.8, 3.6, 3.8, 2.9, 4.3,2.0 జీవీఏ(నూతన జీడీపీ సిరీస్) 2011-12 ధరలు 5.5,5.0, 8.3, 10.8, 7.9, 4.0వద్ద పారిశ్రామిక ఉత్పత్తి సూచిక నూతన సిరీస్‌ను అనుసరించి 2012-13 నుంచి 2016-17 సంవత్సరాల మధ్య పారిశ్రామిక వృద్ధి రేటు ఏ ఏడాదిలోనూ 5శాతాన్ని చేరలేదు. మూడేండ్లపాటు అది 4శాతానికి లోపే ఉన్నది. అదే కాలానికి సంబంధించిన జీడీపీ సిరీస్‌ను బట్టి వృద్ధి రేటు ఏ ఏడాదిలోనూ వార్షికంగా 5శాతానికి తగ్గలేదు. అది ఒక ఏడాది దాదాపు 11శాతం సమీపానికి చేరింది! 2014-15 సంవత్సరంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిని మరింతగా చూపటం కొట్టొచ్చినట్టు కనపడుతున్నది. ఈ ప్రభుత్వ పాలనలో జీడీపీ డేటాకు పారిశ్రామిక ఉత్పత్తి సూచీలకు చెందిన డేటాతో ఏమాత్రం సారూప్యత ఉండటం లేదు. ఈ కింది విషయం ఈ



రెండింటి మధ్యగల తేడాను చక్కగా వివరిస్తుంది. జీడీపీ సిరీస్‌ను అనుసరించి 2013-14 సంవత్సరంతో పోల్చినప్పుడు 2016-17 సంవత్సర పారిశ్రామిక ఉత్పత్తి 30శాతం పెరిగింది. అయితే ఈ పెరుగుదల కనాకష్టంగా 11శాతం మాత్రమే ఉన్నదని ఐఐపీ డేటా తెలియజేస్తున్నది.

సరిగ్గా ఇటువంటి తేడానే పారిశ్రామిక ఉత్పత్తిపై నోట్ల రద్దు ప్రభావం గురించిన రెండు సూచీల డేటాలో కనపడుతున్నది. జీడీపీ డేటాను అనుసరించి 2017-18వ సంవత్సరంలో కేవలం మొదటి త్రైమాసికంలోనే నోట్ల రద్దు ప్రభావం చేత పారిశ్రామిక వృద్ధి దెబ్బతిన్నది. ముందటి సంవత్సరంతో తరువాత సంవత్సరాన్ని పోల్చినప్పుడు ఉండే వృద్ధి రేటు 2016-17 సంవత్సర మూడవ త్రైమాసికంలో అంతకుముందు ఏడాది అదే త్రైమాసికంలోకంటే 8.2శాతం ఎక్కువ ఉన్నది. నాలుగవ త్రైమాసికంలో అది హేతుబద్ధంగా 5.3శాతం ఉన్నది. అయితే దీనిని ప్రస్తుతం మొదటి త్రైమాసికంలో తగ్గిన తరువాత రెండవ త్రైమాసికంలో 7శాతం ఉన్నట్టుగా మార్చారు. మరోవైపు అప్పటికే అంతంత మాత్రంగావున్న పారిశ్రామిక ఉత్పత్తి నోట్ల రద్దుతో మరింతగా కుదేలయిందని ఐఐపీ డేటా తెలియజేస్తున్నది. దీని నుంచి పారిశ్రామిక ఉత్పత్తి ఇప్పటికీ కోలుకోలేదు. 2016 సంవత్సరం జులై నెల నుంచి 2017 సంవత్సరం అక్టోబరు నెలదాకా పారిశ్రామిక ఉత్పత్తి తిరోగమనంలో ఉన్నట్టు ఐఐపీ డేటా తెలియజేస్తున్నది. 2016 సంవత్సరం నవంబరు నుంచి పారిశ్రామిక ఉత్పత్తి తీవ్ర స్థాయిలో పడిపోయినట్టు ఈ డేటాలో కనపడుతున్నది. ప్రస్తుత సంవత్సరంలో మొదటి త్రైమాసికం కంటే రెండవ త్రైమాసికంలో వచ్చిన పెరుగుదల జీడీపీ డేటాతో పోల్చినప్పుడు నామమాత్రంగానే ఉన్నట్టు ఐఐపీ డేటా సూచిస్తున్నది. అలా పారిశ్రామిక ఉత్పత్తి ఇప్పటికీ స్తబ్దంగానే ఉన్నది(మూడవ త్రైమాసికంలో ఇది మరింతగా కుంగింది).

ఈ విధంగా నోట్ల రద్దు ప్రభావంచేత హేతుబద్ధంగా ఊహించగలిగే పారిశ్రామిక జీవీఏ వృద్ధిలో ఏర్పడిన ఒడిదుడుకులను ఐఐపీ డేటా నిలకడగా ప్రతిబింబిస్తున్నది. నిజానికి పారిశ్రామిక ఉత్పత్తిలో ఏర్పడిన ఒడిదుడుకులను అర్థశాస్త్ర పరంగా అర్థవంతంగా వివరించటం సాధ్యపడదు. కాబట్టి దీనితో భారత పారిశ్రామిక ఉత్పత్తి తీరుతెన్నులను వివరించటంలో జీడీపీ డేటా ఆధారపడదగిన సూచిక కాదని తెలుస్తున్నది. ఈవిధంగా మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జీడీపీ సిరీస్ డేటా జరగని పారిశ్రామిక జీవీఏ వృద్ధిని జరిగినట్టుగా సూచిస్తున్నది. అదే సమయంలో పారిశ్రామిక వృద్ధిపై నోట్ల రద్దు వాస్తవంలో చూపిన దుష్ప్రభావాన్ని అది దాచిపెడుతున్నది. ఏవిధంగా చూసినా స్థూల జాతీయోత్పత్తిలో పారిశ్రామిక ఉత్పత్తి వాటా 1990 దశకంలోనే అత్యున్నత స్థాయికి చేరింది. పారిశ్రామిక రంగంలో ఉత్పాదక సామర్థ్యాన్ని సృష్టించగలిగే లేక పెంచగలిగే పెట్టుబడులలో ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి ఒక దశాబ్ద కాలంగా స్తబ్దత ఏర్పడింది. ఇవి పునరుత్తేజం చెందుతున్న దాఖలాలు ఏమాత్రం కనిపించటం లేదు. మొత్తంమీద పెట్టుబడుల ప్రవేశానికి సంబంధించిన ఈ పరిస్థితి మొత్తం ఆర్థిక వ్యవస్థలో నెలకొన్నది. ఈ వాస్తవం నూతన జీడీపీ సిరీస్ డేటాలో కూడా కనపడుతున్నది. పారిశ్రామిక రంగంలో ఉద్యోగ కల్పన కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. వర్తమాన దశాబ్దం ఆరంభం కాకమునుపే ఉద్యోగ కల్పన దాదాపుగా సంఘటిత పారిశ్రామిక రంగంలోనే కేంద్రీకృతమైంది. ఇది కూడా 2011-12 సంవత్సరం తరువాత క్షీణించటం మొదలయింది. భారత పారిశ్రామిక రంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నది. వాస్తవం ఇందుకు భిన్నంగా ఉన్నదని ఎవరైతే వాదిస్తారో వారికి ఈ సంక్షోభానికిగల మౌలిక కారణాలను తెలుసుకుని, వాటిని పరిష్కరించే సామర్థ్యం ఉండకపోవచ్చు.

అనువాదం: నెల్లూరు నరసింహారావు,
సెల్:8886396999

సావిత్రీబాయి ఫూలే స్మృతిలో.... స్త్రీ సమానత్వం కోసం...



ఎస్. పుణ్యవతి

జనవరి 3న సావిత్రీబాయి పూలే జన్మదినం. పూలే దంపతులు అభ్యుదయ విలువల కోసం ఎంతో శ్రమించారు. కులవ్యవస్థను ప్రతిఘటించారు. కుల దురహంకారాన్ని, అణచివేతను వ్యతిరేకించారు. అణగారిన వర్గాల ప్రజలను, స్త్రీలను అక్కున చేర్చుకున్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలు జరిపించేందుకు 150ఏండ్ల క్రితమే పెద్దఎత్తున పోరాటాలు చేశారు. అభాగ్య వితంతు స్త్రీలకు ధైర్యం చెప్పి వారికి, వారి బిడ్డలకు ఆత్మవిశ్వాసం కల్పించారు.

సావిత్రీబాయి పూలే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. స్త్రీవిద్యను నిషేధించిన ఆ రోజుల్లోనే స్త్రీలకు విద్యను నేర్పించేందుకు పాఠశాలను ప్రారంభించారు. అగ్రవర్ణ ఛాందసవాదులు ఆమెపై దాడి చేసి, పేడనీళ్ళు కొట్టినా ఆమె వెనుకాడలేదు. ప్రతి రోజూ స్కూలుకు అదనంగా ఒక చీరను సంచిలో పెట్టుకుని వెళ్లేవారట.

అయితే మళ్ళీ ఛాందసవాదం పాత పద్ధతుల్లో విజృంభిస్తోంది. స్త్రీల హక్కులపై దాడి చేస్తోంది. ఆడపిల్లలకి రక్షణ కల్పించడం చేతగాక తిరిగి వారిపైనే అభాండాలు వేస్తోంది. ఇటీవల బెనారస్ హిందూ యూనివర్సిటీ ఘటనల వంటివి కొన్ని ఉదాహరణలు. సాయంత్రం 6 గంటల తర్వాత ఆడపిల్లలు బయట తిరగరాదని, ఇంటికే పరిమితం కావాలని, ఆడవాళ్ళు బయట పనిచేయరాదని, గృహమే కదా స్వర్గసీమ అనే భావాలు తిరిగి మొలకెత్తుతున్నాయి. చిన్నారులపై కూడా లైంగికదాడులు ఎందుకు జరుగుతున్నాయో ఈ పాలకులు పట్టించుకోరు. ఇదిలా ఉంటే కొన్ని సందర్భాల్లో మేధావులు, న్యాయవ్యవస్థలో ఉన్న జడ్జీలు కూడా స్త్రీల హక్కులను, వ్యక్తిత్వాన్ని గుర్తించేందుకు నిరాకరిస్తున్నారు. 498ఏ పై జరుగుతున్న రగడ ఇందుకు ఉదాహరణ.

భారత శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ - ఐపీసీ) 498ఏ ప్రకారం భర్త లేక అతని బంధువులు పెట్టే గృహ హింస నుండి స్త్రీలకు రక్షణ లభిస్తున్నది. కట్నం కోసం గానీ, మరే ఇతర కారణంగా గాని శారీరకంగా లేక మానసికంగా పెట్టే గృహహింస కొన్ని సందర్భాల్లో ఎంత తీవ్రంగా ఉండవచ్చంటే, దానివల్ల బాధిత స్త్రీ జీవితానికి భద్రత లోపించడం, ఆమె ఆరోగ్యానికి హాని కలిగించడం, చివరికి జీవితం పట్ల విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకునే స్థితికి కూడా దారి తీయవచ్చు. నేరం రుజువైతే మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు.

ఒక వేళ బాధిత స్త్రీ కట్నం వేధింపుల కారణంగా చనిపోతే అది హత్యగావచ్చు, ఆత్మహత్యగావచ్చు, నేరస్తులకు సెక్షన్ 304బి ప్రకారం శిక్షలు పడవచ్చు. చట్టం దాన్ని వరకట్న మరణంగా భావిస్తుంది.

భారతీయ సమాజంలో ఇప్పటికే మనం ఎంత అభివృద్ధి చెందామను కుంటున్నా పితృస్వామ్య భావజాలం చాలా బలంగా ఉంది. ఇంకా సమాజంలో పురుషుని లాగే స్త్రీని కూడా సర్వ హక్కులు కలిగిన వ్యక్తిగా చూడటంలేదు. పెండ్లి అయిన స్త్రీ, ఆమె ఎంత చదువుకుని ఉద్యోగమే చేయనీ, వ్యవసాయమే చేయనీ, ఏదో ఒక పని చేసి కుటుంబాన్ని పోషించనీ అత్తవారింటిలో అణగి ఉండాల్సిందే.

భర్త కుటుంబం మంచితనం మీద ఆమె వ్యక్తిగత సుఖం, సంతోషం, వైవాహిక జీవితం ఆధారపడి ఉన్నాయి. సంసార జీవితంలో ఏ ఇబ్బంది వచ్చినా బయటకి పొక్కరాదు. అదేమంటే సీతా, సావిత్రి కథలు ఉండనే ఉన్నాయి. నాలుగ్గోడల మధ్య ఏం జరిగినా బయటికిరాదు, సాక్ష్యం దొరకదు.

ఈ స్థితిలో వరకట్న బాధితులైన ఇల్లాళ్ళు మరో మార్గం లేకే చెడి పుట్టింటికి చేరకూడదనే సామెతలు రుజువు చేస్తుంటారు. వైవాహిక జీవితంలో సర్దుకుపోతుంటారు. తీరా జరగాల్సింది జరిగి వేధింపులకు గురయినా, హత్య లేక ఆత్మహత్య కారణంగా మరణించినా సాక్ష్యాలు దొరకవు. ఆ



కారణంగానే మహిళా ఉద్యమం ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా ఐపీసీలో 498ఏ, 304బి సెక్షన్లు చేర్చడం జరిగింది.

ఇప్పుడు 498ఏ కీ ఎసరొచ్చింది. ఆడవాళ్ళు అమాయకులైన భర్త, అతని బంధువులను వేధించడానికి ఈ సెక్షన్లు దుర్వినియోగం చేస్తున్నారని కోర్టుల్లో వాదనలు, జడ్జీలు కూడా అపోహపడే స్థితి వచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు జూలై 27న ఒక తీర్పునిచ్చింది. ఆ తీర్పు ప్రకారం 498ఏ క్రింద బాధిత మహిళ ఏదైనా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేస్తే, వెంటనే అరెస్టు చేయడానికి లేదు. ప్రతి జిల్లాలో ముగ్గురు పెద్ద మనుషులతో 'ఫ్యామిలీ వెల్‌ఫేర్ కమిటీ'లను ఏర్పాటు చేస్తారు. వచ్చిన కేసులను ఈ కమిటీలు పరిశీలించిన తర్వాత వేధించిన భర్త అతని బంధువుల్ని అరెస్టు చేయాలా, వద్దా అనే విషయం పోలీసు వారు నిర్ధారిస్తారన్నమాట. ఏ చట్టానికి లేని ముందస్తు తనిఖీలు ఈ చట్టానికెందుకో.

కానీ వాస్తవాలు కోర్టు ఆలోచనా విధానానికి భిన్నంగా ఉన్నాయి. 2015లో ప్రకటించిన ప్రభుత్వ రిపోర్టు ప్రకారం వరకట్న మరణాలు 2014లో 8,455, 2013లో 8,083 నమోదయ్యాయి. అంటే సరాసరిన రోజుకు 21 మంది వరకట్నం కారణంగా మరణిస్తున్నారు. గృహ హింస కేసులు ఒక్క 2015లో లక్షా 13వేలు నమోదయ్యాయి. వైవాహిక జీవితంలో స్త్రీలు పడే హింసకు, స్త్రీ అస్వాతంత్ర్యానికి ఇవి నిదర్శనం. మహిళా సంఘాలు సుప్రీంకోర్టు ముందు ఆందోళన చేయడం, ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కారణాలు ఏమైనా కోర్టు పునరాలోచనలో పడింది.

గతంలో ఇచ్చిన తీర్పులో చెప్పినట్టు కోర్టులకున్న న్యాయాధికారాలను ఫ్యామిలీ వెల్‌ఫేర్ కమిటీలకు బదలాయించడం సరైందికాదని చెప్తూ గతంలో ఇచ్చిన తీర్పును పునర్విచారణకు స్వీకరించింది.

అందువల్ల ఈ దశలో పౌరసమాజం స్పందించి అత్యున్నత న్యాయస్థానానికి మన ఆవేదన నివేదించడం అవసరం. జనవరి 3 సావిత్రిబాయి పూలే జన్మదినం. ఏ ఛాందసవాదానికి వ్యతిరేకంగా మహాత్ములు పూలే దంపతులు జీవితాలు అర్పించారో ఆ స్ఫూర్తిని నింపుకోవాలి. ■

మెయిల్ @ నవతెలంగాణ

ఉద్యమానికి ఊపిరి..స్ఫూర్తికి పట్టం!




శ్రీనివాస్ చిరిపోతుల

తెల్లదొరల పాలనపై పోరుకు జాతీయ పతాకం ప్రజలను సంఘటితం చేసింది. ప్రజా ఉద్యమానికి ఊపిరులూదింది. కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతోపాటు మధ్యలో అశోకుడి ధర్మచక్రంతో రూపొందించిన పతాకానికి 1947 జూలై 22న రాజ్యాంగ సభ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2002లో నాటి ఎన్‌డీఏ ప్రభుత్వం వీటిలో మార్పులు తెచ్చింది. 2005లో కూడా మరికొన్ని మార్పులు చేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో తొలుత 1906 ఆగష్టు 7న కలకత్తాలోని గ్రీన్‌పార్కులో ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కొద్దిపాటి మార్పులతో రెండోసారి రూపుదిద్దుకున్న పతాకాన్ని 1907లో ఆవిష్కరించారు. 1917లో హోంరూల్ ఉద్యమ సమయంలో అనిబిసెంట్, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ కొద్దిపాటి మార్పులతో పతాకాన్ని ఆవిష్కరించారు. 2002 జనవరి 26న ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా-2002 పేరుతో సరికొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. జాతీయ పతాకం పట్ల అత్యంత గౌరవంగా, మర్యాదగా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, దాన్ని అగౌరపరిచే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వాటిల్లో పేర్కొన్నారు. జాతీయ పతాకం పట్ల నాయకులు తగినంత గౌరవం చూపడం లేదన్న విమర్శలు కోకొల్లలుగా ఉన్నాయి. పతాకం ప్రాధాన్యంపై ప్రజల్లో చైతన్యం, విద్యార్థుల్లో అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తు న్నాయన్న విమర్శలు ఈ రోజువి కావు. వివిధ సందర్భాల్లో వారిపై నమోదైన కేసులే ఇందుకు నిదర్శనం. ఉదాహరణకు బాలీవుడ్ నటి మల్లికా శెరావత్ జాతీయ పతాకాన్ని ఒంటిపై కప్పుకున్న కారణంగా 2014 సెప్టెంబర్ నెలలో కేసు నమోదైంది. 2008లో సానియా మీర్జాపై భోపాల్‌కు చెందిన న్యాయవాది కేసు పెట్టారు. ఎన్నికల సమయంలో జాతీయ పతాకం పట్ల అగౌరవంగా వ్యవహరించరాదనీ, అందుకు భిన్నంగా వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామనీ 2014 లోక్‌సభ ఎన్నికల ముందు రాజకీయ పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం గట్టిగానే హెచ్చరించింది. ఈ మేరకు అప్పట్లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించింది. దేశాలే కాదు అంతర్జాతీయ సంస్థలు సైతం తమకంటూ ప్రత్యేక పతాకాలను రూపొందించు కోవడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 64దేశాలు తమ పతాకాల్లో మత సంబంధ అంశాలను చొప్పించాయి. ఐరోపా, ఆసియా ఖండాల్లోని 31దేశాలు తమ జాతీయ పతాకాల్లో మత సంబంధ, 21దేశాలు ఇస్లామిక్, మరికొన్ని దేశాలు బౌద్ధాన్ని, ఇజ్రాయెల్ యూదు మత సంబంధ అంశాలను పతాకాల్లో మిళితం చేశాయి. ఇందుకు భిన్నంగా భారత జాతీయ పతాకం రూపొందించడం నిస్సందేహంగా గొప్ప విషయం. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా పతాకాన్ని రూపొందించినందుకు భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. స్వేచ్ఛ, సమానత్వం, లౌకికవాదం, అందరికీ సమాన ప్రాధాన్యం ప్రాతిపదికగానే భారత రాజ్యాంగం రూపకల్పన జరిగింది. ఈ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లడం పౌరుల కర్తవ్యం.

సెల్: 9603471199

సెల్ఫ్ కేర్ టిప్స్...



గాలిలో తేమ శాతం పెరగడం వల్ల కూడా పొడి దగ్గు ఎక్కువవుతుంది. ఇక దగ్గు నుంచి ఉపశమనం పొందాలంటే తప్పని సరిగా కొన్ని చిట్కాలు పాటించాల్సిందే!

- పొడి దగ్గు త్వరగా తగ్గాలంటే గోరు వెచ్చటి నీటిని తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. దాంతో పాటు శ్వాస సంబంధిత ఇబ్బంది కూడా ఉండదు.
- జలుబు ఎక్కువైతే ముక్కు కారడం సహజం. అయితే ఈ ప్రభావం ముఖ్యంగా గొంతు నొప్పికి, ఇన్ఫెక్షన్‌కు కారణం అవుతుంది. ఆ సమయంలో ముక్కులో రెండు చుక్కల నాసల్ డ్రాప్స్ వేసుకుంటే సరిపోతుంది.
- ముఖ్యంగా చలికాలంలో ఆందోళన, అధిక రక్తపోటు ఉన్న వారు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి. లేదంటే సమస్య ప్రమాదకరంగా మారే అవకాశం ఎక్కువని చెబుతున్నాయి కొన్ని పరిశోధనలు.
- వైద్యుల సలహా లేకుండా చిన్నారులకు నాసల్ డ్రాప్స్ ఉపయోగించరాదు. అలా చేయడం వల్ల శ్వాస సంబంధిత ఇబ్బందులు వచ్చే అవకాశం ఎక్కువ. జలుబు, ముక్కుదిబ్బడ ఎక్కువగా ఉంటే ఆవిరి పట్టడం మంచిది.
- ఎక్కువగా నాసల్ డ్రాప్స్ ఉపయోగించడం వల్ల ఎలర్జీ, మంట, గొంతు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి వీలైనంత వరకు సహజ సిద్ధంగా తగ్గించుకోవడానికి ప్రయత్నిచడం మంచిది.
- శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి. దాంతో పాటు రోజుకు కనీసం నాలుగు సార్లు సబ్బుతో లేదా శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. ❄

ఇండోర్ వ్యాయామాలు...



రెగ్యులర్‌గా వ్యాయామం చేసే వారు కూడా కొన్నిసార్లు చలికి భయపడిపోతారు. అలాంటి వారు ఇంట్లోనే ఉండి వ్యాయామాలు చేయడం మంచిది. అలాంటి కొన్ని ఇండోర్ వ్యాయామాలు మీ కోసం...

- చలికాలం జిమ్‌కు వెళ్లలేని వారు ఇంట్లోనే ఉండి యోగా చేయడం మంచిది. ఇలా చేయడం వల్ల మానసికంగా, శరీరకంగా ఒత్తిడి దూరం అవుతుంది.
- ముఖ్యంగా చలికి భయపడి నడవడం మానేస్తారు చాలా మంది. అలాంటి వారు స్వెటర్ తో పాటు కాళ్లకు, చేతులను వెచ్చగా ఉండేలా గ్లౌజ్‌లు వేసుకొని ఇంట్లోనే 1000 అడుగులు వేస్తే సరిపోతుంది.
- అలాగే గోరు వెచ్చటి నీటిలో నిమ్మరసం కలుపుకొని తాగినా శరీర బరువు అదుపులో ఉంటుంది. నిమ్మరసం బరువు తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుంది.
- అలాగే ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్స్ అధికంగా తీసుకోకపోవడం మంచిది. ఇవి రక్త ప్రసరణ వేగాన్ని మరింత పెంచుతాయి.
- బరువు పెరగకుండా ఉండటానికి చాలామంది డైట్‌ను ఫాలో అవుతుంటారు. అలా చేయడం వల్ల బరువు కొంత వరకు అదుపులో ఉంచుకోవచ్చు. కానీ ఇతర ఆరోగ్య సమస్యలు వస్తాయని గుర్తుంచుకోవాలి.
- ఒకేసారి ఎక్కువ ఆహారం తీసుకోకుండా కొద్ది కొద్దిగా ఎక్కువ సార్లు తిన్నా సరిపోతుంది. కొలెస్ట్రాల్ పదార్థాలకు దూరంగా ఉండాలి. ❄

సాండీ టానెర్ మోస్సెల్ అలెగ్జాండర్...

WOMEN of the day



సాడీ టానెర్ మోస్సెల్
(2జనవరి1898-1నవంబర్ 1989)

సాండీ అనగా అందం, చురుకుదనం, గొప్ప భావాలు కలిగి ఉండే అమ్మాయి అని అర్థం. ఆ పేరుకు తగ్గట్టు జీవించారు సాండీ టానెర్ మోస్సెల్ అలెగ్జాండర్. ఆమె 1898 జనవరి 2వ తేదిన ఆరోన్ ఆల్బర్ట్ మోస్సెల్, మేరీ లూయిసా టాన్నెర్ కు జన్మించింది. వాషింగ్టన్ వీధి పాఠశాలల్లో తన విద్యభ్యాస్యాన్ని పూర్తి చేసింది. సాండీ చదువు విషయంలో చాలా సీరియస్‌గా ఉండేది. అందుకే ఎప్పుడు క్లాస్ ఫస్టు వచ్చేది. ప్రతి సబెక్టులో తనదైన ప్రతిభను చాటేది. అందుకే ఉన్నత విద్య అభ్యసించడానికి ఫిలడెల్ఫియా లోని పెన్సిల్వేనియా విశ్వ విద్యాలయంలో అవకాశం లభించింది.

1921 లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఆర్థిక శాస్త్రంలో యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియా లా స్కూల్ నుంచి పిహెచ్‌డి పట్టాను చట్టబద్దంగా పొందిన ఆఫ్రికన్-అమెరికన్ తొలి మహిళ. ఆర్థిక శాస్త్రంలో ఎన్నో సేవలు అందించి ఫ్రాన్సిస్ సెర్జెంట్ పెప్పర్ ఫెలోషిప్ పురస్కారం కూడా పొందారు. దాంతో పాటు 1919-1923 వరకు డెల్టా సిగ్మా తీటా సోరోరిటీకి జాతీయ అధ్యక్షురాలుగా పని చేశారు. ఆ సమయంలోనే మోస్సెల్ రేమండ్ పేస్ అలెగ్జాండర్‌ను వివాహం చేసుకున్నది. వివాహనాంతరం పెన్సిల్వేనియా బార్లో మెంబర్‌గా చేరింది. ఆ తర్వాత ఇద్దరు కలిసి చురుకుగా పౌర హక్కుల రక్షణ కోసం పని చేశారు. అలాగే 1943-1947 వరకు నేషనల్ బార్ సెక్రెటరీగా పని చేసిన మొట్టమొదటి మహిళ సాండీ. 1946 లో భార్యభర్తలు కలిసి 'హ్యారీ ట్రూమాన్' స్థాపించారు. దాంట్లో చట్ట హక్కుల పరిరక్షణ కమిటీ మెంబర్‌గా, హ్యూమన్ రిలేషన్స్ కమిషర్‌గా పని చేసింది. భర్త మరణం తర్వాత ఒక సాధారణ న్యాయవాదిగా జీవితాన్ని కొనసాగించింది. తన జీవిత కాలంలో సమాజానికి ఎన్నో సేవలు అందించింది. అందుకే ప్రజల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది సాండీ. 1989లో అండోరాలోని కెథడ్రల్ గ్రామంలో అల్జీమర్స్, న్యుమోనియా వ్యాధితో మరణించింది.

తేమ అందించాల్సిందే !



- సహజ సిద్ధమైన నూనెలు చర్మాన్ని హైడ్రేట్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అలాంటి వాటిలో ఉత్త మమైనది ఆలివ్ ఆయిల్. ఈ నూనెను రాత్రి పడుకునే ముందు చర్మానికి పట్టించడం వల్ల చర్మం మృదువుగా తయారవుతుంది. ఆలివ్ నూనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మృత కణాలను తొలగిస్తాయి. దాంతో పాటు ముఖంపై ఉండే ముడతలు, మచ్చలను మాయం చేస్తాయి.
- తేనె మంచి మాయిశ్చరైజర్. తేనెను నేరుగా చర్మానికి పట్టించాలి. ఇలా పది నిమిషాలు పట్టించిన తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగితే సరిపోతుంది. ఇలా పలుమార్లు చేస్తే మంచి పలితం కనిపిస్తుంది.
- చర్మం బాగా పొడిబారితే ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు ముఖానికి, చేతులకు, భుజాలకు, మోకాళ్లకు, మెడకు పట్టించాలి. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా, కాంతివంతంగా తయారవుతుంది.
- కలబంద రసం చర్మాన్ని సౌందర్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తుంది. కలబంద రసాన్ని ముఖానికి పట్టించాలి. పది నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగితే చాలు ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ❄

అలంకారంగా కలంకారీ



సహజమైన రంగులను అద్ది వస్త్రాలపై బొమ్మలను చిత్రించే ఓ అద్భుతమైన కళ 'కలంకారీ' సొంతం. పూర్వం బౌద్ధ ఆరామాలను కలంకారీ వస్త్రాలతోనే అలంకరించే వారట. అందుకే ఆ చిత్రకళకు అంత ప్రత్యేకత సంతరించుకున్నది. ఇంతటి విశిష్టత కలిగిన ఈ చీరలు నేటి తరం యువత మనసును ఆకట్టుకున్నాయి. అందుకే కలంకారీ మగువకు ఓ అలంకారమే కదా! కాటన్ చీర మీద వివిధ రంగుల్లో ఉండే డిజైన్లు, ఆకులు, బొమ్మలు, లతలు చాలా స్పష్టంగా, అందంగా ఉంటాయి. ఏ శుభకార్యానికైనా సరే కలంకారీ చీరలు ఇట్టే నప్పుతాయి. చాలా సింపుల్‌గా, హుందాగా కనిపించే ఈ చీరలనే మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.. అలాంటి అపూర్వమైన కలంకారీ చీరలు మీ కోసం...

ఐత్యాల ముగ్గులు



ఓ తెల్ల కాగితంపై ముగ్గు వేసి, చక్కటి రంగులతో నింపి మాకు పంపండి. ముగ్గు వేసే విధానం అర్థమయ్యేలా ఉండాలి. ముగ్గులోని చుక్కల సంఖ్య, ఇతర వివరాలను కూడా చేర్చండి. మీ పేరు, చిరునామాతో పాటు మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో కూడా జతచేయండి.

మా చిరునామా

మానవి, నవతెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్. భవన్,
21/1, అజామాబాద్, హైదరాబాద్-20. ఇ-మెయిల్:
navamaanavi@gmail.com

రొమ్ము క్యాన్సర్...




క్యాన్సర్... పేరు వినగానే తెలియని భయం, ఆందోళన మొదలవుతుంది. క్యాన్సర్ ప్రమాదకారే కానీ ప్రాణాంతకం కాదు అంటున్నారు నిపుణులు. అయితే నగరాల్లో ఉండే మహిళలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారని కొన్ని పరిశోధనల ద్వారా తెలిసింది. దీనికి కారణం లేటు వయసు పెండ్లి, బిడ్డకు పాలు ఇవ్వకపోవడం, చక్కెర పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం. పై వాటిలో కొన్ని మార్పులు చేసుకుంటే క్యాన్సర్ కు దూరంగా ఉండొచ్చని చెబుతున్నారు నిపుణులు.

- ఫైబర్ (పీచు) ఉండే ఆహారాన్ని అధికంగా తీసుకోవాలి. దీంతో పేగుల్లో వచ్చే క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న ఆహారాన్ని తగినంత తినాలి. పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటే సరిపోతుంది.
- శరీరానికి తగినంత వ్యాయామం అవసరం. రోజూ 20-25 నిమిషాలు వ్యాయామం చేస్తే మంచిది. ఇలా క్రమం తప్పకుండా చేస్తే ఒత్తిడి కూడా దూరం అవుతుంది.
- శరీర బరువును అదుపులో ఉంచుకోవడం ముఖ్యం. ఉండాల్సిన దానికంటే ఎక్కువ బరువు ఉంటే తగ్గించుకోవాలి.
- గ్రీన్ టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు సూర్యరశ్మిలోని అతినీల లోహిత కిరణాల ప్రభావం నుంచి రక్షిస్తాయి. ఫలితంగా చర్మ క్యాన్సర్ దూరం అవుతుంది. రోజూ తీసుకునే ఆహారంలో వేపుళ్లకు దూరంగా ఉండాలి.
- నగరాల్లో ఉండే మహిళలకు రొమ్ము క్యాన్సర్ కేసులు పెరగడానికి ప్రధాన కారణం లేటు వయసు పెండ్లిళ్లు, బిడ్డకు తల్లి పాలు ఇవ్వకపోవడం.
- ఎక్కువ సమయం కూర్చొని పని చేయడం, కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల కూడా క్యాన్సర్ కు దారితీస్తోంది. దీనికి కారణం హార్మోన్ల అసమతుల్యత, పని ఒత్తిడి.
- కాలుష్యం, ముఖ్యంగా వాహనాల పొగలో ఉండే కార్బన్ మోనాక్సైడ్ ఊపిరితిత్తుల క్యాన్సర్ కు దారితీస్తుంది.
- ఒత్తిడికి దూరంగా ఉండి ఆనందంగా జీవించడం క్యాన్సర్ ను దూరం చేసే మార్గాల్లో ఒకటి.
- క్యాన్సర్ అంటే భయపడిపోకుండా అందుబాటులో ఉండే చికిత్సల గురించి తెలుసుకొని ధైర్యంగా ఉండటం మంచిది. ❄

21 చుక్కలు
1వచ్చే వరకు సూటి చుక్క



ఎస్. భాగ్యలక్ష్మి
వరంగల్



19 చుక్కలు
సందు 11 వచ్చేవరకు



ఎన్. స్పందన
5వ తరగతి,
జయశంకర్, భూపాలపల్లి

సీఎం కేసీఆర్‌ను కలిసిన జనసేన అధినేత



హైదరాబాద్ : ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జనసేన అధినేత, నటుడు పవన్ కళ్యాణ్ కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు పవన్ కళ్యాణ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయానికి 24 గంటలు కరెంటు ఇచ్చే విధంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చొరవను పవన్ ప్రశంసించారు. అసాధ్యం కానీ ఈ పనిని సుసాధ్యం చేశారని కేసీఆర్‌ను కొనియాడారు. ఇటీవల రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి కోవింద్‌కు ఇచ్చిన విందులోనూ కేసీఆర్,పవన్‌లు చర్చించుకున్న విషయం విదితమే. ఇలా వారిద్దరూ దశలవారీగా కలుస్తుండటంపై భవిష్యతు ఎన్నికల సమీకరణలేనని రాజకీయపరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

మాకు 'ఉరే' గతి..!

- ఫార్మా-డి విద్యార్థుల వినూత్న నిరసన



తిరుపతి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట డాక్టర్ ఆఫ్ ఫార్మశీ విద్యార్థులు చేపట్టిన రిలే దీక్ష ఆరోరోజుకు చేరుకుంది. సోమవారం వినూత్న రీతిలో 'మాకు ఉరే గతి' అంటూ మెడకు ఉరితాళ్లు వేసుకుని, నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా డి-ఫార్మసీ విద్యార్థి సంఘం నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ 2008లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ ఆఫ్ ఫార్మశీ విద్యను అభ్యసించి ప్రతి ఏడాదీ వెయ్యిమందికిపైగా విద్యార్థులు పట్టభద్రులవుతున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాల కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్‌పై ఎలాంటి భరోసా లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయకపోతే ఉరే సరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, డాక్టర్ ఆఫ్ ఫార్మశీ పట్టభద్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 'పలాస' ఇన్‌చార్జి హఠాన్మరణం



రామారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు

మందస : ప్రజాశక్తి శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్ ఇన్‌చార్జి జన్ని రామారావు (46) గుండెపోటుతో సోమవారం హఠాన్మరణం చెందారు. ఉదయం ఏడు గంటల సమయంలో అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించే లోపే ఇంటి వద్ద కన్నుమూశారు. అంత్యక్రియల నిమిత్తం భౌతికకాయాన్ని మందస మండలం హరిపురంలోని రామారావు అత్తారింటికి తీసుకెళ్లారు. మంగళవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కంచిలి మండలం బూరగాం గ్రామంలో జన్ని ధర్మారావు, అంకమ్మల ముగ్గురు కుమారుల్లో మొదటి సంతానం రామారావు. చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు భావజాలంతో ఉన్న ఆయన విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐలో చురుగ్గా పనిచేశారు. సీపీఐ(ఎం) ఉద్యమాల్లో పనిచేస్తూ ప్రజాశక్తి సోంపేట మండల విలేకరిగా 1998 నుంచి 2002 వరకూ కొనసాగారు. 2002 నుంచి పలాస డివిజన్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. 21 ఏళ్ల కిందట మందస మండలం హరిపురం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మిని ఆదర్శ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు.

పోలీసుల అదుపులో మౌజన్ హత్యకేసు అనుమానితుడు



అనంతపురం : రాజమండ్రిలోని లాలాచెరువు మసీదు మౌజన్ హత్యకేసులో అనుమానితుడిని పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని శ్రీలంక కాలనీలో నివాసముండే తమిళనాడు కు చెందిన మణిరతన్ (మణి) ఈ హత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. అతడిని గుంతకల్లు పోలీసులు అదుపులోకి తీసుకుని రాజమండ్రి పోలీసులకు అప్పగించినట్టు సమా చారం. మణిరతన్‌కు ముందు నుంచే నేర ప్రవృత్తి ఉంది. అతడిపై గతంలో రెండు హత్యకేసులు, అక్రమంగా ఆయుధాలు కలిగున్న కేసు ఉన్నాయి. ఈ కేసులను విచారించి కొట్టివేసి నట్టు తెలుస్తోంది.

అంబేద్కర్, రంగా విగ్రహాలు ధ్వంసం

కేసు నమోదు, క్లూస్‌టీం రాక

తూర్పుగోదావరి: కొత్తపేట మండలం అవిడిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన కొత్త సంవత్సర వేడుకల్లో ఇరుగ్రూపులకు చెందిన యువకుల మధ్య ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీసింది. దీంతో అంబేద్కర్, రంగా విగ్రహాలతోపాటు రెండు మోటారు సైకిళ్లను ధ్వంసం చేశారు. ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకున్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని అవిడి సెంటర్లో ఆదివారం రాత్రి పెత్తందార్లకు చెందిన కొందరు యువకులు చలిమంట కాగుతున్నారు. పెల్లెళ్లవారిపేట, రాళ్లగుంటకు చెందిన దళిత యువకులు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల యువకులు జై కాపు, జై మాల అంటూ నినాదాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇరుగ్రూపుల మధ్య వాగ్వివాదం నెలకొంది. ఈ ఘర్షణలో పెత్తందార్లకు చెందిన యెరుబండి సత్తిపండు గాయపడ్డాడు. ఆగ్రహించిన పెత్తందారీ యువకులు కులం పేరుతో దూషిస్తూ దళిత యువకులపై దాడికి పాల్పడ్డారు. దళిత యువకుడు చిల్లి సురేష్‌కుమార్‌ను గాయపర్చారు. రెండు మోటారు సైకిళ్లను ధ్వంసం చేశారు. అనంతరం ఇరుగ్రూపులూ ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకున్నారు. గ్రామ కచేరి చావడి వద్దనున్న అంబేద్కర్ విగ్రహం చేతిని, సమీపంలోని వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమలాపురం డిఎస్‌పి ప్రసన్నకుమార్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసు జాగిలాలను రప్పించి పరిశోధించారు. గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు.

సమాధికి గుంత తవ్వలేదని వెలి వేశారు!

కర్నూలు: సమాధికి సకాలంలో గుంత తవ్వలేదన్న నెపంతో దళితులను వూరి నుంచి వెలివేసిన ఘటన కర్నూలు జిల్లా రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. మృతదేహాన్ని ఖననం చేసేందుకు గుంత తవ్వడానికి దళితులను పిలువగా ఇద్దరే అందుబాటులో ఉన్నందున గుంత తీయలేమని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో మృతిని కుటుంబీకులే 24 గంటలపాటు కష్టపడి గుంతతీసి ఖననం చేయాల్సి వచ్చింది. దీంతో, ఈ పరిస్థితికి దళితులే కారణమని భావించిన గ్రామస్థులు వారి కాలనీకి నీటిని అందించే గొట్టాలను మూసివేశారు. దళితులతో మాట్లాడినా, నిత్యావసర వస్తువులు విక్రయించినా జరిమానా విధిస్తామని వూరిలో దండోరా వేయించారు. దీంతో దళితులు రుద్రవరం పోలీసులను ఆశ్రయించారు. సమాచారం తెలుసుకున్న దళిత సంఘాల నేతలు గ్రామాన్ని సందర్శించారు. రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామానికి చేరుకొని నష్టనివారణ చర్యలు చేపట్టారు.

తెలుగు భాష పరిరక్షణ సంవత్సరం

ముఖ్యమంత్రి చంద్రబాబు

- విజయవాడ పుస్తక మహోత్సవం ప్రారంభం



విజయవాడ 29వ పుస్తక మహోత్సవం ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య, పక్కన ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి: తెలుగు భాషా పరిరక్షణ సంవత్సరంగా 2018ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ప్రారంభమైన విజయవాడ 29వ పుస్తక మహోత్సవ సభలో ఆయనీ ప్రకటన చేశారు. ఈ మహోత్సవాన్ని ప రాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు ప్రారంభిస్తూ పుస్తకాలు సమకాలీన జీవన విధానం, భాష, సంస్కృతికీ అద్దం పడతాయని తెలిపారు. అమ్మలాంటి మాతృభాషను మరచిపోకూడదని సూచించారు పార్లమెంట్ సమావేశాలున్నా పుస్త కాలంటే ఇష్టం కనుకే తాను ఈ కార్యక్రమానికి హాజరయ్యానన్నారు. సాంస్కృతిక విభాగంలో గ్రంథాలయ విభాగాన్ని విలీనం చేయడం శుభపరిణామమంటూ, ఈ నిర్ణయం తీసుకున్న చంద్రబాబును ఆయన అభినందించారు. కళలు, సాహిత్యానికి ఒకప్పుడు విజయవాడ కేంద్రంగా ఉండేదన్నారు. పుస్తక ప్రచురణ కేంద్రాలు ఇక్కడి నుంచే మొదలయ్యాయని గుర్తుచేశారు. సమాజాన్ని నిర్మిస్తూ, జ్ఞానాన్ని పెంచుతుంది కనుకే అక్షరాన్ని దైవంగా భావిస్తామన్నారు. ఎన్నో ప్రగతిశీల ఉద్యమాల్లో పుస్తకాలే చైతన్యం కలిగించాయన్నారు. అందుకు గ్రంథాలయోద్యమాలూ సాగాయన్నారు. ప్రపంచీకరణతో పుస్తకాలు చదివేవారి సంఖ్య తగ్గినా మనదేశంలో పుస్తకాలు చదివే వారి సంఖ్య పెరిగిందని నీల్సన్ సర్వేలో వెల్లడైందన్నారు. ఇటీవల కొన్ని సినిమాల్లో భాష అభ్యంతరకరంగా ఉంటోందన్నారు. సినిమాలు కుటుంబ సమేతంగా చూసేలా ఉండాలని సూచించారు. పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలని సూచించారు. రాజకీయ నాయకులెందరో వచ్చి పోతుంటారని, కానీ కవులు, రచయితలు మాత్రం వారి రచనల రూపంలో ఎప్పటికీ ప్రజల మాటల్లో నిలిచిపోతారన్నారు. రాజధాని అమరావతిలో వేసే రహదారులకు తెలుగు భాష గుర్తుండేలా పేర్లు ఉండాలని వెంకయ్య సీఎంకు సూచించారు.

సాంస్కృతిక , గ్రంథాలయ శాఖల విలీనం

సాంస్కృతిక శాఖలో గ్రంథాలయ విభాగాన్ని విలీనం చేయాలని నిర్ణయించామని, అందువల్ల సిబ్బంది, నిధుల కొరత తీరి, పుస్తకాలను మరింత ప్రచారం చేయవచ్చని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. చరిత్రను కాపాడుకోవాలంటే పుస్తకాలు అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాలన్న ఉద్దేశంతోనే ఎన్టీఆర్ మెమోరి యల్ ట్రస్ట్ కూడా విజయవాడ పుస్తక మహోత్సవంలో గతేడాది నుంచి భాగస్వామి అవుతోందన్నారు. విజయవాడ సాహిత్యం, సంస్కృతి, కళలకు పుట్టినిల్లు వంటిదన్నారు. ఇక్కడి నుంచే కృష్ణా, ఆంధ్రపత్రిక, విశాలాంధ్ర, ప్రజాశక్తి వంటి పత్రికలు ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి గొప్ప కళాకారులు కృష్ణా జిల్లా నుంచే వచ్చారని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగు భాషను మర్చిపోకూడదన్నారు. భాష ఉంటేనే ఉనికి, సంస్కృతి ఉంటాయన్నారు. మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, కృష్ణా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమెస్కో ప్రతినిధి విజయకుమార్, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సిఇఒ విష్ణు, విజయవాడ బుక్ ఫెస్టివల్ అధ్యక్షులు వెంకట నారాయణ, గౌరవాధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నా కష్టానికి కూలీ ఇవ్వండి

అమరావతి : ఎన్నికల కోసం పనిచేస్తే ప్రజలు నమ్మరని, తన కష్టానికి ప్రజలు కూలీ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. తమకు అన్ని సీట్లు గెలిపిస్తారని, అందులో అనుమానమే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశా భావం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అన్నీ చేసిన తరువాత ప్రజలెందుకు తమకు ఓటేయకూడదని సిఎం వ్యాఖ్యానించారు. ఒక్క సీటు గెలిపించలేకపోయినా ఎందుకు గెలిపించలేక పోయారో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. పోలవరం విషయంలో కాలయాపన లేకుండా అనుకున్నట్లు జరిగితే బాగుండేదన్నారు. ఈ ప్రాజెక్టుకు ఎలా పూర్తి చేయాలో ఆ విధంగా పూర్తి చేస్తామన్నారు. 2018 పూర్తయ్యేలోపు అమరావతి, పోలవరం ప్రాజెక్టులను కొలిక్కి తీసుకొస్తామన్నారు.

నాటక రంగానికి ఎప్పటికీ వన్నె తగ్గదు

- సాంఘిక నాటకోత్సవాల ప్రారంభంలో రంగస్థల నటులు



రంగ స్థల దర్శకులు చింతా కబీర్ దాసులును ఘనంగా సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ: కళారంగానికి అమ్మ ఒడిలాంటిదైన నాటక రంగానికి ఎప్పటికీ వన్నె తగ్గదని పలువురు రంగ స్థల నటులు అన్నారు. రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతీ సమితి సౌజన్యంతో మహతి క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రథమ సాంఘిక నాటకోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రముఖ చలనచిత్ర నటులు ఉప్పులూరి సుబ్బరాయ శర్మ నేతృత్వంలో విజయవాడలోని సిద్ధార్థా ఆడిటోరియంలో మూడు రోజులపాటు ఈ నాటకాలు నిర్వహించనున్నారు. ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాటక రంగ ఆచార్యులు మదలి నాగభూషణశర్మ మాట్లాడుతూ.. కథను నాటికీయంగా మలచడంలో దర్శకుడి పాత్ర అద్వితీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రంగ స్థల దర్శకులు చింతా కబీర్ దాసులును ఘనంగా సత్కరించారు. అనంతరం కబీర్ దాసులు మాట్లాడుతూ.. ఔత్సాహికులు ఎవరైనా ముందుకు వస్తే నాటక రంగానికి సంబంధించిన శిక్షణ అందిస్తానన్నారు. తొలిరోజు 'చందాల బరువెంత', 'సారీ రాంగ్ నెంబర్' నాటకాలను ప్రదర్శించారు. ఈ సభకు రంగ స్థల నటులు డిఎస్ దీక్షిత్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆకాశవాణి మాజీ సంచాలకులు పాండురంగ, విశ్రాంత అధికారి మాడుగుల రామకృష్ణ, సుబ్బరాయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య, సాంకేతిక శాస్త్రవేత్త అప్పాజోస్యుల

- డిప్యూటీ చైర్మెన్ మండలి



అప్పాజోస్యుల సత్యనారాయణను సత్కరిస్తున్న బుద్ధప్రసాద్, జొన్నవిత్తుల, తదితరులు

గుంటూరు: తెలుగు సాహిత్యం, గణిత శాస్త్రంలో విశిష్ట పరిశోధనలు చేసిన ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ తెలుగు వాడు కావడం గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆచార్య అప్పాజోస్యులకు 'సారస్వత భాస్కర' బిరుదును అందించి సత్కరించారు. ఈ సందర్భంగా గుంటూరు కళాపరిషత్ కార్యదర్శి బండ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ మాట్లాడారు. అప్పాజోస్యుల సత్యనారాయణ అమెరికాలో అత్యుత్తమ గణిత శాస్త్రవేత్తగా, బోధకునిగా ఉంటూనే నిరంతరం తెలుగు భాష, సాహిత్యం అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని చెప్పారు. సినీ పాటల రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు పద్యానికి విశ్వాంతరాల్లో పట్టంగట్టిన అప్పాజోస్యులతో తక్కువసేపు మాట్లాడినా సాహిత్యంలో అనేక అంశాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఆయన రచించిన సుగుణాద్య శతకం నాటి నన్నయ్య నుడికారం నుంచి విశ్వనాథుని సత్యనారాయణ భావోత్పాతం వరకూ కనిపిస్తాయని వివరించారు. కార్యక్రమంలో సంస్కృతి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.బాలచందర్, పి.మృత్యుంజయరావు, కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ డాక్టర్ కాత్యాయని విద్మహే, అమెరికాలోని రోవెన్ విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ కందాళం రామానుజాచారి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

వ్య.కా.సం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

తాడేపల్లి : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వాలు పేద ప్రజలను మోసం చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని అమరారెడ్డినగర్‌లో సోమవారం నిర్వహించిన దర్శనపు హుస్సేన్ ప్రజాసంఘాల కార్యాలయ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కార్యాలయం ప్రజల సమస్యల పరిష్కార వేదికగా పని చేస్తుందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఒక్కొక్కరికీ బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న బీజేపీ మాట తప్పిందని, మరోవైపు ఆహారంపై ఆంక్షలు పెడుతూ దళితులు, ముస్లిం మైనారిటీలపై గో గూండాలు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. ప్రశ్నించిన లౌకికవాదులనూ హత్య చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కావాలని కోరి అందుకోసం నికరంగా నిలబడిన పార్టీ సీపీఐ(ఎం) మాత్రమేనని గుర్తుచేశారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఇళ్లు నిర్మించే పని వదిలేసి, కొంపలు కూల్చేపని మొదలు పెట్టిందని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో రాత్రికిరాత్రి వందల ఇళ్ళు నేలమట్టం చేశారని, రానున్న రోజుల్లో రేషన్ షాపులు మాయమవుతాయని చెప్పారు. దేశంలో 40 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారని, కేరళలోనే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి : నూతన సంవత్సరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉద్యోగులు స్ఫూర్తిమంతమైన పనితీరును కనబరచి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌బాబు నేతృత్వంలో ఆ సంఘ నాయకుల బృందం సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాజధాని నిర్మాణం, ప్రజలకు సేవలందిచడంలోను ఉద్యోగులు నిబద్ధత కూడిన పనితీరును చూపుతున్నారని, ఇదే విధానాన్ని భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని కోరారు. మంగళవారం నుంచి జనవరి 11 వరకు నిర్వహించే జన్మభూమిలో ఉద్యోగులు భాగస్వామ్యం కావాలన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆనంద సూచికను దేశానికే ఆదర్శంగా నిలపడంలో మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర నేతలు పి విరేంద్రబాబు, సిహెచ్ అజయ్‌కుమార్, జగదీశ్వరరావు, ఎఎస్‌విఎస్ బాపూజి, ఎవివిఎస్‌వివి నరసింహం, పి కృపావరం, మహిళా ప్రతినిధి రాజ్యలక్ష్మి, కృష్ణా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ విద్యాసాగర్, ఎండి ఇక్బాల్ తదితరులున్నారు.




చేనేత పార్కులు ఏమయ్యాయి?: జగన్

మదనపల్లె: చేనేత పార్కులు ఏర్పాటు చేస్తామని చెప్పిన చంద్రబాబు, హామీలను తుంగలో తొక్కారని ప్రతిపక్షనేత కాంగ్రెస్ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గంలో ప్రజాసంకల్ప యాత్రను పూరై మదనపల్లి మండలంలోకి ప్రవేశించింది. కురబలకోట మండలం ముదివేడు క్రాస్ వద్ద ప్రారంభమైన ప్రజాసంకల్ప యాత్ర కడప క్రాస్, నల్లగుట్లపల్లి మీదుగా కొనసాగింది. అక్కడనుంచి సీటీఎం రైల్వేస్టేషన్ మీదుగా రైల్వేగేటు నుంచి కాశీరావుపేట వరకు సాగింది. గిట్టుబాటు ధర రాక సంక్షోభంలో చిక్కుకున్న నేతన్నలు చేనేత రంగంలో మనుగడ కొనసాగించలేక అల్లాడుతున్నామని, న్యాయం చేయాలని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. సీటీఎం రైల్వేగేటు వద్ద ఏర్పాటు చేసిన చేనేత ఆత్మీయ సదస్సులో నేత కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. ఇళ్లు కట్టించి, మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. వెబ్‌సైట్ నుంచి మ్యానిఫెస్టోను మాయం చేసినట్లే హామీల అమలును చంద్రబాబు విస్మరించారని ధ్వజమెత్తారు. చేనేత కార్మికులకు రద్దు చేస్తామన్న రుణాలు గానీ, బ్యాంకు రుణాల మాఫీగానీ చేస్తామన్న వాగ్దానాలను విస్మరించారన్నారు. ధర్మవరంలో 35 మంది, మదనపల్లిలో 28 మంది నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదన్నారు. నేతన్నలకు 45 ఏళ్లకే రెండువేల రూపాయల పెన్షన్ ఇస్తామన్నారు. ఈ సంకల్పయాత్రలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మదనపల్లి ఎంఎల్ఏ దేశాయ్ తిప్పారెడ్డి, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి గుండ్లూరు షమీమ్‌అస్లాం పాల్గొన్నారు.

అసత్యాలతో ప్రజలకు సీఎం లేఖ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అమరావతి : నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అసత్యాలు, అర్ధ సత్యాలతో లేఖ రాశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విమర్శించారు. ఈ మేరకు చంద్రబాబుకు సోమవారం రామకృష్ణ లేఖ రాశారు. ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. పరిపాలన యంత్రాంగం ఇంతగా అవినీతి, లంచగొండితనంలో కూరుకుపోవడం ఎన్నడూ చూడలేని, ఏడాది కాలంలో ఏసీబీ దాడుల్లో దాదాపు 2,500 కోట్లు సీజ్ చేశారని వివరించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అక్రమ సంపాదనలో మునిగి తేలుతున్నారని, ఫిరాయింపులకు పెద్ద పీట వేసి రాజకీయాల్లో నైతిక విలువలకు పాతరేశారని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోతోందని చెప్పుకోవడం 'మీకే చెల్లించదని' ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని పదేపదే ప్రకటనలు ఇచ్చారని, అనంతపురం జిల్లాలో కార్ల ఫ్యాక్టరీ ఎక్కడా జాడ కనబడలేదని విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణం పత్రికా ప్రకటనలకు, కలర్‌ఫుల్ డిజైన్లకే పరిమితమైందని వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులివ్వకపోయినా మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. పోలవరం నిర్మాణంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వాములైన టీడీపీ-బీజేపీ తలోమాట మాట్లాడుతూ ప్రజలను గందరగోళ పరుస్తున్నాయని విమర్శించారు. విభజన బిల్లులోని అంశాలను అమలు చేయాల్సిన ప్రధాని మోడీ రాష్ట్రం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో ఎందుకు కొనసాగుతున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు వాస్తవాలు వివరించి రాష్ట్ర అభివృద్ధికి నడుంబిగించాలని కోరారు.

300మంది విద్యార్థులకు కంటిచూపు దూరం

- బాధితులకు ఆర్‌డీఓ పరామర్శ
- ఘటనపై విచారణకు ఆదేశం



పార్వతీపురం : విజయనగరం జిల్లా పార్వతీపురం పట్టణంలోని సురేష్ పబ్లిక్ స్కూల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తివంతమైన లైటింగ్ వల్ల సుమారు మూడు వందల మంది విద్యార్థుల కంటిచూపు మసకబారింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్పందించిన అధికారులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు. అధికారుల కథనం ప్రకారం... సురేష్ పబ్లిక్ స్కూల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ సుమారు 500 మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నారు. వీరి కోసం ఆదివారం రాత్రి ఎనిమిది గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ మ్యూజికల్ నైట్‌ను స్కూల్ యాజమాన్యం నిర్వహించింది. ఈ సందర్భంగా శక్తివంతమైన లైటింగ్ ఏర్పాటు చేశారు. లైటింగ్ పడే స్క్రీన్‌పై కవర్ చిరిగిపోవడంతో పిల్లల కంటిపై దాని ప్రభావం పడింది. కార్యక్రమం పూర్తయిన తరువాత రాత్రంతా పిల్లలకు నిద్ర పట్టలేదు. ఉదయం లేచేసరికి సుమారు మూడు వందల మంది విద్యార్థులకు చూపు మందగించింది. రాత్రి నిద్రలేకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందని యాజమాన్యం భావించి సోమవారం మధ్యాహ్నం వరకూ ఈ విషయాన్ని బయటకు తెలియనీయలేదు. మధ్యాహ్నమయ్యేసరికి పిల్లల కళ్లు ఎర్రబడి, ఇన్ఫెక్షన్ రావడంతో పిల్లలంతా ఆందోళన చెంది తమ తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న ఆర్‌డీఓ సుదర్శనదొర పాఠశాలకు చేరుకొని పరిశీలించారు. పట్టణంలోని కంటి, చిన్న పిల్లల వైద్యులందరినీ అక్కడికి రప్పించి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు యాళ్ల వివేక్, తిరుమల ప్రసాద్, బోగి ఈశ్వరరావు, ఏరియా ఆసుపత్రి వైద్యులు విద్యాసాగర్ విద్యార్థులను పరీక్షించారు. వెంటనే డ్రాప్స్ వేయించారు. 24 గంటల తరువాత చూపు మెరుగుపడుతుందని తెలిపారు. ఈ ఘటనపై విచారణకు డీఈఓ, ఎంఇఒలకు ఆర్‌డీఓ ఆదేశిం చారు. ఆర్‌డిఒ సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అధిక లైటింగ్, గ్లాస్‌పై కవర్ చిరిగిపోవడంతో పిల్లలకు కళ్లకు శక్తివంతమైన వెలుగు తగిలి ఈ సమస్య వచ్చినట్లు వైద్యులు తెలిపారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద బందోబస్తు

టీడీపీ, వైసీపీ నేతల సవాళ్లు

విజయవాడ : ప్రభుత్వ అవినీతిపై తాము అన్ని ఆధారాలతో చర్చకు సిద్ధమని వైసీపీ, ఆధారాలుంటే చర్చకు రావాలని టీడీపీ నేతలు పత్రికా ముఖంగా సవాల్ విసురు కున్నారు. ఇందుకు ప్రకాశం బ్యారేజీని వేదికగా చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగంగా ముఖాముఖి చర్చకు సిద్ధమని రెండు పార్టీల నేతల ప్రకటించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు బ్యారేజీపై అదనపు బలగాలను మోహరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా క్రమబద్ధీకరించారు. టీడీపీ వైపు నుంచి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల రామయ్య, వైసీపీ నుంచి ఆ పార్టీ నేతలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, సుధాకర్‌బాబు వస్తారని ప్రచారం జరిగింది. అయితే రెండు పార్టీల నేతల రాకపోవడంతో అంతా ప్రశాంతంగా ముగిసింది. విజయవాడలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ వర్ల రామయ్య చర్చకు వస్తామని ప్రకటించినా రాలేదని, దీంతో టీడీపీ నేతలకు ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గడువు ఇస్తున్నామని ప్రకటించారు. టీడీపీ ప్రభుత్వ అవినీతి, అరాచకాలపై చర్చకు తాము ఎక్కడైనా సిద్ధమని పేర్కొన్నారు. జగన్‌పై విమర్శలు చేస్తే ఊరుకోబోమన్నారు.

S & D

బటన్ నొక్కితే అమెరికా ఖేల్ ఖతం

- ఆఫీస్ డెస్క్‌పైనే అణ్వాయుధాల రిమోట్ : నూతన సంవత్సర వేడుకల్లో కిమ్



ప్యాంగాంగ్ : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్-జోంగ్-ఉన్ చేసిన ప్రసంగం అమెరికా గుండెల్లో బాకు దింపినట్టయింది. 'అణ్వాయుధాల రిమోట్ ఎప్పుడూ నా ఆఫీస్ డెస్క్‌పైనే ఉంటుంది' అంటూ అగ్రరాజ్యాన్ని కిమ్ హెచ్చరించారు. 'అమెరికాలోని ప్రధాన భూభాగం మొత్తం మా అణ్వాయుధాల పరిధిలోనే ఉంది. అణ్వాయుధాలకు సంబంధించిన స్విచ్ కూడా ఎప్పుడూ నా ఆఫీస్ డెస్క్‌పైనే ఉంటుంది. ఇది బెదిరింపు కాదు, వాస్తవం అన్న సంగతి అమెరికా సరిగ్గా తెలుసుకుంటే మంచిది' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. పూర్తిస్థాయి అణ్వస్త్ర దేశంగా ఉత్తర కొరియా సిద్ధమవ్వాల్సిన అవసరముందని...అదే సమయంలో శాంతికాముక దేశంగా మెలగాలని పిలుపునిచ్చారు. "అమెరికా మాపై యుద్ధం చేయలేదు. మాపై ఎవరూ దండెత్తనంత వరకూ అణ్వాయుధాలను వినియోగించబోం" అని స్పష్టం చేశారు. ఈఏడాది కూడా అణు పరీక్షలు కొనసాగించి తీరతామన్నారు.

తమ పొరుగు దేశమైన దక్షిణ కొరియాతో స్నేహం కోరుతున్నామని అన్నారు. ఆదేశంతో చర్చలు జరిపేందుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటామన్నారు. అంతేగాకుండా, సియోల్‌లో జరగనున్న వింటర్ ఒలింపిక్స్‌కు కూడా తమ టీమ్‌ను పంపనున్నట్టు కిమ్ తెలిపారు. ఇదిలా ఉండగా, అమెరికా సైన్యం.. దక్షిణకొరియా, జపాన్ దేశాలతో కలిసి కొరియా ద్వీపకల్పంలో ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అంతేగాకుండా, ఉత్తరకొరియా సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు అమెరికా కుట్ర పన్నింది. క్షిపణి దాడులను అవలీలగా ఎదుర్కోగల థాడ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని దక్షిణ కొరియాకు అందజేసింది. ఆ దేశంలో యుద్ధ విమానాలు మోహరించి ఉద్రిక్త వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. ఉత్తరకొరియాను సర్వనాశనం చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఉత్తరకొరియాను ఆర్థికంగా దెబ్బతీయాలని ఆసియా దేశాల పర్యటనలో దేశాధినేతలను కోరారు. ఉ.కొరియాపై ఆర్థిక ఆంక్షలు మోపారు. ఈనేపథ్యంలో ఉత్తరకొరియా గతేడాది నవంబర్‌లో అత్యంత శక్తివంతమైన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని (ఐసీబీఎం)ను విజయవంతంగా ప్రయోగించింది. దీంతో అమెరికా, ఉత్తర కొరియాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.

ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు

- 12 మంది మృతి



టెహ్రాన్ : ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు ఒక్కసారిగా హింసాత్మకంగా మారాయి. ప్రభుత్వం తక్షణమే దిగిపోవాలంటూ ఆందోళనకారులు రోడ్డెక్కగా.. శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పటంతో పోలీసులు కాల్పులకు దిగారు. గత రెండు రోజుల్లో చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో 12 మంది పౌరులు మృత్యువాత పడినట్టు తెలుస్తోంది. 2009 తర్వాత మళ్లీ ఇప్పుడు ఇరాన్‌లో పెద్ద ఎత్తున్న అల్లర్లు చెలరేగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థను దిగజారుస్తూ ఉగ్రవాద సంస్థలకు నిధులు సమకూరుస్తుందంటూ ప్రభుత్వంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్షాలు.. ప్రభుత్వం గద్దెదిగి పోవాలంటూ నిరసన ప్రదర్శనలకు పిలుపునివ్వగా.. సోషల్‌మీడియాలో అది విపరీతంగా చక్కర్లు కొట్టింది. దీంతో నిరసనలకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున్న స్పందన వస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ అత్యవసర సమావేశం నిర్వహించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు పౌరులకు ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని నిరసనకారులను హెచ్చరించారు.

హాఫీజ్ ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం

- ముంబయి పేలుళ్ల సూత్రధారికి పాక్ షాక్



ఇస్లామాబాద్ : ముంబయి పేలుళ్ల సూత్రధారి హాఫీజ్ సయీద్ ఆస్తులను, సంస్థలను జప్తు చేసేందుకు పాక్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. గత ఏడాది డిసెంబర్19న ఈ మేరకు ఫెడరల్ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్లతో పాకిస్తాన్ చర్చలు జరిపినట్టు రాయిటర్స్ పేర్కొన్నది.

హాఫీజ్‌కు చెందిన జమాత్-ఉద్-దవా(జేయూడీ), ఫలా-ఈ-ఇన్‌సానియాత్ ఫౌండేషన్(ఎఫ్ఐఎఫ్)లను జప్తు చేసుకోవాలని పాకిస్తాన్ ఆర్థిక శాఖకు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్, దేశంలోని ఐదు ప్రావిన్సుల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

బ్రిటన్ కారు పార్కింగ్‌లో భారీ అగ్ని ప్రమాదం

- 1600 కార్లు దగ్ధం

లివర్‌పూల్: బ్రిటన్‌లోని లివర్‌పూల్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. కారు పార్కింగ్ లాట్‌లో పార్క్ చేసిన సుమారు 1600 వాహనాలు దగ్ధం అయ్యాయి. ఎకోఎరినాకు సమీపంలో ఉన్న కారు పార్క్ బిల్డింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఎకో ఎరినా సమీపంలోనే అంతర్జాతీయ హార్స్ షోను నిర్వహిస్తున్నారు.

ఆ షోకు హాజరైనవారే ఆ పార్కింగ్ లాట్‌లో తమ కార్లను పార్క్ చేశారు. మంటలు దట్టంగా వ్యాపించడంతో అక్కడ నుంచి వెంటనే గుర్రాలను బయటకు పంపించారు. ఆ తర్వాత హార్స్ షోలను కూడా రద్దు చేశారు. ఒక కారులో పుట్టిన మంటల వల్లే మిగతా కార్లు అన్నీ కాలిపోయినట్టు ఓ అధికారి తెలిపారు. అయితే, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అన్నారు.

ఆస్ట్రేలియాలో విమాన ప్రమాదం

ఆరుగురు మృతి



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో బ్రిటన్‌కు చెందిన ప్రముఖ క్యాటరింగ్ సంస్థ కంపాస్ గ్రూప్ కంపెనీ సీఈవో రిచర్డ్ కజిన్స్ (58), ఆయన కుటుంబ సభ్యులు, విమాన పైలట్ ఉన్నారు. ఆస్ట్రేలియా విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...నూతన సంవత్సర వేడుకలు జరుగుతున్న సమయంలో ఆస్ట్రేలియాలోని సిడ్నీ రివర్‌లో ఈ ఘటన జరిగింది. సముద్ర విమానం కూలిన ఘటనలో కజిన్స్‌తో పాటు ఎమ్మా బౌడెన్ (48), హీతర్ బౌడెన్ (11), ఎడ్వర్డ్ కజిన్స్ (23), విలియమ్ (25) ఈ ప్రమాదంలో మృతి చెందారు. పైలట్ గ్యారత్ మోర్గన్ కూడా విమాన ప్రమాదంలో చనిపోయాడు. బ్రిటన్ అధికారులకు విమాన ప్రమాదం సమాచారం అందజేసినట్టు ఆస్ట్రేలియా పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. కంపాస్ సంస్థ బ్రిటన్‌లో అతిపెద్ద సంస్థ. రిచర్డ్ ఓ మానవతా మూర్తి. గడిచిన 11 ఏండ్లలో ఆయన కంపాస్ కంపెనీని ఉన్నత శిఖరాలకు చేర్చారు. హార్వర్డ్ బిజినెస్ రివ్యూ చేత బెస్ట్ పర్ఫార్మింగ్ సీఈవోగా కజిన్స్ గుర్తింపు తెచ్చుకున్నాడు. సిడ్నీకి ఉత్తర దిశలో ఉన్న కోవాన్ ప్రాంతంలో సుమారు 13 మీటర్ల లోతులో విమాన శకలాలు గుర్తించినట్టు అధికారులు తెలిపారు. లేబర్ పార్టీ ఎంపీ చుకా ఉమున్న మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్టు ఆస్ట్రేలియన్ ట్రాన్స్‌పోర్ట్ సేఫ్టీ బ్యూరో పేర్కొన్నది.

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం...

మైనర్ బాలుడి కాల్పుల్లో నలుగురు మృతి

వాషింగ్టన్: అమెరికాలో నూతన సంవత్సర వేడుకల్లో పెను విషాదం చోటుచేసుకున్నది. ఓ అపార్ట్‌మెంట్‌లోకి 16 ఏండ్ల బాలుడు చొరబడి కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులు మృతి చెందారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అమెరికాలోని న్యూజెర్సీ నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. లాంగ్ బ్రాంచ్ స్ట్రీట్‌కి చెందిన ఓ అపార్ట్‌మెంట్‌లో నూతన సంవత్సర వేడుకల్లో ఈ విషాదం చోటుచేసుకుంది. ఓ మైనర్ బాలుడు అపార్ట్‌మెంట్‌లోకి చొరబడి ఏకే-47తో కాల్పులు జరిపాడు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పరిసర ప్రాంతాల్లో ముమ్మర సోదాలు నిర్వహించారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ ఘటనకు ఉగ్రవాదంతో సంబంధంలేదని తెలిపారు. వ్యక్తిగత పాత కక్షల నేపథ్యంలో కాల్పుల ఘటన జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కాల్పులకు పాల్పడ్డ నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిపారు.



కోస్టారికాలో విమాన ప్రమాదం

- 12 మంది మృతి

శాన్‌జోస్ : కోస్టారికాలో జూనాకాస్ట్ ప్రావిన్స్‌లోని పర్వతాల్లో ఓ చిన్న విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్స్ సహా 12 మంది మృతిచెందారు. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సెస్నా 208-బీ అనే చిన్న విమానం పది మంది ప్రయాణికులతో ఆదివారం మధ్యాహ్నం 12.10 గంటలకు నండయూర్‌లోని పుంటా ఇస్‌లిటా విమానాశ్రయం నుంచి శాన్‌జోస్‌కు బయలుదేరింది. టేక్ ఆఫ్ అయిన 10 నిమిషాల్లోనే ప్రమాదానికి గురైంది. ఈ ఘటనపై కోస్టారికా అధ్యక్షుడు సోలిస్ రివేరా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కొలరాడోలో కాల్పుల కలకలం

- పోలీసు అధికారి మృతి, మరో నలుగురికి గాయాలు



వాషింగ్టన్: కొలరాడోలో నూతన సంవత్సర వేడుకల్లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఈ కాల్పులలో ఓ పోలీసు అధికారి మృతి చెందగా, మరో నలుగురు అధికారులు గాయపడ్డారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...డెన్వర్‌కు దక్షిణంగా ఉన్న హైల్యాండ్స్ రాంచ్‌లో ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఓ అపార్ట్‌మెంట్‌లో గొడవ జరుగుతుందని సమాచారం అందుకున్న పోలీసులు, ఆ ప్రాంతానికి వెళ్లగా అనుమానితుడు వారిపై మెరుపుదాడికి దిగాడు. ఇరువర్గాల మధ్య తలెత్తిన ఆస్తి వివాదం కారణంగా కాల్పుల ఘటన జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఇద్దరు వ్యక్తులను తన అపార్ట్‌మెంట్‌లోనికి పిల్చిన అనుమానితుడు వారిపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో వారిద్దరూ గాయపడ్డారు. సంఘటన జరిగిన వెంటనే పోలీసులు ఆ ప్రాంతవాసులను ఇండ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. సంఘటన జరిగిన ప్రాంతానికి బాంబ్ స్క్వాడ్ బృందాలు చేరుకున్నాయి. నిందితుల కాల్పుల్లో మృతి చెందిన పోలీసు అధికారి 29 ఏండ్ల జకారి పారిష్ అని, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని అధికారులు తెలిపారు. గాయపడిన నలుగురు పోలీసు అధికారుల పరిస్థితి నిలకడగా ఉందన్నారు. కాల్పులకు పాల్పడ్డ మాథ్యూ రీహాల్(37)ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు.

నిందితునికి ఎలాంటి క్రిమినల్ రికార్డు లేదని పోలీసులు తెలిపారు. తన రైఫిల్‌తో అతను సుమారు 100 రౌండ్ల కాల్పులు జరిపాడని వివరించారు. కాల్పుల్లో మరణించిన పోలీసు అధికారి కుటుంబానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతాపం తెలిపారు. అమెరికా చరిత్రలోనే కొలరాడోలో అత్యంత ఎక్కువగా కాల్పులు జరిగాయి. 1999లో కొలంబైన్ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో అత్యధికంగా 12 మంది విద్యార్థులు సహా 13 మంది మృతి చెందారు. 'గన్ వయోలెన్స్ ఆర్కైవ్' వెబ్‌సైట్ నివేదిక ప్రకారం... 2017లో అమెరికాలో తుపాకీ కాల్పుల్లో 15,000 మందికి పైగా మృతి చెందారు.

ఆలయంలో విషాదం

- ప్రదక్షిణ చేస్తుండగా బాలుడిపై విరిగిపడ్డ కొబ్బరి చెట్టు
- తల పగిలి అక్కడిక్కడే మృతి



నతెలంగాణ-కమ్మర్‌పల్లి

కొత్త సంవత్సరం రోజున తల్లితో కలిసి ఆలయానికి వెళ్లిన ఓ బాలుడు ఊహించని రీతిలో మృతిచెందాడు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా కొబ్బరిచెట్టు విరిగి తలపై పడటంతో అక్కడికక్కడే ప్రాణం విడిచాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ శ్రీ బాల రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన పోతన్కర్ మణికంఠ(13), అతని సోదరుడు రాహుల్‌ని తీసుకొని వారి తల్లి రాణి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉప్లూర్‌లోని శ్రీ బాల రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు.

వారందరూ కలిసి ప్రదక్షిణలు చేస్తుండగా ఆలయ ఆవరణలో ఉన్న కొబ్బరిచెట్టు ఒక్కసారిగి విరిగి మణికంఠపై పడింది. దీంతో బాలుడి తల పగిలి రక్తపుమడుగులో అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పటివరకు ఉత్సాహంగా కన్పించిన ఆ బాలుడ్ని కొబ్బరిచెట్టు మృత్యువు రూపంలో కబళించడం అక్కడివారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మణికంఠ హైదరాబాద్‌లో కేకేఆర్ గౌతం పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవులతో ఇటీవలే ఇంటికొచ్చాడు. తండ్రి రాము ఉపాధి నిమిత్తం ప్రస్తుతం ఇజ్రాయిల్ దేశంలో ఉన్నట్టు బంధువులు తెలిపారు.

టీడీపీలో అంతర్మథనం

- మరికొంత మంది పలాయనం !
- టీఆర్ఎస్,కాంగ్రెస్ నుంచి ఆహ్వానాలు
- సమాలోచనల్లో మిగిలిన నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ శాఖలో మరోసారి అంతర్మథనం ప్రారంభమైంది. పోయినవారు పోగా, మిగిలిన వారు సైతం పార్టీ గోడ దూకే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల నుంచి వస్తున్న ఆహ్వానాలను అందిపుచ్చుకోవాలని చూస్తున్నారు. అందుకే మరి కొంతకాలం వేచి చూసే ధోరణిని అవలంభిస్తున్నారు.ఇలా పార్టీలోని కీలకనేతలతోపాటు అనుబంధ సంఘాల నాయకులూ ఉండటం గమనార్హం. ఒక వైపు పార్టీ అంతర్గత కార్యలాపాలను ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించే ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు మిగతా నేతలు తమ భవిష్యతుపై బెంగతో మదనపడుతున్నారు. టీఆర్ఎస్ సర్కారు రాష్ట్రంలో టీడీపీ ఉనికి లేకుండా చేయాలనే వ్యూహంతో ముందుకుసాగుతున్న సంగతి తెలిసిందే. గతంలో సీఎంకేసీఆర్ సైతం రాష్ట్రంలో టీడీపీ లేదంటూ బహిరంగంగా విలేకర్ల సమావేశంలోనే ప్రకటించారు. మంత్రి కేటీఆర్ సైతం తెలంగాణలో సైకిల్ పార్టీ చచ్చిపోయిందని, కేసీఆరే 20ఏండ్లపాటు సీఎంగా ఉంటారని వ్యాఖ్యానించిన విషయమూ విదితమే. ఈ పరిస్థితులను ఎదుర్కొని పార్టీని ముందుకు తీసుకుపోయేందుకు గతంలో రమణ, రేవంత్ ప్రయత్నాలు చేశారు. ఇంతలో రేవంత్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం, తనతోపాటు పార్టీ క్యాడర్‌ను, కొంత మంది కీలకనేతలను సైతం వెంటబెట్టుకోవడం సైకిల్‌ను మరింత దెబ్బతీసింది. పార్టీలో ఉత్సాహం నింపి, కార్యక్రమాలను నిర్వహించే ప్రయత్నంలో పార్టీ అధ్యక్షులు రమణ, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు,



జాతీయ అధికార ప్రతినిధి అరవింద్‌కుమార్‌గౌడ్, ఇ.పెద్దిరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ గరికెపాటి మోహన్‌రావు, తెలుగు మహిళ అధ్యక్షురాలు, పార్టీ ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒంటేరు ప్రతాపరెడ్డి, మరో ప్రధాన కార్యదర్శి బొల్లం మల్లయ్య యాదవ్ తదితరులు కృషిచేస్తున్నారు. వీరిలోనూ అంతర్గతంగా విభేదాలు ఉన్నట్టు తెలిసింది. నేతల మధ్య అంతర్గత సమన్వయం లేకపోవడం, పార్టీ అధినేత చంద్రబాబు పార్టీ బలోపేతానికి ఎక్కువ సమయం కేటాయించకపోవడం, టీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి తమ పార్టీలోకి రావాలంటూ ఆహ్వానాలు వస్తుండటంతో కొందరు నేతలు పునరాలోచనలో పడ్డట్టు కనిపిస్తున్నది.రావుల చంద్రశేఖర్‌రెడ్డి రాజ్యసభ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా దళితుడైన నర్సింహులుకుగవర్నర్ పదవి ఇవ్వాలని గత ఏడాదిన్నరగా కేంద్రం ముందు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతిపాదన పెట్టారు. ఇందుకు బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా సైతం తొలుత సూత్రప్రాయంగా అంగీకరించారు. రెండు నెలల కిందట జరిగిన గవర్నర్ల నియామకాల్లో మోత్కుపల్లికి అవకాశం ఇవ్వలేదు. దీంతో ఆయన మానసికవేదనకు గురవుతున్నారు. తాజాగా ఆయన కూడా కొత్త పల్లవి ఎత్తుకున్నట్టు తెలిసింది. గవర్నర్ పదవి రాకపోవడంతో పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలని చంద్రబాబును అడిగారని టీడీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఈవిషయంలో రమణకు, నర్సింహులుకు మధ్య స్వల్ప విభేదాలు తలెత్తినట్టు సమాచారం. తెలుగు మహిళా అధ్యక్షురాలు బండ్రు శోభారాణికి సైతం ఇటు టీఆర్ఎస్, అటు కాంగ్రెస్ నుంచి ఆహ్వానాలు వచ్చినట్టు సమాచారం. ఇప్పటి వరకు ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న శోభారాణి మహిళా నాయకుల్లో కీలకంగా ఉన్నారు. జనశక్తిలో కీలకనేతగా పనిచేసి బయటకు వచ్చారు. అనక టీఆర్ఎస్‌లో చేరారు. అప్పట్లో ఎన్నికల్లో పోటీచేసేందుకు టికెట్ దక్కకపోవడంతో చంద్రబాబు ఆహ్వానం మేరకు టీడీపీలో చేరారు. అప్పటి నుంచి పార్టీలోనే ఉంటూ ప్రజాసమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్నారు. మహిళా నేతల్లో బాగా మాట్లాడతారనే పేరు ఉంది. చంద్రబాబు సైతం పలు సందర్భాల్లో ఆమె పనితీరును సైతం మెచ్చుకున్నారు. ఆలేరు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. దీర్ఘకాలికంగా అక్కడ పనిచేస్తున్నారు. మోత్కుపల్లికి గవర్నర్ గిరీ రాకపోవడం మూలంగా ఆయన మళ్లీ ఆలేరుపై దృష్టిపెట్టిన తరుణంలో శోభారాణికి ఇబ్బందిగా ఉందనే ప్రచారం పార్టీ తరగతుల్లో జరుగుతున్నది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో కలిసి తెలంగాణఐక్య వేదిక పేర శోభారాణి పోరాటం చేశారు. ఉద్యమ తొలినాళ్లల్లో ప్రొఫెసర్ జయశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన అత్యున్నతస్థాయి టీఆర్ఎస్ రాజకీయ వ్యవహారాల కమిటీలో సభ్యురాలిగా పని చేశారు. ఇప్పుడు తను కూడా పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. అవసరమైతే 2019 ఎన్నికల్లో ఆలేరు అసెంబ్లీ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేసేందుకు సైతం వెనుక్కుపోకూడదనే యోచనలో ఉన్నట్టు ఆపార్టీలో ప్రచారం సైతం జరుగుతున్నది. ఒంటేరు ప్రతాపరెడ్డి కారు ఎక్కేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. మెదక్ ఎంపీ సీటు ఇస్తే పార్టీ నుంచి ఆయన జంప్ అవుతారని చెబుతున్నవారూ ఉన్నారు. ఇకపోతే బొల్లం మల్లయ్య యాదవ్ చూపు కాంగ్రెస్ వైపు ఉన్నట్టుగా టీడీపీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.




రాష్ట్రసాధనలో ఉపాధ్యాయులది కీలకపాత్ర

- ఎస్‌టీయూ డైరీ ఆవిష్కరణలో కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు గుర్తుచేశారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ రూపొందించిన 2018 సంవత్సరం డైరీని ఆయన సోమవారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. ఉపాధ్యాయ రంగంలో ఎస్‌టీయూ సేవలు విశిష్టమైనవని అన్నారు. విద్యారంగంలో దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలపై ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి భుజంగరావు, జి సదానందంగౌడ్ ప్రస్తావించగా, సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని సీఎం కేసీఆర్ హామీనిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరీ కన్వీనర్ ఏవీ సుధాకర్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి రవి, ప్రతినిధులు కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీ డైరీ ఆవిష్కరించిన కడియం



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పీఆర్‌టీయూతెలంగాణ రాష్ట్ర కమిటీ రూపొందించిన డైరీ-2018ని శాసనమం డలి చీఫ్‌విప్ పాతూరి సుధా కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి కడియంశ్రీహరి సోమవారం ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని ఉపముఖ్యమంత్రి కోరారు. ఈవేసవి సెలవు ల్లో పదోన్నతులు, బదిలీలు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం అంజిరెడ్డి, ఎం చెన్నయ్య, పత్రికా సంపాదకులు పి వెంకట్‌రెడ్డి, నాయకులు సీహెచ్ స్వామి, చంద్రశేఖర్‌రావు, కేశవులు, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వేచ్ఛా.. సమానత్వం కోసం పూలే- అంబేద్కర్ జాతర

- రేపు జాతర ప్రచార రథం ప్రారంభం
- ఏప్రిల్ 29న మహాసభ : పూలే.. అంబేద్కర్ స్టీరింగ్ కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో స్వేచ్ఛా.. సమానత్వం.. సోదరభావం.. రాజ్యాధికారమే లక్ష్యంగా పూలే- అంబేద్కర్ జాతరను నిర్వహిస్తున్నట్టు పూలే-అంబేద్కర్ స్టీరింగ్ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో భాగంగా సావిత్రిబాయి 187వ జయంతిని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పూలే- అంబేద్కర్ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్నట్టు కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకపోతుల నరేందర్, కోఆర్డినేటర్ ఎమ్ వెంకటేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీమాస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, టీమాస్ రాష్ట్ర నేత జేబీ రాజు, నల్లా సూర్యప్రకాశ్, చెరుకు సుధాకర్, చర్పుల చంద్రన్న పాల్గొననున్నారని తెలిపారు.

దళిత ద్రోహి

కడియంపై మందకృష్ణ ఫైర్

- ఆయన వల్ల మాల, మాదిగలకు తీరని అన్యాయం
- తమ ప్రశ్నలకు సమాధానం చెప్పని సర్కార్
- నేటి నుంచి ఉపవాసదీక్షలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి దళిత ద్రోహిగా మారారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ విమర్శించారు. మంత్రివర్గంలో దళితులకు స్థానం దక్కకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వల్ల దళితులు, బైండ్ల ఉప కులాలకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రిగా ఉన్న రాజయ్యను తొలగించడానికి ప్రధాన కారణం ఆయనేనని, వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ దక్కకుండా కుట్ర చేస్తున్నాడని తెలిపారు. రాజయ్య స్థానంలో తన కూతురుకు టికెట్ ఇప్పించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారని చెప్పారు. ఇదే జరిగితే కడియంను రాజకీయంగా భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. సోమవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఎమ్మార్పీఎస్ విషయంలో అపోహలు సృష్టించారని తెలిపారు. తాముఅడిగిన 13 ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ ప్రభుత్వానికి ఇచ్చిన గడువు ముగిసినందున దీక్షలు చేపట్టాలని నిర్ణయించామన్నారు.

నేటి నుంచి ఉపవాస దీక్షలు

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టాలంటూ మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు చేపడుతున్నట్టు మందకృష్ణ ప్రకటించారు. దీక్షలు ఇక్కడ చేయొద్దని, ఢిల్లీలో చేపట్టాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఢిల్లీలో దీక్షలు చేపడితే మీరు మద్దతు ఇస్తారా? అని ఆయన ప్రశ్నించారు. గతంలో 30 రోజుల పాటు ఢిల్లీలో దీక్షలు చేపడితే మద్దతు ఇవ్వలేదని, ఒకవేళ మద్దతు ఇస్తామంటే ఢిల్లీలో దీక్షలు చేపడుతామన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టేందుకు ఉభయ సభల్లో టీఆర్ఎస్ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. లేని పక్షంలో అన్ని రాజకీయ పార్టీలు కలిసి ప్రయివేటు బిల్లును పెట్టాలని కోరారు.




ప్రభుత్వం సూచించిన చోటే దీక్షలు

ఇందిరా పార్క్, బాపు ఘాట్ వద్ద ఉపవాస దీక్షలు చేప ట్టేందుకు అనుమతించాలని ప్రభుత్వానికి అక్కడ అనుమతిం చకపోతే ప్రభుత్వం ఎక్కడ సూచిస్తే అక్కడ దీక్షలు చేపడు తామన్నారు. అలాగే అన్ని మండల కేంద్రాల వద్ద దీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు.


ఆ కేసులను తిరగదోడుతాం

తెలంగాణ ఉద్యమంలో ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు ధ్వంసం చేసినందుకు కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లపైన సెక్షన్ 307 కింద కేసులు నమోదు చేశారన్నారు. వీరిపై కేసులు నమోదు చేసినా ఉమ్మడి రాష్ట్రంలో వారిని అరెస్టు చేయలేదన్నారు. తమపై బెయిలబుల్ కేసులు నమోదు చేసినా తమను అరెస్టు చేసి జైళ్లో ఉంచారని, కండిషన్డ్ బెయిల్ మీద విడుదల చేశారన్నారు. ఇప్పుడు వారిపైన ఉన్న పాత కేసులను తిరగదోడుతామన్నారు.

న్యూ ఇయర్ ఫ్రెష్ లుక్స్ సందడి


'అజ్ఞాతవాసి'లో పవన్‌కళ్యాణ్


'భాగమతి' చిత్రంలో అనుష్క


'జై సింహా'లో బాలకృష్ణ


'తొలి ప్రేమ' చిత్రంలో వరుణ్‌తేజ్, రాశీఖన్నా


'గాయత్రి'లో విష్ణు, శ్రియా


'మనసుకు నచ్చింది' చిత్రంలో అమైరా దస్తూర్, సందీప్ కిషన్

నూతనోత్సాహంతో నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టిన నేపథ్యంలో బోల్డెన్ని ఫ్రెష్‌లుక్స్ ప్రేక్షకుల ముందుకొచ్చాయి. సార్ట్ హీరోల సినిమాల దగ్గర్నుంచి యువ కథానాయకుల సినిమాల వరకు విడుదలైన ఈ ఫ్రెష్‌లుక్స్ అందరినీ విశేషంగా అలరిస్తూ సందడి చేస్తున్నాయి.

నూతన సంవత్సరం సందర్భంగా విడుదల చేసిన పవన్ కళ్యాణ్ **'అజ్ఞాతవాసి'** లుక్ అందరిలోనూ క్యూరియాసిటీని పెంచుతోంది. వారణాసి నదీ తీరంలో నిల్చొని ఉన్న పవన్ కళ్యాణ్ పోస్టర్ అదుర్స్ అనేలా ఉంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయెల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సెన్సార్ 'యు/ఎ' సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా ఈ నెల10న విడుదల చేయనున్నారు.
దీంతోపాటు కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తున్న **'జై సింహా'** చిత్రానికి సంబంధించి విడుదల చేసిన లుక్ సైతం ఆకట్టుకుంటోంది. సి.కళ్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన నయనతార, నటాషా జోషి, హరిప్రియ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా కూడా సంక్రాంతి గిఫ్ట్‌గానే ఈ నెల 12న విడుదల కానుంది. అలాగే అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న **'భాగమతి'** సినిమా ఫ్రెష్‌లుక్‌ను కూడా కొత్త ఏడాదిని పురస్కరించుకుని చిత్ర బృందం సోమవారం విడుదల చేసింది. అశోక్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న ఈ సినిమా విడుదల కానుంది.
ఇక అల్లు అర్జున్ **'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'** అంటూ న్యూ ఇయర్ సందర్భంగా సందడి చేశారు. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను ఫస్ట్ ఇంపాక్ట్ పేరుతో విడుదల చేశారు. ఇందులో బన్నీ ఆర్మీ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. టీజర్‌లో బన్నీ చెప్పే డైలాగులు అలరిస్తున్నాయి. ఈ సందర్భంగా నిర్మాతలు శిరీష శ్రీధర్ మాట్లాడుతూ, 'బన్నీ కెరీర్‌లో హై ఓల్టేజ్ యాక్షన్ లవ్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు వక్కంతం వంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అద్భుతమైన కథ, కథనంతో కంప్లీట్ ప్యాకేజీగా అందిస్తున్నామనడానికి ఈ ఇంపాక్ట్ ఓ ఉదాహరణ. ఏప్రిల్ 27న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేస్తాం' అని తెలిపారు.

మంచు మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం **'గాయత్రి'**. మంచు విష్ణు, శ్రియా, నిఖిలా విమల్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలోని మంచు విష్ణు, శ్రియ జోడీకి సంబంధించిన న్యూ లుక్‌ను చిత్రయూనిట్ సోమవారం విడుదల చేసింది. మదన్ రామిగాని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. మాస్ యాక్షన్‌తోపాటు కుటుంబ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాకు ఎస్.ఎస్.థమన్ సంగీతం సమకూర్చడం విశేషం. ఇక వరుణ్ తేజ్, రాశీఖన్నాల **'తొలిప్రేమ'**కు సంబంధించిన కొత్త పోస్టర్‌ను కూడా న్యూ ఇయర్ సందర్భంగా సోమవారం విడుదల చేశారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. నయా లుక్‌లో వరుణ్‌తేజ్, రాశీఖన్నా ఆకట్టుకుంటున్నారు. ఈ చిత్రం కూడా ఫిబ్రవరి 9వ తేదీనే రిలీజ్ అవుతోంది. ఇక ఇటీవల 'మెంటల్ మదిలో'తో మంచి విజయాన్ని అందుకున్న శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం **'నీదీ నాదీ ఒకే కథ'** ఫస్ట్‌లుక్‌ను కూడా రిలీజ్ చేశారు. వేణు ఊడుగుల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను ప్రశాంతి, కృష్ణ విజయ్ నిర్మిస్తున్నారు. మంజుల దర్శకత్వంలో సందీప్ కిషన్ నటిస్తున్న **'మనసుకు నచ్చింది', 'అమ్మమ్మగారిల్లు', 'ఆయుష్మాన్ భవ', 'నయనం', 'అంతకుమించి'** చిత్రాలకు సంబంధించిన కొత్త లుక్‌లు కూడా విడుదలై ఆకట్టుకుంటున్నాయి. మొత్తమ్మీద న్యూ ఇయర్ సందర్భంగా విడుదల చేసిన ఈ నయా పోస్టర్లు సినిమాలపై ఆసక్తిని రేకెత్తిస్తూ సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి.


నవచిత్రం

సూర్య నయా చిత్రం షురూ!


సూర్య నూతన చిత్ర ప్రారంభోత్సవ దృశ్యం

సూర్య, సాయిపల్లవి జంటగా సెల్వ రాఘవన్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ నూతన చిత్రం సోమవారం చెన్నైలో ప్రారంభమైంది. సీనియర్ హీరో శివకుమార్, సూర్య, కార్తీ ఈ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ, 'నా గత 35 చిత్రాలకు భిన్నంగా ఉండే సినిమా ఇది. సెల్వ రాఘవన్ చెప్పిన సబ్జెక్ట్ చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. కమర్షియల్ వ్యాల్యూస్ ఉంటూనే అందర్నీ ఆకట్టుకునే చిత్రమిది. ఇందులో హీరోయిన్ సాయిపల్లవి క్యారెక్టర్‌కి కూడా మంచి ఇంపార్టెన్స్ ఉంటుంది' అని అన్నారు. 'సూర్యలాంటి విలక్షణ హీరోతో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ కథకు సూర్య ఒక్కరే యాప్ట్ అని సినిమా చూశాక తెలుస్తుంది' దర్శకుడు సెల్వ రాఘవన్ తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ, 'సూర్య, సాయిపల్లవి, సెల్వ రాఘవన్ కాంబినేషన్‌లో వస్తున్న మంచి సినిమా ఇది. రీసెంట్‌గా మా బ్యానర్‌లో రూపొందిన 'ఖాకి' పెద్ద హిట్ అయింది. సూర్య కెరీర్‌లో ఓ పెద్ద హిట్ సినిమా అయ్యేలా డైరెక్టర్ సెల్వరాఘవన్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జనవరి 18న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి దీపావళికి చిత్రాన్ని రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శివకుమార్ విజయన్, ఎడిటింగ్: జి.కె.ప్రసన్న, ఆర్ట్: ఆర్.కె.విజయ్ మురుగన్.

టచ్ చేసి చూడమంటున్నాడు..


రవితేజ

రవితేజ, రాశీఖన్నా, సీరత్ కపూర్ హీరో, హీరోయిన్లుగా విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్(బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'టచ్ చేసి చూడు'. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి నిర్మాతలు మాట్లాడుతూ, 'మాకు చిరకాల మిత్రుడైన రవితేజతో ఈ సినిమాను నిర్మిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. మాస్ మహారాజా ఇమేజ్‌కి తగ్గట్టుగా రచయిత వక్కంతం వంశీ అద్భుతమైన కథను తయారు చేశారు. షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం రీరికార్డింగ్ జరుగుతోంది' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జామ్ 8, ఎడిటింగ్: గౌతంరాజు, ఆర్ట్: రమణ, కెమెరా: ఛోటా కె.నాయుడు.

రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో..


సుధీర్‌బాబు

సుధీర్‌బాబు, అదితీరావు హైదరీ జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న నూతన చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇందులో భాగంగా ఫస్ట్ షెడ్యూల్ పూర్తయ్యింది. ఆ విశేషాలను నిర్మాత తెలియజేస్తూ, 'డిసెంబర్ 11 నుంచి 23 వరకు హైదరాబాద్‌లో తొలి షెడ్యూల్ చేశాం. హీరో ఇంటికి సంబంధించిన కీలక సన్నివేశాలను తెరకెక్కించాం. ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ రూపుదిద్దిన హీరో హౌస్ సెట్ చాలా స్పెషల్‌గా ఉంటుంది. అవుట్‌పుట్ బాగా వస్తోంది. సోమవారం నుంచి రెండో షెడ్యూల్‌ను హైదరాబాద్‌లోనే స్టార్ట్ చేశాం. త్వరలోనే టైటిల్‌ను ప్రకటిస్తాం. మే నెలలో సినిమాను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'రొమాన్స్, హాస్యం సమ్మిళితమైన కథ ఇది. సినిమాలో హీరో చిల్డ్రన్ బుక్స్ ఇల్లస్ట్రేటర్‌గా నటిస్తున్నారు. అనూహ్యమైన కథాంశంతో ఆద్యంతం వినోదాత్మకంగా నడిచే ఒక కొత్త తరం ప్రేమ కథా చిత్రమిది. పి.జి.విందా ఫొటోగ్రఫీ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది' అని దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ చెప్పారు.


కీర్తి సురేష్

అమ్మ చెప్పింది నిజమైంది..

'హీరో సూర్యకు నేను చిన్నప్పట్నుంచి పెద్ద అభిమానిని. ఆయనతో కలిసి నటించడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది' అని అంటోంది కీర్తి సురేష్. ప్రస్తుతం సూర్యతో కలిసి 'తానా సెంథ్రా కూట్టమ్' చిత్రంలో నటిస్తోంది. 'గ్యాంగ్' పేరుతో తెలుగులో రిలీజ్ అవుతోంది. సంక్రాంతి కానుకగా ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానున్న నేపథ్యంలో కీర్తి సురేష్ మాట్లాడుతూ, 'స్కూల్ డేస్ నుంచే సూర్య సినిమాలు చూసేదాన్ని. ఆయనకు నేను అభిమానిని. మా మదర్(మేనక) సూర్య నాన్న శివకుమార్‌తో కలిసి మూడు చిత్రాల్లో నటించారు. ఆ టైమ్‌లో 'నువ్వు ఏదో ఒక రోజు శివకుమార్ వాళ్ళ అబ్బాయి సూర్యతో నటిస్తావ్ చూడు' అని మా అమ్మ ఛాలెంజ్ చేసింది. ఇప్పుడది నిజం కావడం చాలా ఆనందంగా ఉంది. సూర్య సార్ ఎక్కువగా మాట్లాడరు. అవసరమైతే సజేషన్స్‌తోపాటు సపోర్టివ్‌గా ఉంటారు' అని తెలిపింది. పవన్‌కళ్యాణ్ సరసన కీర్తి నటించిన 'అజ్ఞాతవాసి' చిత్రం కూడా సంక్రాంతి సందర్భంగానే ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ప్రస్తుతం 'మహానటి', 'సామి 2', 'సండకోజి 2', విజయ్‌తో ఓ సినిమాలో నటిస్తూ బిజీగా ఉంది.

ఆ నలుగురు చాలా ముఖ్యం..


సిద్ధు, సీరత్ కపూర్, విక్రమ్, పృథ్వీ

రచయిత శ్రీధర్ సీపాన దర్శకుడిగా మారుతూ రూపొందిస్తున్న చిత్రం 'బృందావనమది అందరిది'. జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ వంగల, ప్రభాకర్‌రెడ్డి తనయ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేశారు. ఆ విశేషాలను దర్శకుడు శ్రీధర్ సీపాన చెబుతూ, 'మెయిన్ హీరోగా సిద్ధు(గుంటూరు టాకీస్ ఫేమ్), రెండవ కీలక పాత్రకు మాస్టర్ విక్రమ్‌ను ఎంపిక చేశాం. విక్రమ్ ప్రముఖ నిర్మాత లగడపాటి శ్రీధర్ అబ్బాయి. చైల్డ్ ఆర్టిస్టుగా 'రుద్రమదేవి', 'రేసుగుర్రం', 'పటాస్' చిత్రాల్లో నటించారు. మూడవ ఆర్టిస్టుగా సీరత్ కపూర్‌ను ఫైనల్ చేశాం. సీరత్ నటన మా స్క్రిప్ట్‌కి 100% యాప్ట్ అవుతుంది. గ్లామర్ పరంగానూ సినిమాకు ప్లస్ అవుతుంది. ఇక నాలుగవ పిల్లర్‌గా పృథ్వీని ఎంపిక చేశాం. ఇందులో మరోసారి తనదైన కామెడీతో నట విశ్వరూపం చూపించబోతున్నారు. గత డిసెంబర్ 29 నుంచి షూటింగ్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సంక్రాంతికి చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాం. తర్వాత జనవరి 20 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపనున్నాం' అని అన్నారు.

వినూత్న ప్రేమకథ


నాగశౌర్య, రష్మిక మండన్న

నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా వెంకి కుడుముల దర్శకత్వంలో శంకర్ ప్రసాద్ మాల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ పతాకంపై ఉషా మాల్పూరి నిర్మిస్తున్న చిత్రం 'ఛలో'. ఈ చిత్రంలోని రెండవ సాంగ్‌ను సోమవారం సీనియర్ జర్నలిస్ట్‌లు బి.ఎ.రాజు, పసుపులేటి రామారావు సంయుక్తంగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా పసుపులేటి రామారావు మాట్లాడుతూ, 'పాట చాలా బాగుంది. నాగశౌర్యకిది పెద్ద హిట్ కావాలి. ఆయనకు మంచి భవిష్యత్ ఉండాలి' అని అన్నారు.
'2018లో సక్సెస్ పరంపరను 'ఛలో' సినిమాతో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట అలరిస్తోంది. కాసర్ల శ్యామ్ రాసిన ఈ రెండవ పాటను విడుదల చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా సూపర్ హిట్ కావాలి' అని బి.ఎ.రాజు తెలిపారు. సీనియర్ నరేష్ చెబుతూ, 'టాలీవుడ్‌లో గోల్డెన్ రోజులు సాగుతున్నాయి. ఈ చిత్రం స్క్రిప్ట్ విన్నప్పుడే గన్‌షాట్‌గా సినిమా విజయం సాధిస్తుందని చెప్పాం. ఇప్పుడూ చెబుతున్నా సినిమా విజయం గ్యారంటీ. మ్యూజికల్‌గానూ హిట్‌గా నిలుస్తుంది' అని చెప్పారు. 'వినూత్నమైన ప్రేమ కథా చిత్రమిది. ఫస్ట్ సాంగ్‌కు మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు రెండవ పాటను నూతన సంవత్సరం సందర్భంగా విడుదల చేయడం హ్యాపీగా ఉంది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న నన్ను గతేడాది దర్శకుడిని చేశారు. ఈ ఏడాది సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా చేయబోతున్న నిర్మాతలకు ధన్యవాదాలు. ఈ నిర్మాణ సంస్థ నాగశౌర్యకే కాదు, నాకూ సొంత బ్యానర్‌లాంటిది' అని దర్శకుడు వెంకి తెలిపారు.
నాగశౌర్య చెబుతూ, 'సినిమా చాలా బాగా వచ్చింది. 'ఆరెంజ్' నాకిష్టమైన సినిమా. అందులోని పాటల్లాగా నా సినిమా పాటలుండాలనుకున్నా. సంగీత దర్శకుడు మహతి స్వర సాగర్ అదే స్థాయిలో అద్భుతమైన బాణీలను అందించారు. సాయి శ్రీరామ్ ఉన్నందు వల్లే సినిమా చేశాం. ఆయన బాగా చూపించారు. కోటగిరి వెంకటేశ్వరరావు సినిమా బాగుందని చెప్పడం ధైర్యాన్నిచ్చింది' అని తెలిపారు. 'సినిమాకు మీడియా ఎంతో సపోర్ట్ చేస్తోంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి సినిమాను ఫిబ్రవరి 2న గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం' అని గౌతమ్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో శంకరప్రసాద్, ఉషా, కోటగిరి వెంకటేశ్వరరావు, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

అనుబంధాల వారధి.. హౌరా బ్రిడ్జ్

రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరీ, మనాలీ రాథోడ్ హీరోహీరోయిన్లుగా రేవన్ యాదు దర్శకత్వంలో ఈఎంవిఈ స్టూడియోస్ ప్రై.లిమిటెడ్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'హౌరాబ్రిడ్జ్'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రానికి 'హౌరాబ్రిడ్జ్' టైటిల్ పెట్టడానికి ఓ ప్రత్యేక కారణం ఉంది. అదేంటనేది త్వరలోనే తెలియజేస్తాం. హ్యూమన్ రిలేషన్స్‌కి ఈ కథ బ్రిడ్జ్‌లాగా ఉంటుంది. ఇందులో మరో బ్రిడ్జ్ కూడా ఉంటుంది. అదేంటనేది ప్రస్తుతానికి సస్పెన్స్. అద్భుతమైన విజువల్స్ ఆడియెన్స్‌ను వండర్ చేస్తాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు, సాంగ్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఈ నెలలోనే సినిమాను గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం' అని అన్నారు. 'డిఫరెంట్ స్క్రీన్‌ప్లేతో మెస్మరైజ్ చేయబోతున్నాం. నాయకా నాయికలుగా అద్భుతంగా నటించారు. శేఖర్ చంద్ర మ్యూజిక్ సినిమాకు అసెట్ అవుతుంది' అని దర్శకుడు తెలిపారు.


చాందినీ చౌదరీ, రాహుల్ రవీంద్రన్

వైద్యం ప్రయి'వేటు'కే!

ఎన్‌ఎంసీ బిల్లుపై నేడు లోక్‌సభలో చర్చ

- అమల్లోకొస్తే ఆరోగ్యశాఖ ఆగమాగం
- పెరగనున్న ప్రయివేటు వైద్య కళాశాలల పెత్తనం
- 60 శాతం ఫీజులు పెంచుకునే ఛాన్స్
- ఇష్టారాజ్యంగా కళాశాలలు ఏర్పాటు చేసుకునే అవకాశం
- ఆయుర్వేదం, హోమియోలకు అల్లోపతి హోదా
- బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వైద్యులు
- ఎంసీఐని కొనసాగించాలని డిమాండ్
- నేడు దేశవ్యాప్తంగా ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బంద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యరంగంలో సంస్కరణల పేరుతో లోపాలను సరిచేసే లక్ష్యంతో నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ)ను ప్రతిపాదిస్తూ కేంద్రం తీసుకొచ్చిన బిల్లుపై వ్యతిరేకత అంతకంతకూ పెరుగుతోంది. వైద్యవృత్తిని భ్రష్టుపట్టించే విధంగా ఉన్న ఈ బిల్లును వెంటనే సవరించాలని లేదా ప్రస్తుతం ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)నే కొనసాగించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో మంగళవారం ఒక రోజు నిరసన చేపట్టనున్నారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఔట్ పేషంట్ సేవలను నిలిపివేస్తామని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నర్సింగ్‌రెడ్డి తెలిపారు. దేశంలో సుమారు 18 వేల మంది వైద్యులు, రాష్ట్రం నుంచి సుమారు 4 వేల మంది వైద్యులు సమ్మెలో పాల్గొంటారని వివరించారు. కాగా, ఎంసీఐ స్థానంలో ఎన్‌ఎంసీ ఏర్పాటైతే వైద్యవృత్తిలో అవకతవకలు పెరిగే ప్రమాదం ఉందనే ఆరోపణలున్నాయి. ఎంసీఐలో 25 మంది సభ్యులు డాక్టర్లే ఉంటారు. ఐదేండ్లకోసారి ఎన్నికల్లో డాక్టర్లందరూ పాల్గొని సభ్యులను ఎన్నుకుంటారు. కానీ ప్రతిపాదిత ఎన్‌ఎంసీలో అలా కాదు. 25 మంది సభ్యుల్లో 20 మంది ఇతర రంగాల నుంచి ఉంటారు. కేంద్ర ప్రభుత్వం వీరిని నామినేట్ చేస్తుంది. డాక్టర్లు కేవలం 5 మంది మాత్రమే ఉంటారు. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖల ప్రతినిధులు, మానవ వనరుల అభివృద్ధి శాఖ, ఫార్మాస్యూటికల్స్ విభాగం ప్రతినిధులు, ఆరోగ్యం, సైన్స్ రంగాల నిపుణులు ఆర్థికవేత్తలను సభ్యులుగా నియమిస్తారు. ఎన్‌ఎంసీకి అవసరమైన సలహాలు ఇచ్చేందుకు మెడికల్ అడ్వైజరీ కౌన్సిల్ (ఎన్‌ఏసీ)ని ఏర్పాటు చేస్తారు. ఎన్‌ఎంసీకి రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు తెలియజేసేందుకు ఎంఏసీ వారధిగా ఉంటుంది. ఇందులోనూ ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంత సభ్యుడు ఉంటారు. ఎన్‌ఎంసీ చైర్మనే ఎంఏసీకి ఎక్స్ అఫిసియో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రయివేటు వైద్య కళాశాలకు ప్రస్తుత నిబంధనల ప్రకారం సీట్లలో 15 శాతం ఫీజులను పెంచుకునే వెసులుబాటు ఉంది. అయితే ఎన్‌ఎంసీలో ఇది 60 శాతంగా ఉంది. ఇక ఎన్‌ఎంసీలో ఎన్ని ప్రయివేటు వైద్య కళాశాలలైనా ఏర్పాటు చేసుకోవచ్చు. ఐదేండ్ల తరువాత సబ్‌కమిటీ తనిఖీ చేస్తుంది. లోపాలు ఉంటే రూ.5 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు జరిమాన విధిస్తుంది. ఎంసీఐలో సీట్లను రద్దు చేస్తారు. ఇక ఆయుర్వేదం, హోమియోపతి వైద్యాన్ని అల్లోపతి వైద్య విధానం సరసన చేర్చనుండటంపై వివాదం ముదురుతోంది. ఆయుర్వేదం, హోమియోపతి, యోగా తదితర సంప్రదాయ చికిత్సలను అందిస్తున్న వైద్యులు ఒక బ్రిడ్జికోర్సు పూర్తి చేస్తే అల్లోపతి డాక్టర్‌గా అర్హత లభిస్తుంది. ఎంచక్కా సర్జరీలు చేయొచ్చు. ఇదివరకే ఈ బిల్లును కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. మంగళవారం నాడు చర్చకు రానుంది.

ఎంబీబీఎస్ తర్వాత మళ్లీ పరీక్ష

ఎన్‌ఎంసీలో మరో వివాదం ఉంది. ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు జాతీయ స్థాయిలో మరో అర్హత పరీక్ష (నేషన్ ఎగ్జిట్ టెస్ట్-నెక్ట్స్)ను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోతే వైద్య వృత్తి నిర్వహణకు కూడా అనర్హులుగానే పరిగణిస్తారు. ఈ పరిణామాలు వైద్య విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఐదున్నరేండ్లలో అనేక పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యాక మరో పరీక్ష ఎందుకు రాయాలని జూడాలు కేంద్రాన్ని నిలదీస్తున్నారు. ఇతర దేశాలలో వైద్య విద్య చదివి వచ్చిన వారికి మాత్రమే నిర్వహించే ఈ అర్హత పరీక్షను దేశంలోని వైద్య విద్యార్థులకు నిర్వహించాలనే నిర్ణయంలో ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంసీఐ నిబంధనల్లో విదేశాల్లో చదివిన వారికి ఇక్కడ వైద్యం చేయాలంటే అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. కానీ ఎన్‌ఎంసీ ఇందుకు విరుద్ధంగా ఉండటం విశేషం. కాగా, వైద్య కళాశాలలకు అనుమతులిచ్చి విద్యా ప్రమాణాలను ఎంసీఐ పర్యవేక్షిస్తుంది. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం హెల్త్ యూనివర్సిటీ చూస్తుంది. వీటిలో లోపాలుంటే సవరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే.. కానీ వైద్య కళాశాలలో నాణ్యత లేదనే కారణంతో విద్యార్థులకు మరో పరీక్ష నిర్వహించాలనడం సరికాదని డాక్టర్లు మండిపడుతున్నారు. కాగా, ఎంబీబీఎస్ సీటు రావాలంటే అంతకుముందు ఎంట్రెన్స్ రాయాలి. అనంతరం ఐదేండ్ల ఎంబీబీఎస్ కోర్సులో 16 సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఒక్కోదానికి మూడు ఇంటర్నల్ పరీక్షలుంటాయి. ఇవిగాకుండా ఒక ప్రీ ఫైనల్, ప్రాక్టికల్స్‌తో పాటు తుది పరీక్షలుంటాయి. వీటన్నింటిలో ఉత్తీర్ణత సాధించాలి. సంవత్సరం చివరలో రాత పరీక్షతో పాటు విద్యార్థులు చదువుతున్న కాలేజీలోని ఇద్దరు ప్రొఫెసర్లు, వేరే రాష్ట్రానికి చెందిన కాలేజీల నుంచి వచ్చే మరో ఇద్దరు ప్రొఫెసర్లు విద్యార్థులను క్షుణ్ణంగా పరీక్షిస్తారు. ఐదో సంవత్సరం ఉత్తీర్ణత తర్వాత మరో సంవత్సరం హౌస్ సర్జన్సీ ఉంటుంది. ఈ విధంగా అనేక పరీక్షలు రాయాలి. ఇంత కఠినమైన పరీక్షలన్నీ రాసి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైతే మళ్లీ అర్హత పరీక్ష రాయాలనడం విద్యార్థులను మానసిక సంక్షోభానికి గురిచేయటమేనని వైద్యనిపుణులు మండిపడుతున్నారు.

ఎన్‌ఎంసీ లోపాలను సవరించాలి



ఎన్‌ఎంసీ ల లోపాల పుట్ట. డాక్టర్లతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఎన్‌ఎంసీ ఏర్పాటుతో భవిష్యత్తులో వైద్య రంగం ప్రమాదంలో పడుతుంది. రోగులకు సేవలు దూరమవుతాయి. రాజకీయ జోక్యం పెరుగుతుంది. ఎంసీఐని ప్రక్షాళన చేసి ఎన్‌ఎంసీని రద్దు చేయాలి. ఇందుకోసం మంగళవారం ఒక రోజు సమ్మెచేస్తున్నాం.

- డాక్టర్ రవిశంకర్, ఐఎంఏ, హైదరాబాద్ అధ్యక్షులు

విద్యార్థులపై అదనపు భారం



ఎంబీబీఎస్ తర్వాత మరో అర్హత పరీక్ష నిర్వహిస్తే విద్యార్థులపై అదనపు భారం పడుతుంది. ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉంది. ఎన్‌ఎంసీని రద్దు చేయాలి. ఈ విధానం డబ్బుతో కూడుకున్నదే కానీ విలువలతో కాదు. ఐదేండ్ల తరువాత తనిఖీలో అంటే అవకతవకలు జరుగుతాయి.

- డాక్టర్ జీ.శ్రీనివాస్, జూడా అసోసియేషన్ సలహాదారు

సినిమా టిక్కెట్ రేట్ల కమిటీపై హైకోర్టులో రిట్

హైదరాబాద్ : సినిమా టిక్కెట్ రేట్లను నిర్ణయించే కమిటీలో నిర్మాతలు దగ్గుబాటి సురేశ్‌బాబు, సి.కళ్యాణ్‌లను సభ్యులుగా నియమిస్తూ ఏపీ సర్కార్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ దాఖలైంది. నిర్మాతల లాభాలు ఆర్జించే కోణంలోనే వారి ఆలోచన ఉంటుందని, ప్రేక్షకుల కోణంలో వారు పరిశీలన చేయబోరంటూ సినీ ప్రేక్షక వినియోగదారుల సంఘం అధ్యక్షుడు జీవీఎల్ నర్సింహారావు రిట్ వేశారు. కమిటీ ఏర్పాటుపై ఎవరికీ అభ్యంతరం ఉండబోదని, అయితే సినిమాలు తీసే నిర్మాతలే సభ్యులుగా ఉంటే వారే ప్రధానంగా లబ్ధిపొందే అవకాశాలు ఉంటాయని పిటిషనర్ రిట్‌లో అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. సినిమా టిక్కెట్ల రేట్ల నిర్ణయంపై కమిటీ వేయాలని రెండేండ్ల కిందట హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హోం శాఖముఖ్యకార్యదర్శి సారథ్యంలో కమిటీ ఉండాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే టిక్కెట్ల రేట్లపై జీవోలు జారీ చేస్తున్న ప్రభుత్వం ధరల నిర్ణయం కోసం కమిటీ వేయలేదని పిటిషనర్ ఆరోపణ. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శులతోపాటు సినీ నిర్మాతలు ఇద్దరినీ ప్రతివాదులుగా చేశారు. ఈ రిట్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపే అవకాశముంది.

రిజిస్ట్రార్‌కు జరిమానా : కావాలనే కోర్టు ఉత్తర్వుల్ని అమలు చేయలేదని తప్పుపడుతూ దక్షిణ భారత హిందీ ప్రచార సభ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రిజిస్ట్రార్‌కు హైకోర్టు రూ.రెండు వేలు జరిమానా విధించింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ప్రదీప్ జరిమానా చెల్లించకపోతే మూడు రోజుల జైలు శిక్ష అనుభవించాలని హైకోర్టు న్యాయమూర్తి నవీన్‌రావు తీర్పు వెలువరించారు.పదవీ విరమణ, పెన్షన్ వంటివి రిటైర్డు ఉద్యోగి సీతానాయుడుకు చెల్లించాలని గత ఏడాది హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ ఆదేశాలు అమలు చేయకపోవడంతో దాఖలైన కోర్టు ధిక్కార కేసులో రిజిస్ట్రార్ ప్రదీప్‌కు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

సైన్స్ కాంగ్రెస్ జరిగేలా ఉత్తర్వులు ఇవ్వండి : హైదరాబాద్‌లోని చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరిగేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ పీహెచ్‌డీ విద్యార్థులు విజయ్‌కుమార్, కిరణ్‌కుమార్ ఇతరులు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం తప్పుడు నివేదికలు కేంద్రానికి ఇవ్వడం వల్లే సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు వేరే ప్రాంతంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దీని వల్ల ఓయూ ప్రతిష్ఠ మంటగలుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓయూలో నిర్వహించేందుకు రూ.50 కోట్లు వ్యయం కూడా చేశారని, ఇక్కడే నిర్వహిస్తే ఓయూకు రూ.300 కోట్ల మేరకు లబ్ధి చేకూరేదన్నారు. రూ.50 కోట్లు వృథా కాకుండా ఇక్కడే సమావేశాలు నిర్వహించాలని రిట్‌లో హైకోర్టును కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కార్యదర్శి, ఓయూ వీసీ, డీజీపీ, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

భక్తి ఛానల్ సీఈవోపై చర్యలేవీ?: తిరుమల శ్రీవెంకటేశ్వర భక్తి చానల్ సీఈవో ఏవీ నర్సింహారావు అనేక అక్రమాలకు పాల్పడుతూ అవినీతిలో కూరుకుపోయినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదని హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది.తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని, నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలంటూ తిరుపతి వాసి నవీన్‌కుమార్‌రెడ్డి రిట్ దాఖలు చేశారు. ఏడాదిపాటు సీఈవోగా ఉండాల్సిన నర్సింహారావు పదవీ కాలం 2016లోనే ముగిసినా నేటికీ ఆపదవిలో ఉంటున్నారన్నారు.

అన్నమయ్య పాటకు పట్టాభిషేక కార్యక్రమం పేరుతో నిధులు స్వాహా చేశారని, ఎపిసోడ్‌కు గతంలో రూ.1.40 లక్షలు చెలిస్తే, ఆమొత్తాన్ని రూ.4.75 లక్షలకు పెంచేశారని, చాగంటి కోటేశ్వర ప్రవచనాల డీవీడీలకు 2015లో రూ.5.70 లక్షలు, 2016లో 16.75 లక్షలు వస్తే ఇప్పుడు వాటి అమ్మకాల్ని ఆపేసి టీటీడీకి నష్టం చేకూర్చారని, కన్నడ, తమిళ బాషల్లో ప్రసారాల పేరుతో నోటిఫికేషన్ లేకుండా 56 మంది నియామాకలు చెల్లవని రిట్‌లో పేర్కొన్నారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, టీటీడీ ఈవో, ఎస్వీబీసీ ఎండీలతోపాటు వ్యక్తిగతంగా నర్సింహారావును ప్రతివాదులు చేశారు.

మత్తు దిగింది...

విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- 2,500 కేసుల నమోదు, 1477 వాహనాలు సీజ్
- పట్టుబడ్డ యువకులు, సెలబ్రిటీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

'అరె కొత్తసంవత్సరంరా మామా లాగించు. ఓ పెగ్గేయ్. అరె ఏంగాద్. తాగు మామా. గా పోలీసోళ్లు గియ్యాల ఏమన్నరు. పట్టుకున్నప్పుడు చూద్దాంలే. ఏమన్నంటే గల్లీలపొంటి పోవచ్చు. మరో పెగ్గేయ్..ఏయే ఇంకో పెగ్గేయ్' అంటూ పోలీసుల హెచ్చరికలను బేఖాతర్ చేస్తూ అర్ధరాత్రి వరకు పీకలదాకా ఎంజాయ్ చేద్దామంటూ రోడ్డెక్కిన వారికి తాగిదంతా ఒక్కసారిగా దిగిపోయింది. అడుగడుగునా బ్రీత్ ఎనలైజర్ టెస్టులతో పోలీసోళ్లు హడలెత్తించారు. తాగి వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు భారీ సంఖ్యలో కేసులు నమోదు చేశారు. మూడు కమిషనరేట్ల పరిధిలో దాదాపు 2500కుపైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 22,500 వాహనాదారులను తనిఖీచేసి 1477 వాహనాలను సీజ్ చేశారు. అయితే, ఆదాయం కోసం అర్ధరాత్రి దాకా బార్లు, రెస్టారెంట్లు తెరిచి ఉంచేందుకు అనుమతించి...తిరిగి తాగినోళ్లపై కేసులు పెట్టడంతో పాటు జరిమానాలతోనూ రాబడి రాబట్టుకోవటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.




న్యూ ఇయర్ జోష్‌లో మునిగితేలిన యువకులకు మూడు కమిషరేట్ల పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. అదివారం రాత్రి 10 గంటల నుంచి ఒంటిగంట వరకు పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మూడ కమిషనరేట్ల పరిధిల్లో 175 బృందాలు పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో మొత్తం 2,500 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్టు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 22,500 వాహనాలను తనిఖీలు చేసిన పోలీసులు 1477 వాహనాలను సీజ్ చేశారు. అందులో 1239 ద్విచక్రవాహనాలు, 255 కార్లు, 73 ఆటోలతోపాటు మరో 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలావుండగా సైబరాబాద్ పరిధిలో 582, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 441 కేసులు నమోదయ్యాయి. వేల సంఖ్యలో వాహనాలను సీజ్ చేశారు.

పట్టించుకోని నిబంధనలు

న్యూఇయర్ వేడుకల్లో మందు తాగి వాహనాలు నడుపొద్దని కొద్ది రోజులుగా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. వివిధ ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. ఈవెంట్లు, పార్టీలు నిర్వహించే నిర్వాహకులకు సైతం నిబంధనలు పాటించాలని చెప్పారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పదేపదే హెచ్చరించినా వాటిని చాలామంది పట్టించుకోలేదు. ఫూటుగా మద్యం సేవించి తిరిగి వెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దాంతో సామాన్యుల నుంచి బడా బాబుల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిపోయారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ప్రముఖ తెలుగు యాంకర్



కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్న యువకులు మోతాదుకు మించి మద్యం సేవించడంతో పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ప్రముఖ యాంకర్ ప్రదీప్ సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో అతిగా మద్యం సేవించి కారు నడుపుకుంటూ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 45లోకి వస్తుండగా ట్రాఫిక్ పోలీసులు ఆపారు. బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేయగా 178 పాయింట్లు నమోదయ్యాయి. దీంతో మోతాదుకు మించి మద్యం సేవించి కారు నడిపినట్టు పోలీసులు గుర్తించారు. దాంతో ఆయన కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కారును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మోతాదుకు మంచి మద్యం సేవించడంతో ప్రదీప్‌కు వారం రోజుల జైలు శిక్ష పడే అవకాశముందని తెలుస్తోంది.

విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్

మొదటిపేజీ తరువాయి



ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి శేఖర్, ఎస్ రవి తదితరులు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో దశాబ్దాలపాటు రైతాంగం అనుభవించిన కరెంటు కష్టాలకు శాశ్వత విముక్తి లభించిందని చెప్పారు. తాము ఎన్నికల మ్యానిఫెస్టోలో 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇవ్వలేదని, అయినా రైతుల అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని అమల్లోకి తెచ్చామన్నారు. ఈ విషయంలో తనకు ఉదయం నుంచి అనేక రాష్ట్రాల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయని, రైతు సంక్షేమం తీసుకున్న అతిగొప్ప నిర్ణయం ఇది అని చెప్పారు. దేశంలో వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని స్పష్టం చేశారు. పక్కా ప్రణాళిక, కార్యాచరణతో విద్యుత్‌ఉద్యోగులు పడిన కష్టం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు.

బీజేపీకి భయమా!

మొదటిపేజీ తరువాయి

నెలరోజుల విరామమివ్వడంపై ప్రతిపక్షాలు తప్పు పట్టిన విషయం తెలిసిందే. ఓ ట్వీట్‌లో ఎన్నికల కమిషన్ తీరుపై, మరో ట్వీట్‌లో బీజేపీపై విమర్శలను ఏచూరి తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికల కమిషన్ తన బాధ్యతను విస్మరించరాదని, నిష్పాక్షికత ముబ్బు చాటున దాక్కోరాదని ఏచూరి ట్వీట్ చేశారు. ఎన్నికల విషయంలో బీజేపీ పారదర్శకంగా ఉంటుందని ఎవరూ భావించడంలేదని, రాజ్యాంగ పరంగా సంక్రమించిన బాధ్యతలను ఎన్నికల కమిషన్ సక్రమంగా నిర్వహించాలని ఏచూరి సూచించారు. దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని చెబుతున్న బీజేపీ ఉప ఎన్నికల విషయంలో ఎందుకు భయపడుతున్నదని ఏచూరి ప్రశ్నించారు. హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు కూడా బీజేపీ ఇలాగే భయపడిందని ఆయన గుర్తు చేశారు.

ఉత్తమ్‌తో గ్రూపులకు ఆజ్యం

నవతెలంగాణ-యాదాద్రిభువనగిరి ప్రతినిధి

ఉత్తమ్‌కుమార్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులుగా నియామకమైన తర్వాత చెంచాగిరీ చేసేవాళ్లను నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా నియమించుకుని గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోశాడని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. టీపీసీసీ బాధ్యతలు తనకు అప్పగిస్తే రాష్ట్రంలో టీఆర్ఎస్ వైఫల్యాలపై పాదయాత్ర చేసి 2019లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తానని ధీమా వ్యక్తం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా యాదాద్రి దేవాలయాన్ని సోమవారం దర్శించుకు న్నారు. అనంతరం భువనగిరి రహదారి బంగ్లాలో మీడియాతో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో ఎమ్మెల్యే స్థానాలకు బలహీన అభ్యర్థులను బరిలోకి దింపటం వల్ల, రెబల్స్ బెడద వల్ల తాను ఓటమి పాలయ్యానని చెప్పారు. ఇలాంటి పరిస్థితి వచ్చే ఎన్నికల్లో రాకుండా ఉగాది నాటికి ఎన్నికల బరిలో నిలిపే బలమైన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను తానే ప్రకటిస్తానని వెల్లడించారు. 2019లో కాంగ్రెస్ పార్టీ మోసగాళ్లకు, భూ కబ్జాదారులకు టికెట్లు ఇవ్వదన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలను నియమించే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదన్నారు. వ్యవసాయానికి 24 గంటల పాటు ఇచ్చే విద్యుత్ వల్ల చిన్న, సన్నకారు రైతుల కంటే భూస్వాములకే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని, కేసీఆర్ ప్రభుత్వం భూస్వాములు, బడా పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నదని విమర్శించారు. సీఎం పేపర్లకు ఫోజులిస్తూ ప్రకటనల రూపంలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని ఆరోపించారు. యాదాద్రి గుట్టపై ఉన్న శ్రద్ధ బీబీనగర్ నిమ్స్‌ను పూర్తి చేయడంలో ఎందుకు లేదని సీఎంను ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బంధువులకు ఉన్న కార్పొరేట్ ఆస్పత్రుల ఆదాయం పడిపోతుందన్న కారణంతో నిమ్స్‌ను నిర్లక్ష్యం చేస్తున్నట్టు తెలుస్తోందని ఆరోపించారు. గ్యాంగ్‌స్టార్ నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు బాధితులకు న్యాయం చేయకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నయీమ్ బినామీ ఆస్తులు, వేల కోట్ల రూపాయల డంపింగ్‌ను కాజేయడానికి నయీమ్‌తో అంటకాగిన రాజకీయ నాయకులు, పోలీస్ అధికారులతో కేసీఆర్ కుమ్మక్కయ్యాడని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిందితులను అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

3రోజులు @ 420 కోట్లు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడానికి రాష్ట్రంలో పలు చోట్ల ఈవెంట్లను ఏర్పాటు చేశారు. వీటికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈవెంట్లలో మద్యం అమ్మకాలకు కూడా పర్మిషన్లు ఇవ్వడంతో అమ్మకాలు పెరిగినట్టు తెలిసింది. అలాగే మద్యం షాపుల యజమానులకు అబ్కారీ శాఖ అధికారులు టార్గెట్లు విధించి అమ్మకాలు జరిపించారు. ఎక్సైజ్ శాఖ అంచనాల ప్రకారం డిసెంబర్ చివరి వారంలో రూ.500 కోట్ల ఆదాయం సమకూరుతుందని భావించారు. కాని గోదాంలలో మద్యం నిల్వలు పూర్తి స్థాయిలో ఉంటే టార్గెట్ చేరుకునేవారమని ఎక్సైజ్ ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు.

నుమాయిష్‌లో ఫ్రీ వైఫై

హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 78వ నుమాయిష్ ప్రారంభమైంది. నుమాయిష్‌ను ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు మంత్రి ఈటల రాజేందర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ... 1938లో 100 స్టాళ్లతో ప్రారంభమైన నుమాయిష్ ఈ సంవత్సరం 2500 స్టాళ్లకు చేరుకుందని తెలిపారు. నుమాయిష్‌కు వచ్చేవారి కోసం ఫ్రీవైఫై అందిస్తున్నట్టు చెప్పారు. సందర్శకుల కోసం 200 మంది వాలంటీర్లను నియమించామని వెల్లడించారు. మంత్రి ఈటల మాట్లాడుతూ... ఎగ్జిబిషన్ సొసైటీకి అన్ని విధాలా అండగా ఉంటామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. నుమాయిష్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనతో మరింత గొప్పగా తీర్చి దిద్దుతామ న్నారు. మంత్రి కడియం మాట్లాడుతూ... ఎగ్జిబిషన్ సొసైటీ రాష్ట్ర వ్యాప్తంగా 18 విద్యాసంస్థలు నిర్వహించడం చాలా గొప్ప విషయం. గత ప్రభుత్వాలు ఎయిడెడ్ విద్యాసంస్థలను విస్మరిం చాయి. తెలంగాణ ప్రభుత్వం ఎగ్జిబిషన్ సొసైటీకి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికార,అనధికారులు,ఎగ్జిబిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కిడ్నీ దానమిచ్చిన మహిళ 90వ పుట్టినరోజు వేడుకలు

- సుమారు 30 సంవత్సరాల క్రితం జరిగిన ఆపరేషన్

కొట్టాయం : ఓ అమ్మ తన 90వ పుట్టిన రోజు జరుపుకుంది. మరీ ఇందులో ఏ విశేషమేముంది అనుకుంటున్నారా? విశేషమే ఎందుకంటే సర్వమంగళ అనే మహిళ తన కిడ్నీని కొడుకుకు దానమిచ్చి సుమారు 30ఏళ్లు గడిచాయి. అయినప్పటికీ ఆమె ఆరోగ్యంగా ఉన్నారు. గత శుక్రవారం ఆమె 90వ పుట్టిన రోజు వేడుకలను సుమారు వంద మంది కుటుంబసభ్యులు(మనుమరాళ్లు, మునిమనుమరాళ్లతో సహా) సమక్షంలో నిర్వహించారు.వివరాల్లోకి వెళితే మహిళ కుమారుడు చంద్రశేఖరన్ వారియర్ ఆయన 30 సంవత్సరాల వయస్సులో కిడ్నీ వ్యాధికి గురైయ్యారు. దీనితో ఆ అమ్మ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తన కిడ్నీని కొడుకుకు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. కేరళలో ఆసమయంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లేంట్ ఆపరేషన్ చాలా అరుదు. దీనితో వారు చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో 1988 మార్చి 30న ఆపరేషన్ చేయించుకున్నారు. చికిత్స అయిన రెండు నెలల తర్వాత అనంతరం తల్లి, కొడుకులిద్దరూ ఇంటికి చేరుకున్నారు. మూడు నెలల విశ్రాంతి తర్వాత, వారు పూర్తిగా కోలుకున్నారు. ఆపరేషన్ సమయంలో చంద్రశేఖరన్ ప్రైవేటు హోటల్లో ఉద్యోగి. చికిత్స తర్వాత విదేశీ ప్రయాణాలతో సహా అనేక ప్రయాణాలు చేశారు. ఇప్పటి వరకూ ఎటువంటి అనారోగ్యం బారిన పడలేదు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని చంద్రశేఖరన్, అతని భార్య గీత అవయవ మార్పిడిపై అవగాహన కల్పించడానికి గురువాయూర్‌లో కిడ్నీ ఫౌండేషన్ సంస్థను నెలకొల్పారు.

బీజేపీలో చేరిన త్రిపుల్ తలాక్ పిటిషనర్ ఇషరత్ జహాన్

కోల్‌కతా: త్రిపుల్ తలాక్ కేసులో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన పిటిషనర్లలో ఒకరైన కోల్‌కతా యువతి ఇషరత్ జహాన్ ఆదివారం ఇక్కడ బిజెపిలో చేరారు. బిజెపి రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సయన్‌తన్ బాసు సమక్షంలో ఆమె పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇషరత్ జహ హౌరాలోని పార్టీ కార్యాలయంలో బిజెపిలో చేరారని బసు సోమవారం ఇక్కడ మీడియాకు చెప్పారు. త్రిపుల్ తలాక్ కేసులో విజయం సాధించిన సందర్భంగా ఆమెను సన్మానించి పార్టీలో చేర్చుకున్నామని ఆయన వివరించారు. రాష్ట్ర స్థాయిలో ఆమెను సత్కరించేందుకు ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, అయితే దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఆయన చెప్పారు. త్రిపుల్ తలాక్ కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఐదుగురు పిటిషన్లలో ఇషరత్ ఒకరన్న విషయం తెలిసిందే. 2014లో ఆమె భర్త దుబాయ్ నుండి 'త్రిపుల్ తలాక్' పద్ధతిలో విడాకులివ్వటంతో ఆమె దీనిపై కోర్టును ఆశ్రయించారు. వివాదాస్పదంగా మారిన ఈ ఇస్లామిక్ పద్ధతిని సుప్రీంకోర్టు గత ఆగస్టు 22న వెలువరించిన తీర్పులో కొట్టివేసిన విషయం తెలిసిందే.

టీఎస్‌కాప్స్ యాప్ ఆవిష్కరణ

- దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర పోలీసుశాఖలో...
- 54 అప్లికేషన్‌లతో ప్రజలకు మెరుగైన సేవలు
- భవిష్యత్తులో మరిన్ని సేవలు : డీజీపీ



నవ తెలంగాణ,ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర ప్రజలకు పోలీసు సేవలను మరింతగా చేరువ చేయడమేగాక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తక్కువ సమయంలో ఫలితాలను సాధించడానికి టీఎస్‌కాప్స్ యాప్‌ను ప్రవేశపెట్టినట్టు రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. దీని వల్ల అధికారులు కూడా మరింత ఉత్సాహంగా పనిచేయడానికి వీలవుతుందని ఆయన అన్నారు. దేశంలోనే తొలిసారిగా టీఎస్‌కాప్స్ యాప్‌ను రాష్ట్ర డీజీపీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ..54 అప్లికేషన్‌లతో రూపొందించిన ఈ యాప్ విశిష్టతలను వివరించారు. నూతన సంవత్సరాన్ని టెక్నాలజీ ఇయర్‌గా పోలీసు శాఖ ప్రకటించిందని, అందులో భాగంగానే రాష్ట్రంలోని ప్రతి పోలీసును స్మార్ట్ పోలీస్‌గా మలచడానికి ఈ యాప్‌ను రూపొందించామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసు సేవలన్నింటినీ ఒకే యాప్‌లోకి తీసుకు రావడం జరిగిందన్నారు. ఇందులో పొందుపరిచిన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పోలీసు ఉన్నతాధికారులు మరింత సమర్థవంతంగా పనిచేయడానికి దోహదపడుతుందని తెలిపారు. ఇంటెలిజెన్స్, ఎస్‌బీ విభాగాల అధకారులు అందించే సేవల సమాచారాన్ని ఈయాప్‌లో పొందుపరిచామన్నారు. ముఖ్యంగా పోలీసు స్టేషన్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు క్షేత్ర స్థాయి దర్యాప్తు, తదుపరి విచారణ, నిందితుల గుర్తింపు, వారిని కోర్టులో హాజరుపరచడం మొదలుకొని ఆ కేసు చివరి స్థాయిలో వచ్చే ఫలితాలను కూడా ఈ యాప్ ద్వారా సమాచారం పొందడానికి వీలు కల్పించామని డీజీపీ వివరించారు. సాధారణ పౌరుడి నుంచి డీజీపీ స్థాయి అధికారి వరకు అనుసంధానం చేయడం కూడా ఈ యాప్ ప్రత్యేకతగా ఆయన వివరించారు. క్షేత్రస్థాయిలో కానిస్టేబుల్ మొదలు స్టేషన్‌హౌజ్ అధికారి వరకు రోజూ వారు నిర్వహించే విధులను యాప్ ద్వారా ఉన్నతాధికారి కూడా మానిటర్ చేయడానికి వీలవుతుందన్నారు. మొదట ఈ యాప్‌ను కొన్ని అప్లికేషన్ల ద్వారా హైదరాబాద్ పోలీసుల వాడుకంలోకి తీసుకు వచ్చామని, తర్వాత 54 సేవలను కొత్తగా చేర్చి దీనిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించామని ఆయన తెలిపారు. దీని ద్వారా ఈ గవర్నెన్స్ నుంచి ఎం గవర్నెన్స్ వైపు అడుగులు వేస్తున్నామన్నారు. పోలీసింగ్‌లో 99 శాతం అధికారులు స్టేషన్‌లో కూచుని విచారించడానికి ఉండదని తప్పనిసరిగా స్పాట్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అక్కడ తాను చేయాల్సిన పని గురించిన పూర్తి స్థాయి సమాచారం ఈ యాప్ ద్వారా లభిస్తుందని ఆయన తెలిపారు. విచారణాధికారి ఘటనా స్థలికి చేరుకునే లోపే ఈ యాప్‌ను తెరిచి చూస్తే అక్కడి వాతావరణం మొదలు ఇతర సమాచారం తెలుసుకునే వీలుంటుందని వివరించారు. డయల్ 100కు కాల్ రాగానే పెట్రోలింగ్ అధికారి స్పాట్‌కు ఏ సమయంలో బయలుదేరింది మొదలు చేరుకునే వరకు సమయాన్ని ఇందులో పసిగట్టవచ్చని అన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు ఎంతసేపట్లో స్పందిస్తున్నారనే సమాచారాన్ని కూడా అంచనా వేయడానికి ఈ యాప్ తోడ్పడుతుందని తెలిపారు. వివిధ నేరాలకు సంబంధించి దేశంలోని 19 వేల కోర్టులలో ఎలాంటి శిక్షలు పడ్డాయి, ఏ విధమైన తీర్పులు వచ్చాయని తెలుసుకునేందుకు ఇది సహకరిస్తుందన్నారు. అలాగే నేరాలు ఎక్కడ ఎక్కువగా జరుగుతున్నాయి, ఎందుకు జరుగుతున్నాయి, వాటిని ఏ విధంగా తగ్గించవచ్చు, ఎలా నివారించవచ్చు అనేది కూడా ఉన్నత స్థాయి అధికారి నుంచి క్రింది స్థాయి అధికారుల వరకు వారి స్థాయిలో అంచనా వేసుకొని చర్యలు తీసుకోవడానికి కూడా ఈ యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్ కోసం దరఖాస్తు దారుడి పూర్తి వివరాలను ఆధార్ నంబర్‌ను ఉపయోగించి సమాచారాన్ని తెలుసుకునేలా ఈ యాప్‌ను తయారు చేశామన్నారు. పోలీసుశాఖ నుంచి ప్రజలకు అందే వివిధ సేవలేగాక భవిష్యతులో మరిన్ని సేవలను ఈ యాప్‌కు అనుసంధానం చేస్తామని ఆయన అన్నారు. పోలీసుల పేస్లిప్‌లు, సెవవులు, భద్రత, తదితర సంక్షేమ సమాచారాలు కూడా ఇందులో చేర్చామన్నారు. ప్రస్తుతం నగరంలోని ఉత్తర, పశ్చిమ జోన్‌లు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 1700 ట్యాబ్‌ల ద్వారా ఈ యాప్ సేవలను పోలీసులు వినియోగిస్తున్నారని, త్వరలోనే అన్ని పోలీసుస్టేషన్ల అధికారులు, సిబ్బందికి అందచేస్తామని అన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర పోలీసు సాంకేతిక విభాగం అదనపు డీజీ రవిగుప్తాతో పాటు పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▼ 244
33,812

నిఫ్టీ ▼ 95
10,435

డాలరుకు రూపాయి విలువ
63.67



బంగారం(10.గ్రా)
రూ. 30,160



వెండి (కేజీ)
రూ. 42,000



కోడిగుడ్లు

హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



ఎగిసిన కార్మికుల ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ : గతేడాది నవంబర్ మాసంలో పారిశ్రామిక కార్మికుల ద్రవ్యోల్బణం సూచీ 3.97 శాతానికి ఎగిసిందని కార్మిక మంత్రిత్వ శాఖ ఒక నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా అహారోత్పత్తుల ధరలు, కిరోసిన్, కుకింగ్ గ్యాస్ ధరలు పెరగడంతో క్రితం నవంబర్‌లో ఈ ద్రవ్యోల్బణ సూచీ పెరిగింది. ఇంతక్రితం అక్టోబర్‌లో ఈ సూచీ 3.24 శాతంగా చోటు చేసుకుంది. నవంబర్‌లో అహారోత్పత్తుల ద్రవ్యోల్బణం సూచీ 3.91 శాతానికి ఎగిసింది. అక్టోబర్‌లో ఇది 1.66 శాతంగా ఉంది. క్రితం నవంబర్‌లో గోదుమ పిండి, గుడ్లు, మాంసం, ఉల్లి, చింతపండు, కాకరకాయ, క్యాబేజీ, క్యారేట్, కొబ్బరి, ఆలు, టమాట, గ్యాస్, విద్యుత్, కిరోసిన్ ధరలు పెరిగాయి.

ఐటీ రంగంలో పెరగనున్న ఉద్యోగాలు!

- 2 లక్షల మేర కొత్త జాబ్స్‌కు అవకాశం: ఇండస్ట్రీస్ నిపుణులు



న్యూఢిల్లీ: భారత ఐటీ రంగంలో గతేడాది ఉద్యోగ నియామకాల్లో కొంత అనిశ్చితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరం మాత్రం ఈ రంగంలో కొత్తగా రెండు లక్షల మేర కొత్త ఉద్యోగాలు లభించనున్నట్టు ఇండస్ట్రీస్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇండియన్ జాబ్ మార్కెట్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటివి కొత్త ఉద్యోగాల సృష్టికి దోహదం చేస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో ఉద్యోగులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటేనే ఇక్కడ మనుగడ సాధించగలరని చెబుతున్నారు. ఆటోమేషన్ టెక్నాలజీస్ పెరుగుతున్న తరుణంలో కొన్ని సెగ్మెంట్‌లలో ఉద్యోగాలు ఊడినప్పటికీ.. మొబైల్ తయారీ, ఫిన్‌టెక్, స్టార్టప్‌లు పెరుగుతాయని అంటున్నారు. తద్వారా ఉపాధి కల్పన వేగం పుంజుకుంటుదని అంచనా వేస్తున్నారు. డిజిటల్ ఇండియా నేపథ్యంలో డిజిటల్ వ్యాపారాలు, ఆర్థిక సేవలలో మెరుగుదల చోటుచేసుకుంటుందని టీమ్‌లీజ్ సర్వీసెస్ ఐటీ స్టాఫింగ్ జనరల్ మేనేజర్ అల్కా ధింగ్రా తెలిపారు.

ప్రధానంగా డిజిటైజేషన్, ఆటోమేషన్‌లో పెట్టుబడులు పెరిగి వ్యాపార వృద్ధికి దోహదం చేయనుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు 2018లో 20శాతం మేర నూతన సంస్థలు ఏర్పడి ఉద్యోగ కల్పన జోరందుకుంటుందని తెలిపారు. కాగా భారత్ ఐటీ ఇండస్ట్రీస్ ఈఏడాదిలో 1.8-2 లక్షల కొత్త ఉద్యోగాలను జత చేయనుందని వివరించారు. కాగా ప్రపంచవ్యాప్తంగా 2020నాటికి కేవలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోనే 2.3 మిలియన్ (23 లక్షలు) ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

ఏటీఎం లావాదేవీలు మరింత భారం!

ఇంటర్ బ్యాంకు చార్జీల పెంపు యోచన



న్యూఢిల్లీ: బ్యాంకు ఏటీఎంల ద్వారా నిర్వహించే నగదు లావాదేవీలు మరింత భారం అయ్యేలా సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇంటర్ బ్యాంకు ఏటీఎం లావాదేవీలపై చార్జీలు పెంచాలని ప్రయివేటు రంగ బ్యాంకులు పట్టుపట్టడమే ఇందుకు కారణం. నోట్ల రద్దు ఇతర కారణాల వల్ల ఆటోమేటెడ్ టెల్లర్ మిషన్ (ఏటీఎం)ల నిర్వహణ భారంగా మారినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక బ్యాంకు ఖాతాదారుడు మరో బ్యాంకు ఏటీఎంలో నగదు పొందడమే ఇంటర్-బ్యాంకు లావాదేవీగా పేర్కొంటారు. ఇలాంటి లావాదేవీలపైనే అధిక రుసుంలు వసూలు చేయాలనేది నూతన ప్రతిపాదనగా ఉంది. ఈ చార్జీల పెంపు విషయంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంకులు వేరు వేరుగా నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు ప్రతిపాదనలు, తమ సూచనలు తెలిపాయి. ఒక వేళ చార్జీలు పెంచితే తక్కువ ఏటీఎం నెట్‌వర్క్‌లు కలిగిన చిన్న బ్యాంకు లు ఆర్థికంగా ఒత్తిడికి గురి కానున్నాయి. ఈ భారాన్ని ఖాతాదారులపై వేయాల్సి వస్తే ఇతర బ్యాంకు ఏటీఎంల్లో ప్రతీ నెల అందిస్తున్న ఉచిత లావాదేవీల సంఖ్య కూడా తగ్గిపోనుంది. ఈ రుసుంల పెంపునకు ప్రభుత్వ రంగ బ్యాంకులు వ్యతిరేకంగా ఉన్నాయి. కాగా ప్రయివేటు బ్యాంకులు డిమాండ్ చేస్తున్నాయని మింట్ ఒక కథనంలో వెల్లడించింది. కాగా ఇప్పటికే ఈ చార్జీలు ఎక్కువగా ఉన్నాయని ఒక పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అధికారి పేర్కొంటున్నారు. మరింత పెంచడం సముచితం కాదంటున్నారు. ఇప్పటికే కొత్త నోట్ల రాకతో బ్యాంకులపై అదనపు భారం నెలకొని ఉందన్నారు. 2016 నవంబర్‌లో చేపట్టిన నోట్ల రద్దు వల్ల డిజిటల్ లావా దేవీలు పెరుగుతున్నాయన్నారు. ఏటీఎం వాడకం తగ్గుతుందన్నారు. దీంతో పలు బ్యాంకులు తమ ఏటీఎం శాఖలను హేతు బద్ధీకరిస్తున్నాయన్నారు. ఇప్పటికే ఏటీఎం తయారీ కంపెనీలు తమ మిషన్లపై కూడా ధరలు పెంచాయన్నారు. ఇంటర్-బ్యాంకు ఏటీఎం లావాదేవీలపై చార్జీలను పెంచాల్సి వస్తే సెక్యూరిటీ గార్డుల వేతనాలకు, మానిటరింగ్ చార్జీలకు కోత పెట్టాల్సి వస్తుందని మరో బ్యాంకు అధికారి పేర్కొన్నారు.

కీలక రంగాల ఉత్పత్తిలో వృద్ధి



న్యూఢిల్లీ: 2017 నవంబర్‌లో కీలక రంగాల ఉత్పత్తిలో పెరుగుదల చోటు చేసుకుంది. ఎనిమిది ప్రధాన రంగాలు నవంబర్‌లో 6.8 శాతం వృద్ధితో 13 మాసాల గరిష్ట స్థాయిని నమోదు చేసుకున్నాయి. అక్టోబర్‌లో ఈ రంగాల ఉత్పత్తిలో 5 శాతం పెరుగుదల ఉంది. ముఖ్యంగా సిమెంట్, స్టీల్ ఉత్పత్తి రెట్టింపు కావడంతో పాటు రిఫైనరీ ఉత్పత్తుల మద్దతు గత నవంబర్‌లో కీలక రంగాల సూచీకి మద్దతు లభించిందని సోమవారం కేంద్ర గణంకాల శాఖ ఒక రిపోర్టులో పేర్కొంది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలు ఇందులో ఉన్నాయి. ఇవి 2017-18 ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో 3.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2016-17 ఇదే కాలంలో 4.9 శాతం వృద్ధిని సాధించాయి.

తొలి రోజే తీవ్ర నిరాశపర్చిన మార్కెట్లు

34వేల దిగువకు సెన్సెక్స్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు కొత్త ఏడాదిలో తొలి రోజే తీవ్ర నిరాశను మిగిల్చాయి. సోమవారం ఆటో, బ్యాంకింగ్, ఐటీ సూచీల ఒత్తిడితో గత నెల రోజుల్లో ఎప్పుడూ లేనంత అత్యధికంగా నష్టపోయి, 34,000 దిగువకు పడిపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 244.08 పాయింట్లు క్షీణించి 33,812.75కు పడిపోయింది. డిసెంబర్ ఒక్కటిన 316 పాయింట్లు పడిపోయింది. ఆ తర్వాత ఇదే అత్యల్ప తగ్గుదల. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95.15 పాయింట్లు తగ్గి 10,435.55 వద్ద ముగిసింది. గత కొద్ది రోజులుగా వరుసగా మార్కెట్లు రికార్డు స్థాయిలను నమోదు చేసుకున్న నేపథ్యంలో మదుపర్లు ఒక్క సారిగా లాభాల స్వీకరణకు మొగ్గు చూపారని బ్రోకర్లు పేర్కొన్నారు. దీంతో మార్కెట్లు రికార్డు స్థాయిల నుంచి పడిపోయాయని తెలిపారు.

బీఎస్ఈలో రంగాల వారిగా ఆటో సూచీ అత్యధికంగా 0.78 శాతం నష్టపోయింది. ఇదే క్రమంలో బ్యాంకింగ్ 0.75 శాతంచ టెక్ 0.65 శాతం, ఐటీ 0.55 శాతం చొప్పున నష్టాల పాలై మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి.

పవర్ 0.79 శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.4 శాతం, రియాల్టీ 0.36 శాతం, కన్స్యూమర్ డ్యూరెబుల్స్ 0.18 శాతం చొప్పున రాణించాయి. సెన్సెక్స్‌లో విప్రో 1.39 శాతం, కోల్ ఇండియా 1.31 శాతం, సన్ ఫార్మా 0.49 శాతం, యాక్సిస్ బ్యాంకు 0.44 శాతం, ఎల్అండ్‌టీ 0.39 శాతం చొప్పున అధిక లాభాలు సాధిం చిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఇండస్ ఇండ్ బ్యాంకు 1.45 శాతం, హెచ్‌యూఎల్ 1.4 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 1.35 శాతం, టాటా మోటార్స్ 1.35 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. 2017 చివరి రోజు కావడంతో చాలా వరకు గ్లోబల్ మార్కెట్లు సెలవు ప్రకటించాయి.

ఎస్‌బీఐ కొత్త ఏడాది కానుక

రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపు



ముంబయి : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణ గ్రహీతలకు కొత్త ఏడాది కానుకను ప్రకటించింది. ప్రస్తుత ఖాతాదారులకు 30 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లను తగ్గించినట్టు సోమవారం ఆ బ్యాంకు తెలిపింది. ఈ నూతన వడ్డీ రేటు జనవరి 1 నుంచి అమల్లోకి తెచ్చింది. కొత్త రుణ ఖాతాదారులకు కూడా వచ్చే మార్చి 31 వరకు ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేసినట్లు తెలిపింది. ఇతర బ్యాంకు నుంచి ఎస్‌బీఐకి రుణ బదిలీ చేసుకున్న వారికి కూడా దీన్ని వర్తింపజేస్తుంది. 2016 ఏప్రిల్‌కు ముందు బేస్ రేటు ఆధారంగా రుణాలు తీసుకున్న వారికి ఈ తగ్గింపు వర్తిస్తుంది. దీంతో గృహ, విద్యా రుణాలు తీసుకున్న వారికి కొంత ఉపశమనం లభించనుంది.

అదే విధంగా కొత్త ఖాతాదారులకు మార్జినల్ కాస్ట్ బేసుడ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్) ఆఫర్ కొనసాగుతుంది. తాజా నిర్ణయంతో 80 లక్షల మంది ఖాతాదారులు లబ్ధి పొందనున్నారని ఎస్‌బిఐ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ మేనేజర్ పికె గుప్తా పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకు బేస్ రేటు 8.65 శాతంగా ఉంది. తగ్గించిన కొత్త బేస్ రేటు తమ ఖాతాదారులకు నూతన ఏడాది గిఫ్టుగా అందిస్తున్నామన్నారు. చాలా మంది ఖాతాదారులు తమ రుణ ఖాతాలను బేస్ రేటుకు అనుసంధానం చేసుకోవడం ద్వారా ఈ లబ్ధి పొందవచ్చున్నారు. రిజర్వు బ్యాంకు పాలసీలో భాగంగా ఇప్పటికే తగ్గించిన వడ్డీ రేట్లను ఖాతాదారులకు బదిలీ చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. చాలా వరకు ఎంసిఎల్ఆర్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఎస్‌బీఐ బాటలో మరిన్ని బ్యాంకులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

పుంజుకున్న రూపాయి..

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ పెరిగింది. అమెరికా డాలర్‌పై పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో బ్యాంకర్లు, ఎగుమతిదారులు డాలర్ల విక్రయాలకు మొగ్గు చూపారు. దీంతో సోమవారం మార్కెట్లో డాలర్‌తో రూపాయి విలువ 41 పైసలు పుంజుకుని 63.67 వద్ద ముగిసింది. ఇంతక్రితం శుక్రవారం రూపాయి విలువ 21 పైసలు కోల్పోయి 63.87 వద్ద నమోదయ్యింది. కొత్త ఏడాదిలో రూపాయి విలువ మరింత పుంజుకోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఫీజులు తేలకముందే అడ్మిషన్లు

- ఆందోళనలో తల్లిదండ్రులు
- నేడు సెంట్రల్ సెలబస్ స్కూల్ అడ్మిషన్ షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

Government of Telangana
Department of School Education

ప్రయివేటు బడుల్లో ఇంకా ఫీజుల వసూళ్లపై ఇంకా నిర్ణయం జరుగముందే, అడ్మిషన్లకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. ఇటీవలే సీబీఎస్ఈ, కెంబ్రిడ్జి, ఐసీఎస్ఈ, ఐబీ తదితర సెంట్రల్ సెలబస్ పాఠశాలలకు సంబంధించిన అడ్మిషన్ల షెడ్యూల్ తేదీలను ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య విడుదల చేశారు. మంగళవారం ఆయా పాఠశాలలు వెబ్‌సైట్‌లో ఎల్‌కేజీ,యూకేజీ, ఒకటో తరగతి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, 3 నుంచి అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. 12న ఫైనల్ లిస్టు ప్రకటించాలనీ, ఈ లిస్టును వెబ్‌సైట్‌లో పెట్టడంతో పాటు సదరు డీఈఓలకు లిస్టులు అందించాలని ఆదేశించారు. మూడు రోజుల క్రితమే తెలంగాణ ప్రభుత్వం ఫీజుల నియంత్రణ కోసం నియమించిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ తన నివేదికను సర్కారుకు అందించింది.

ప్రతి ఏటా పదిశాతం ఫీజులు పెంచుకునేందుకు ప్రయివేటు యాజమాన్యాలకు కమిటీ అనుమతిస్తూ ప్రతిపాదన చేసింది. అయితే కమిటీ ప్రతిపాదనలపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయమూ ప్రకటించలేదు. అయినా అడ్మిషన్లను ప్రారంభించాలని ప్రభుత్వం ప్రకటించడం, వచ్చే ఏడాదీ ఫీజుల నియంత్రణ లేనట్టేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సర్కారు నిర్ణయంపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఫీజులపై నిర్ణయం తీసుకుని, అడ్మిషన్లకు అనుమతించాలని కోరుతున్నారు.

త్వరలో ఉదయసముద్రం పనులు పూర్తి

- వారంలోగా పంపు మోటార్లు బిగించాలి
- అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాధ్యమైనంత త్వరలో ఉదయసముద్రం పనులు పూర్తి చేయాలని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఫ్లోరైడ్ బాధిత కరువు ప్రాంతం ప్రజల సమస్యలు తీరుతాయని అన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో 24,468 ఎకరాలు, నకిరేకల్‌లో 62,476, మునుగోడులో 10,270 ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉంటుందన్నారు. చిట్యాల, మునుగోడు, రామన్నపేట, శాలిగౌరారం మండలాల్లో ఫ్లోరైడ్ బాధితులకు తాగు నీరు అందుతుందన్నారు. వారంలోగా పంపు మోటార్లు భిగించాలని అధికారులను ఆదేశించారు.

చెత్తకుప్పలో బంగారం



రీ సైక్లింగ్ కి నోచుకోక రూ. 6,347 కోట్ల బంగారం వృథా
ఇతర లోహాలను కలుపుకుంటే రూ. 18,677 కోట్లకు పైనే!

"చేతిలో చిల్లిగవ్వ లేని సమయాన.. ఆపద వచ్చిపడిన తరుణాన.. అప్పు ఇచ్చేవారు దొరకని నిమిషాన.." అప్పటి వరకూ ఇల్లాలి ఒంటిపై అలంకారంగా ఉన్న బంగారమే.. ఆ సామాన్యుడిని గండం నుండి గట్టెక్కించే అభయహస్తమవుతుంది. అలాంటి పసిడి వెన్నెలను కురిపించే దాదాపు రూ. 6,347 కోట్ల విలువజేసే బంగారాన్ని ఏటా మన పాలకులు చెత్తకుప్పల్లో పడేస్తున్నారని తెలుసా? ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..

- ఈ - వ్యర్థాల నిర్వహణలో చైనా, రష్యా దూకుడు.. వెనుకబడుతోన్న భారత్!
- మోడీ అధికారంలోకి వచ్చాక .. 40 రీ సైక్లింగ్ ప్లాంట్ల ఏర్పాటు
- రోజుకు 10,000మెట్రిక్ టన్నుల ఈ-వేస్ట్ తో డంప్ యార్డ్ గా ఢిల్లీ: ఐటీయూ, అసోచాం సర్వేల్లో వెల్లడైన పలు అంశాలు

జై

భారతదేశంలో ముఖ్యంగా మధ్యతరగతి వారి జీవన చట్రంలో బంగారానికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. గొప్పోడికి ఆడంబర వస్తువుగా ఉండే పసిడి.. పేద, మధ్యతరగతి వారికి మాత్రం అత్యవసర సమయాల్లో ప్రాణాన్ని కాపాడే కల్పవల్లిగా ఉంటుంది. అటువంటి అమూల్య సంపద అయిన బంగారంతో పాటు వెండి, పల్లాడియం వంటి అరుదైన లోహాలను మన ప్రభుత్వం డంప్ యార్డుల్లో పారేస్తున్నదని ఇంటర్నేషనల్ టెలీకమ్యూనికేషన్ యూనియన్(ఐటీయూ) సర్వేలో తాజాగా తేలడం గమనార్హం.

మన బంగారం డంప్ యార్డుల్లోకి!

బంగారం, వెండి, పల్లాడియం, ఐరన్, కాపర్, అల్యూమినియం తదితరాలు కలిగిన సుమారు రూ. 18,677 కోట్లు విలువచేసే లోహాలను ఎలక్ట్రానిక్ వ్యర్థాల(ఎలక్ట్రానిక్ వేస్ట్/ఈ-వేస్ట్) పేరుతో పునరుత్పత్తి చేసుకోకుండా మన ప్రభుత్వ పెద్దలు డంప్ యార్డుల్లో పారేస్తున్నారని.. ఇందులో సుమారు రూ. 6,347 కోట్ల విలువజేసే బంగారం, రూ. 300 కోట్ల వెండి ఉన్నట్టు 'గ్లోబల్ ఈ-వేస్ట్ మానిటర్ - 2017' పేరిట యూఎన్ కి చెందిన ఇంటర్నేషనల్ టెలీకమ్యూనికేషన్ యూనియన్(ఐటీయూ) తాజాగా చేసిన అధ్యయనంలో వెల్లడైంది. 2016 సంవత్సరం లో భారతదేశం సుమారు 20లక్షల టన్నుల(200 కోట్ల కిలోలు) ఈ-వ్యర్థాలను ఉత్పత్తి చెయ్యగా.. ముంబై, ఢిల్లీ, బెంగుళూరు నగరాలు ఈ-వేస్ట్ ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నట్టు తేలింది.

రీ సైక్లింగ్ లో ఎంతో వెనుక

ఈ-వేస్ట్ రూపంలో అక్కరకు రాకుండా పోతున్న విలువైన లోహాలను రీ సైక్లింగ్ చేయడంలో మన పాలకులు అశ్రద్ధ వహించడం వల్ల 22శాతం వ్యర్థాల రీ సైక్లింగ్ సామర్థ్యాన్ని భారత్ కలిగి ఉన్నప్పటికీ, కేవలం రెండు శాతం మాత్రమే ఈ - వ్యర్థాలు పునర్వినియోగానికి వస్తున్నాయట. దీనివల్ల ఈ - వేస్ట్ వల్ల 18,677 కోట్ల రూపాయలు ఖజానాకు రావాల్సి ఉండగా.. కేవలం, రూ. 373 కోట్లను మాత్రమే ఈ - వ్యర్థాల ద్వారా రికవర్ చేస్తున్నా మని అసోచాం నివేదిక వెల్లడించింది.మన పాలకుల అసమర్థతను తూర్పారబట్టింది. అంతేనా, నవంబర్ 2014 - డిసెంబర్ 2016 మధ్య కాలంలో కేవలం 40 మాత్రమే రిజిస్టర్డ్ రీ సైక్లింగ్ ప్లాంట్లను మోడీ సర్కారు ప్రవేశపెట్టి.. వాటిని కూడా సక్రమంగా నడపకపోవడాన్ని చూస్తే.. మన పాలకులకు వ్యర్థాల నుంచి లాభం పొందడంపై ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా, చైనా, రష్యా దేశాలు ఈ - వేస్ట్ రీ సైక్లింగ్ లో పురోగతి సాగిస్తూ మనకన్నా ఎంతో ముందుండటం విశేషం.

పసిడి బాండ్లపై కాదు, వృథాగా పోతున్న బంగారంపై శ్రద్ధ అవసరం

ప్రపంచ వ్యాప్తంగా ప్రధాన బంగారు ఉత్పత్తి గనులలో నిల్వలు అడుగంటుతుండడం, కొత్త గనుల అన్వేషణకు ప్రధాన కంపెనీలు అదనంగా మరిన్ని నిధులను వెచ్చించేందుకు ఆసక్తి చూపకపోవడంతో పాటు.. చాలా చోట్ల పసిడి గనుల అన్వేషణ సత్ఫలితాలిస్తుండకపోవడం వల్ల రానున్న రోజుల్లో బంగారం లభ్యత భారీగా పడిపోయే అవకాశాలున్నట్టు ఇప్పటికే పలు నివేదికలు తెలిపాయి. బంగారు నగలు ధరించడంలో, బంగారాన్ని దిగుమతి చేసుకోవడంలో మన భారత్ టాప్ లో ఉండటం తెలిసిందే! గణాంకాల ప్రకారం.. మన దేశం ఏటా దాదాపు 1000 టన్నుల బంగారాన్ని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. ప్రపంచం మొత్తం ఉత్పత్తి చేస్తున్న బంగారంలో మన వాటా కేవలం 0.75శాతం మాత్రమే!

ఈ - వేస్ట్ కొన్ని ఆసక్తికర అంశాలు

- 2016లో ప్రపంచవ్యాప్తంగా 44.7 మిలియన్(4.47కోట్లు) టన్నుల ఈ వేస్ట్ ఉత్పత్తి అయింది. ఇది 4,500 ఈఫిల్ టవర్ల బరువుతో సమానం.
- ఇప్పటికే, వాయు కాలుష్యంతో అల్లాడిపోతున్న ఢిల్లీవాసులకు ఈ - వేస్ట్ బెడద కూడా తప్పట్లేదు. ఎందుకంటే, రోజుకు పదివేల మెట్రిక్ టన్నుల ఈ - వ్యర్థాలు రాజధానిలో పొగవుతున్నాయట మరి!
- 2016లో ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయిన ఈ - వ్యర్థాల్లో రూ. 14,41,66,84,59,000 విలువగల బంగారం ఉందట!

సహజంగా కిలో బంగారాన్ని వెలికితీయడానికి 1520డాలర్లు (సుమారు లక్ష రూపాయలు) ఖర్చు చెయ్యాల్సి వస్తే, రీ - సైక్లింగ్ లో అయ్యే ఖర్చు 66డాలర్లే(రూ. 4200) నని.. పాలకులు గోల్డ్ బాండ్ల ప్రచారంపై పెట్టే శ్రద్ధ ఈ-వేస్ట్ రూపంలో వ థాగా పోతున్న బంగారం, వెండి, పల్లాడియం వంటి అరుదైన లోహాల పునరుత్పాదనలో పెడితే బాగుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నగరం	ఈ - వేస్ట్ ఉత్పత్తి (మెట్రిక్ టన్నుల్లో)
ముంబయి	1,20,000
ఢిల్లీ (ఎన్సీఆర్)	98,000
బెంగుళూరు	92,000
చెన్నై	67,000
కోల్ కత	55,000
అహ్మదాబాద్	36,000
హైదరాబాద్	32,000
పుణే	25,000

దేశంలోని ఈ - వ్యర్థాల్లో దాగున్న లోహాలు

విలువ	(కోట్లలో)
బంగారం	6,347
కాపర్	3,262
అల్యూమినియం	1,228
ఐరన్	1,227
పల్లాడియం	1,161
వెండి	300

ఆధారం: ఐటీయూ -2016 సర్వే

మధ్యప్రదేశ్‌లో పులుల మరణాలు అత్యధికం



వరుసగా రెండో ఏడాది :ఎన్‌టీసీఏ

భోపాల్: దేశంలో 2017 ఏడాదిలో అత్యధికంగా పులుల మరణాలు మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకున్నాయి. మొత్తం దేశవ్యాప్తంగా మరణించిన పులుల సంఖ్యలో నాల్గోవ వంతు ఈ రాష్ట్రంలోనివే. నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ) నివేదిక ప్రకారం 2017లో దేశవ్యాప్తంగా 95 పులులు చనిపోగా అందులో 25 పులలు మధ్యప్రదేశ్‌లోనే మరణించాయి. మహారాష్ట్రలో 17, కర్నాటక, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో 15 చొప్పున, అస్సాంలో ఎనిమిది, ఉత్తరప్రదేశ్‌లో ఏడు, తమిళనాడులో మూడు కేరళలో రెండు, రాజస్థాన్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఒక్కో పులి చొప్పున మరణించాయి.

2016లోనూ అత్యధిక పులుల మరణాలు మధ్యప్రదేశ్‌లోనే జరిగాయి. ఆ ఏడాది 97 పులులు మరణించగా అందులో 30 పులులు మధ్యప్రదేశ్‌లోనివే. పెద్ద సంఖ్యలో పులులు మరణించడం జంతు ప్రేమికులను, అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నది. పులుల రాష్ట్రంగా పేరుపొందిన మధ్యప్రదేశ్ తన ఖ్యాతిని 2010లో భారత వన్యప్రాణి సంస్థ జరిపిన సర్వేతో కోల్పోయింది. దీనికి కారణం రాష్ట్రంలో పులుల మరణాలు ఎక్కువగా ఉండటమే. రాష్ట్రంలో 2016 జనవరి నుండి ఇప్పటి వరకు 55 పులులు మరణించాయి. పులుల వేట, ఇన్‌ఫెక్షన్ల బారిన పడటం, పులుల మధ్య దాడులు, రైలు ప్రమాదాల...తదితర కారణాలు పెద్ద సంఖ్యలో పులుల మరణాలకు దారితీసి ఉండొచ్చునని అటవీ అధికారులు చెబుతున్నారు. వన్యప్రాణి సంరక్షణ సంస్థ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇంచార్జ్ రితేశ్ సిరొతియా పులుల మరణాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



మానవుని మీద సంస్కృతి ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయనవసరం లేదు. సంస్కృతి మానవుని ఊపిరి. అది అతని జీవన రాగం. జీవన రక్తం. అది లేక అతడు లేడు. మానవుడు పుట్టిన దగ్గరి నుంచి చనిపోయేవరకు సంస్కృతి నిర్దేశానుసారం ప్రవర్తిస్తాడు. మానవుడు యథాతథంగా ఎందుకు ప్రవర్తిస్తాడు?" అంటే అతడు పుట్టిన సంస్కృతి అతడిని అలా నడుపుతుంది అని సమాధానం వస్తుంది. తెలుగు సంస్కృతిలో పుట్టి పెరిగినవాడు తెలుగువారిలా ప్రవర్తిస్తాడు గాని అమెరికావాడులా ప్రవర్తించడు.

మానవుని మీద సంస్కృతి ప్రభావం




తెలిసినా తెలియక పోయినా మనమంతా సంస్కృతికి వారసులం. మనం సంస్కృతి చేసిన బొమ్మలం. మన సంస్కృతి మనలను కొన్ని పద్ధతుల్లో నడవమనీ, మరి కొన్ని పద్ధతుల్లో చరించవద్దని ఆదేశిస్తుంది. అది మన లక్ష్యాలను, విలువలను, వైఖరులను నిబద్ధిస్తుంది. మన ప్రవర్తనకు అర్థాన్నివ్వడమే కాక ఇతరుల ప్రవర్తనను అర్థం చేసుకునే కిటుకులను అందిస్తుంది. విశ్వాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రతిపాదించే సిద్ధాంతాలు కూడా మన సంస్కృతి ప్రభావితాలే.

హోర్టన్ చెప్పినట్లు అలంకారికంగా చెప్పాలంటే "మానవుడు సంస్కృతి చేతిలో బందీ". మనస్సులో లేదా ఆత్మలో లౌకిక లేదా అనుభవిక అంశాలు ఏర్పడిన తీరును గమనిస్తే సంస్కృతి ప్రభావం ఎంతటిదో అర్థమవుతుంది. ఆత్మ సామాజిక ప్రక్రియా జనితం. ఈవిషయం ఫ్రాయిడ్ మూర్తిమత్వ సిద్ధాంతాన్ని చూసినప్పుడు అర్థమవుతుంది. ఇతడి ప్రకారం మూర్తిమత్వం నిర్మితిలో ఇడ్, ఈగో, సూపర్ ఈగోలు అనే మూడు అంశాలున్నాయి. ఈగో అంటే అహం. అహంలో కొంతమేర చేతనం, మరికొంత మేర అచేతనం ఉంటుంది. ఈ అచేతన భాగాన్ని 'ఇడ్' (అది) అంటారు. వ్యక్తికి సంబంధించిన జీవ సహజాతాలు, జీవన ప్రేరణలు ఇందులో ఉంటాయి. ఈ ప్రేరణల శక్తిని 'లిబిడో' అంటారు. ఇడ్ కోరికలు, సహజాత శక్తులు పరిసరంతో సంబంధం కోసం ప్రత్యేక వాంఛల రూపంలో బయలు వెడలి చేతన భాగాన్ని (అహాన్ని) ప్రభావితం చేస్తాయి. ఇడ్ వెలిబుచ్చే వాంఛలకు సమాజం అనుమతించదు. వాటిని అహం అణచివేస్తుంది. ప్రపంచం విధించే ఆంక్షలకు అనుగుణంగా 'ఇడ్ వాంఛలను' మలిచి, అహం తన కండరాల శక్తితో ప్రపంచంలో మార్పు తెచ్చి, ఇడ్‌కు ప్రపంచానికి మధ్య సేతువు అవుతుంది. ఇడ్‌కు తన సుఖం తప్ప అన్యం పట్టదు. మంచి చెడులు తెలియవు. అహం ద్వారా తప్ప ఇడ్ బయటికి రావడానికి వీల్లేదు.

మొదట మానవుని మనసంతా ఇడ్‌తో నిండి ఉంటుంది. అతనిలో పశువాంఛలు, ప్రబోధ నలు తప్ప ఏమీ ఉండవు. ఆలోచనలకు తావు లేదు. మొదట శిశువు స్థితీ ఇంతే. శిశువులో అహం వాంఛలే ఉంటాయి. మానవుడు సామాజిక జీవి. అందుకని ఒక వ్యక్తి అహం వాంఛలకు, మరో వ్యక్తి అహం వాంఛలకు ఘర్షణ వస్తుంది. కాబట్టి ఇతరులకోసం అహం వాంఛలను అదుపులో పెట్టుకోవాల్సి ఉంటుంది. అప్పుడు మనసులో నాగరక, స్నేహ భావాలు పెరగడం అనివార్యమవుతుంది. ఈ నూతనంగా పెరిగిన భాగాలే అహం (ఈగో), ఇది క్రమంగా వికసిస్తుంది. అహం మొదట్లో బలహీనంగా ఉంటుంది. ఇది ఇడ్ వాంఛలను తీర్చడంలో ప్రపంచం తిరస్కారానికి గురవుతుంది. ఇక్కడ ప్రపంచం అంటే తల్లిదండ్రులు, సమాజం, ప్రేమించిన వస్తువును వదులుకోవలసి వచ్చినప్పుడు అహం ఆ వస్తువు ప్రతిమను తనలో నిలుపుకొని, దానిని హత్తుకొని తాదాత్మ్యం చెందుతుంది. తను త్యజించవలసి వచ్చిన వస్తువు లక్షణాలను సంతరించుకొని అహం పెరుగుతుంది. ఇడ్ తన వాంఛలను తిన్నగా, నగ్నంగా తీర్చుకోవాలని పట్టుబట్టినప్పుడు, సమాజం అనుమతించిన మార్గములలో తృప్తిని పొందవలసిందని దానికి అహం కళ్లెం వేస్తుంది. ఈవిధంగా సమాజానికి సంబంధించిన ఒక భాగం కొత్తగా అహంలో మొలుస్తుంది. దీన్ని సూపర్ ఈగో (అధ్యహం) అంటారు. ఇది దాదాపు మన అంతరాత్మకు సమానం. ఇది గురువుగా, తండ్రిగా, న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తుంది. దీనిలో విధి నిషేధాలుంటాయి. ఈ సూపర్ ఈగో మానవునికి మాత్రమే విలక్షణమైనది. జంతువులకు అంతరాత్మలేదు. మానవునికి ఉన్న బాల్యం, యౌవనంలో లైంగిక ధ్యేయానికి చేరే ముందు లిబిడో చేసే విలంబనాల వల్ల ఇది ఏర్పడటానికి అవకాశం ఉంది. శిశువు లైంగిక ప్రబోధనలను నిర్బంధించడం వల్ల ఇది ఆవిర్భవిస్తుంది.

మానవుని అనుభవానికి అనివార్యమైన ఒక ఉపాధి సంస్కృతి. ప్రతి అనుభవానికి సంస్కృతి వాహకం. ఏరకమైన అనుభవం సంస్కృతి ద్వారా తప్ప మానవుని చేరలేదు. అలాగని అనుభవానికి ఇతర ఉపాధులు లేవని కాదు. ప్రాకృతిక ప్రపంచంలో మరో పెద్ద ఉపాధి. తనకు పరిసరానికి మధ్య సంస్కృతిని తెరగా నిలబెట్టాడు మనిషి. భౌతిక ప్రపంచాన్ని, సమాజాన్ని మనిషి ఈ తెరలో నుంచి దర్శించవలసిందే. ప్రతిదీ ఈ తెరగుడ్డ లోనుంచి వడకట్టబడవలసిందే. కాలం, దూరం, ఆకాశం, బరువు, ఒడ్డు, పొడవులు అన్నిటినీ ఈ తెర నేతలో నుంచి రంగులో నుంచి అర్థం చేసుకోవలసిందే. "మానవ శరీరంలోని ప్రతి భాగం సంస్కృతి ప్రభావితమే" అని చెబితే తప్పుకానేరదు. సంస్కృతి మన నీడ. అసలు సత్యమంతా సాంస్కృతిక సత్యమే. అనుభవమంతా సంస్కృతీవాహ్యామే.

-ఎ.వి.రెడ్డి



అజంతా గుహాలయం

భారత దేశంలో మొదటిసారిగా ఆలయాలను, మత సంబంధమైన కట్టడాలను కొండలలో పెద్ద శిలలతో తొలచడం అశోకుని కాలంలో ప్రారంభమయింది. ఈపద్ధతీ, ఇటుక కలపలతో నిర్మాణ పద్ధతి రెండూ కొనసాగుతూ వచ్చాయి. అయితే శిల శాశ్వతమైనది. కనుక వాటిలోకి తొలిచిన ఆలయాలు ఈ నాటికీ నిలిచి ఉన్నాయి. రాతిలో తొలిచినవాటికి ఆదర్శం అంతకు పూర్వపు ఇటుక-కలప నిర్మాణాలు కనుక; వాటి ముందుపక్క, లోపల వాటి లక్షణాలను ప్రతిబింబిస్తుంటాయి. ఈవిధంగా ఆనాటి వాస్తుశిల్ప రీతులు మనకు ఇప్పుడు లభ్యమవుతున్నాయి. శిలల్లోకి తొలిచిన ఈ 'ఆలయాలు' అని పిలుస్తున్న నిర్మాణాలు నిర్మించిన ఆలయాల లక్షణాలను ప్రతిబింబించినప్పటికీ, వీటిని ఒకదానితో ఇంకొకటి కలిపి, పేర్చి చేసిన 'నిర్మాణాల' కింద జమకట్టలేము. వాటిని బృహత్ శిల్ప నిర్మాణంగా భావించవచ్చు. వాటిని 'రాతి వాస్తు శిల్పం'గానో, 'శిలావాస్తు శిల్పం'గానో వ్యవహరించాలి. ఈ దశ అశోకుని కాలం నుంచి వెయ్యేళ్లు కొనసాగింది. పదవ శతాబ్దం దాక చలామణిలో ఉంది. దేశమంతటా విస్తరించింది.

మొదట గుహాలయాలే...



లోమస రుషిగుహాలయం

ఈ రాతి వాస్తు శిల్పాలలో మొదటివాటిని అశోకుడూ, అతడి మనుమడైన దశరథుడూ గయ వద్ద, నాగార్జున కొండలోను, బరాబర్ వద్ద కఠినమైన శిలలలో తొలిపించారు. ఇవి ఆజీవికలకు అంకితమైనవి. ఈ సముదాయంలో సుదామ (న్యగ్రోధ), లోమస రుషి గుహలు చెప్పుకోదగినవి. ఈ గుహలు అచ్చంగా బార్హుత్‌లోని 'సుద్దమ్మ దేవసభ'ను పోలి ఉన్నాయి. ఈ గుహల వరుసను పరిశీలిస్తే వీటిలోని ముఖ్యాయతనం వర్తులాకారంలో (గుంటుపల్లిలో వలె) వుండేదని, ఆ తర్వాత భక్తుల నిమిత్తం మండపం చేర్చారని తెలుస్తుంది. ఈవిధమైన రాతి వాస్తు శిల్పం, ఆ తరువాతి శతాబ్దంలో పడమటి దక్కన్ ప్రాంతంలోని మృదు శిలా ప్రాంతానికి వ్యాపించింది. క్రీస్తుపూర్వం 200 నుంచి క్రీస్తు శకం 200 మధ్య బౌద్ధ రాతి ఆలయాలను ఎన్నింటినో తొలిచారు. బుద్ధుడికి ప్రతీకగా ఉన్న ఆరాధ్య స్తూపం, దాని చుట్టూ చైత్యాలు, ఇటూ అటూ గదులు గదులుగా ఉండి మధ్యను సమావేశమందిరానికి కూటం ఉన్న విహారా (మఠా)లు-ఇవి ఆ నిర్మాణాల్లో ఉన్నాయి. పూనా, నాసిక్, అజంతా, ఔరంగాబాద్‌ల సమీపాన ఇలాంటివి ఉన్నాయి. గయకన్నా ఇక్కడి శిల మెత్తటిదైనందువల్ల తొలవడం సులభమని ఈ ప్రాంతాన్ని ఎన్నుకున్నారు. ఆంధ్ర కోస్తా ఉత్తర భాగంలోని తూర్పు కనుమల్లో, ఒరిసా రాష్ట్ర దక్షిణ జిల్లాల్లోను ఈ విధంగా మృదు శిలలో దొలిచిన ఆలయాల్లో చెప్పుకోదగినవి గుంటుపల్లి, శంకరం, ఖండగిరి, ఉదయగిరిలలో ఉన్నాయి. పాల్సెట్‌లోని కొండిదివ్‌టిలోని బౌద్ధ గుహ, జున్నార్ (పూనా)లోని తుల్జా గుహ, గుంటుపల్లి (ఆంధ్ర) గుహలు గయ వద్ద ఉన్న సుదామ, లోమస రుషి గుహల వలెనే ఉన్నాయి.

అజంతా (దక్కన్)లో తొలిచిన 30 గుహల్లో రెండు (9,10 నెంబర్ గుహలు) చైత్యకూటాలు; నాలుగు విహారాలు: ఇవన్నీ కూడా తొలిదశకు చెందినవి, భాజ, కార్లె, కొండానె, పిత్తల్‌కోరా, నాసిక్; కన్హేరిలలోని బుద్ధ గుహలను పోలినవి. వీటిని బహుశ క్రీ.పూ 200-క్రీ.శ.200 మధ్య తొలిచి ఉంటారని భావించవచ్చు. మిగతా గుహలన్నీ నాల్గవ శతాబ్దం, ఆ తరువాత కాలానికి చెందినవిగా భావించవచ్చు.

తొలినాటి చైత్యాలు పెద్దగా, గజపృష్టాకారంలో, సువిశాలమైన ద్వారంతోను, దానిపైన గుర్రపు నాడా వంటి కిటికీలతోను ఉంటాయి. వీటి అతర్భాగంలో, మధ్య పొడుగాటి కూటము, వాటికి అటూ ఇటూ రెండు వరుసల స్తంభాలతో పేర్చబడిన దారులు ఉంటాయి. ఈ దారులు చివరంటా వెళ్ళి చాపం దగ్గిరవంగి ప్రదక్షిణ మార్గంగా రూపొందుతాయి. ఈ చాప భాగంలోనే, రాతిలో దొలిచిన ఆరాధ్య స్తూపం ఉంటుంది. ఈ దారుల పై కప్పులు చదునుగాగాని, లేక గొడుగులాగా కాని వుంటాయి.

విహారాలన్నీ కూడా స్తంభాల్లేని కూటములు. ఈ కూటములలో అటూ ఇటూ వరుసగా మూడు వైపుల రాతి గోడలలో చెక్కిన సన్యాసి గదులుండేవి. ఈ కూటానికి ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ ప్రధాన ద్వారాలు ఉంటాయి.

రెండవ దశకు చెందిన చాపాకారపు చైత్యాలు రెండు పాతవాటిలాగే ఉంటాయి. కానీ వీటిలో స్తూపానికి ముందుగా ఒక బుద్ధ విగ్రహం ఉంటుంది. ఈ బుద్ధ విగ్రహం స్తూపం అడుగు దిమ్మ నుంచి పొడుచుకొచ్చిన 'నాసిక' కింద ఉంటుంది. అంటే స్థూపాన్ని గుండ్రటి కప్పున్న వర్తులాకారపు గర్భగుడిలాగాను, ఆ కప్పు నుంచి బండి గూడు వలే ముందుకు సాగిన 'శుకనాసిక'ను ద్వారం లాగాను రూపకల్పన చేశారు. ఇది తరువాతి కాలపు 'వేసర' పద్ధతి ఆలయ నిర్మాణానికి చెందుతుంది. చాలా వాటిలో సన్యాసి మఠాలు, ఆయతనాలు కలిసి ఉండటమూ, క్రమంగా ఆయతనాలు ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకోవడం కనిపిస్తుంది. ఆరాధ్య వస్తువు ఉన్న ఆయతనాన్ని (గర్భగుడిని) మనం 'చైత్యము' అని పిలిచేటట్లయితే వీటన్నిటినీ 'చైత్యవిహారాలు' అని పిలువవలసి ఉంటుంది. చైత్యానికి దేవకులము, ఆయతనము, విమానము, ధామము, మందిరము అన్న ఇతర పేర్లూ ఉన్నాయి.

ఈ విహారాలకు తరువాతి కాలంలో రూపొందిన దేవాలయాలకు పోలికలు ఉన్నాయి. ఈ విహారాలలో ఆలయాల ముఖమండపము లేదా అగ్ర మంటపమును పోలిన బయట వసారా ఉంటుంది. చివర గర్భ గృహం కల మహామంటపాన్ని పోలిన కూటం ఈ విహారాల్లో ఉన్నాయి.

నాగార్జున కొండ చైత్యం



వరుసగా మండపాలుండి చివర దీర్ఘచతురస్రాకారపు కూటము, దాని వెనుకగాని, దానిలో చొచ్చుకొని వస్తున్నట్లుగాని ఆయతనం ఉండడం అన్నది-దక్షిణ దేశంలో చాళుక్యులు, పల్లవులు, పాండ్యులు వంటి రాజుల కాలంలో తొలిచిన హిందు, జైన కొండరాతి దేవాలయాల్లోనూ కనిపిస్తుంది. ఇటువంటి రాతి వాస్తుశిల్ప నిర్మాణం పదవ శతాబ్దం దాకా, ఎల్లోరా వంటి చోట్లయితే ఆ తర్వాత కూడా కొనసాగింది.

-మౌక్తిక్

కొనసాగుతున్న ప్రాచీన విజ్ఞానం



ఇప్పటికీ ఆదిమ కాలపు పద్ధతుల్లోనే లోహపు విగ్రహాలు, ఇతర కళా వస్తువు లను తయారుచేయడం కనిపిస్తుంది. ఈ పద్ధతి చాలా శ్రమ, నైపుణ్యాలతో కూడి ఉంటుంది. ఒక లోహపు కళాఖండాన్ని తయారుచేయాలంటే ముందు అచ్చు (మౌల్డు)ను తయారు చేయాలి. ఇందుకు గాను మనం ఏ ఆకారంలో బొమ్మను తయారు చేయాలను కుంటామో ఆ ఆకారంలో ఒక మట్టి బొమ్మను తయారు చేస్తారు. నల్లమట్టిలో వరి పొట్టును వేసి కలిపి ఈ బొమ్మను తయారుచేసి ఎండలో ఆరబెడతారు. ఎండిన బొమ్మకు కొన్ని పగుళ్లు వస్తాయి. ఆ పగుళ్లను మెత్తటి మట్టితో మళ్లీ పూడ్చి ఎండబెట్టాలి. ఎండిన బొమ్మ ఉపరితలం నున్నగా ఉండేలా కుండ పెంకుతో గీరాలి. తరువాత సాల్‌చెట్టు ఆకులతో ఆ బొమ్మను రుద్దాలి.





ఇట్లా తయారైన మట్టి బొమ్మకు మైనం పూత పూయాలి. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఎంతో శ్రమతో కూడుకున్నది. సాధారణంగా పారాఫిన్ మైనం, తేనెతుట్టె మైనం, సాల్ చెట్టు బంక వంటివాటిని సరైన పాళ్లలో (ప్రస్తుతం తారును కూడా వాడుతున్నారు) కలిపి వేడిచేస్తారు. వేడిమైనాన్ని 'పిచకీ' అనే సాధనంలో ఉంచి మైనాన్ని సన్నని తాళ్ల మాదిరిగా బయటికి వచ్చేలా చేస్తారు. ఇప్పుడు ఈ తాళ్లతో ముందుగా తయారుచేసుకున్న మట్టిబొమ్మను కప్పేలా చుడతారు. అంటే మట్టి బొమ్మపై దట్టమైన మైనపు పూత ఏర్పరిచారన్నమాట. ఈ మైనపు పూతపై కావలసిన డిజైన్లు గీస్తారు. అట్లా మనం తయారుచేయాలనుకున్న లోహపు బొమ్మకు మైనపు మోడల్ తయారుచేసిన తరువాత దాన్ని నీళ్లల్లో ఉంచుతారు. ఎందుకంటే బయటి వాతావరణం వేడికి మైనం కరిగిపోయి బొమ్మ ఆకారం చెదిరిపోవచ్చు.

ఇట్లా సిద్ధం చేసుకున్న మైనం మోడల్‌కి నది ఒడ్డు నుంచి తీసుకువచ్చిన మెత్తటి మట్టిని పొరలు పొరలుగా పూసి ఎండలో పెడతారు. దీంతో తయారుచేయవలసిన లోహపు బొమ్మ మౌల్డు (అచ్చు) సిద్ధమవుతుంది. లోపల మట్టి బొమ్మ, బైట మట్టి పొర ఉంటే మధ్యలో మైనపు అచ్చు తయారయిందన్నమాట. ఇప్పుడు ఏ లోహంతో బొమ్మను తయారు చేయాలనుకుంటే ఆ లోహాన్ని కరిగించి ఈ అచ్చులో పోయాలి. లోహపు ద్రవం వేడికి మైనం కరిగిపోయి బయటికి వస్తుంది. మైనం స్థానాన్ని లోహపు ద్రవం ఆక్రమించి ఘనీభవిస్తుంది. ఆరిన తరువాత మట్టి అచ్చును పగలగొట్టి లోహపు బొమ్మను బయటికి తీస్తారు. దానికి కావలసిన మెరుగులు దిద్దుతాడు కళాకారుడు. ఈ విధంగా ఇప్పటికీ ప్రాచీన లోహపు విగ్రహాల తయారీ కొనసాగుతూనే ఉండటం విశేషం.





విజేతలకు భారీ నజరానా

ఇండోర్ : చారిత్రాత్మక విజయం సాధించిన విదర్భ జట్టుకు విదర్భ క్రికెట్ అసోసియేషన్ భారీ నజరానా ప్రకటించింది. రూ. 5 కోట్ల రూపాయలు ఇవ్వనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ జైస్వాల్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆటగాళ్లకు, సిబ్బందికి పంచుతారు. విజేతలకు ట్వీటర్ వేదికగా బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రీ సహా పలువురు సీనియర్ క్రికెటర్లు అభినందనలు తెలిపారు



రంజీ చరిత్రలోనే సంచలనం. పదేండ్ల తర్వాత రంజీ ట్రోఫీ గెలుపు కలలు కన్న ఢిల్లీకి భంగపాటు. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగి.. అద్భుత ప్రదర్శనలతో ఆసాంతం ఆకట్టుకున్న విదర్భ సగర్వంగా రంజీ ట్రోఫీని ముద్దాడింది. రంజీ పైత్ సృచేరిన తొలిసారే ట్రోఫీ గెలిచి అబ్బురపరచింది. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం వేదికన ఈ అద్భుత ఘట్టంలో విదర్భ సమిష్టిగా రాణించింది. ఫైనల్స్‌లో ఢిల్లీ జట్టుపై తొమ్మిది వికెట్లతో తేడాతో గెలుపొందింది.

విదర్భ సంచలనం

రంజీ ఫైనల్స్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో ఢిల్లీ చిత్తు

తుదిపోరులో రాణించిన వాడ్కర్, గుర్బానీ

నవతెలంగాణ-ఇండోర్

విదర్భ జట్టు సంచలనం సృష్టించింది. 83 ఏండ్ల రంజీ చరిత్రలో తొలి సారి రంజీ ట్రోఫీని గెలిచింది. ఆఖరు రోజున కేవలం ఐదు ఓవర్లలో ఒక్క వికెట్ నష్టానికి లక్ష్యాన్ని ఛేదించి రంజీ ట్రోఫీని కైవసం చేసుకున్నది. ఫైజ్ ఫజల్ నాయకత్వంలోని విదర్భ తుది పోరులో బ్యాటింగ్, బౌలింగ్‌లలో విశిష్ట ప్రతిభ కనబరిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు, రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కూల్చిన విదర్భ బౌలర్ రాజ్‌నీశ్ గుర్బానీ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ భారీ ఇన్నింగ్స్‌కు ఫజల్, వసీం జాఫర్‌లు బాటలు వేయగా. అక్షయ్ వినోద్ వాడ్కర్ శతాధిక స్కోరుతో బలమైన ఇన్నింగ్స్ నిర్మించాడు. ఆదిత్య సర్వటే, సిద్ధేశ్ నేరల్‌లు కీలక హాఫ్ సెంచరీలతో రాణించారు.

తొలి ఇన్నింగ్స్‌లో 528 పరుగులతో, మూడు వికెట్లు చేతిలో ఉండగా చివరి రోజు ఆట కొనసాగించింది విదర్భ. ఆదిలోనే సెంచరీ వీరుడు అక్షయ్ (133) నిష్క్రమించగా.. సిద్ధేశ్ నర్వాల్ (74) క్రీజులో కొనసాగాడు. ఆదిత్య థాకరే, రాజ్‌నీశ్ గుర్బానీ వ్యక్తిగత పరుగుల ఖాతా తెరవలేదు. 547 పరుగులకు ఆలౌట్ అయింది విదర్భ.. ఢిల్లీ బౌలర్లలో నవ్‌దీప్ సైని ఐదు వికెట్లతో మెరిశాడు. ఆకాశ్ సుదన్, కుల్వంత్ కేజ్రోలియాలు చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. రెండో ఇనింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీని ఆదిలోనే అక్షయ్ వాఖరే దెబ్బ కొట్టాడు. ఓపెనర్ కునాల్ చండేలా (9)ను సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితం చేశాడు. మరో ఓపెనర్, టీమ్ ఇండియా మాజీ బ్యాట్స్‌మెన్ గౌతం గంభీర్ (36) తోడుగా వన్ డౌన్‌లో వచ్చిన ధృవ్ శోరే (62) రాణించాడు. తొలి ఇన్నింగ్స్ ఢిల్లీ తరఫున శతకం బాదిన ధృవ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. గంభీర్ గుర్బానీ బంతికి ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరగటంతో క్రీజులోకి దిగిన నితీశ్ రానా (64) సైతం రాణించాడు. ధృవ్‌ను సర్వటే బలిగొనగా, నితీశ్ వికెట్‌ను గుర్బానీ పడగొట్టాడు. కెప్టెన్ రిషభ్ పంత్ (32), వికాస్ మిశ్రా (34)లు ఫర్వాలేదనిపించారు. ఆకాశ్ సుదన్ (18) మినహా మిగిలిన వారంతా సింగిల్ డిజిట్ సోరుకే పరిమితం అయ్యారు. దీంతో 280 పరుగులకు ఢిల్లీ ఆలౌట్ అయింది. రాజ్‌నీశ్ గుర్బానీ విదర్భకు రెండు కీలక వికెట్లు అందించాడు. ఆదిత్య సర్వటే (3/30)తో మెరిశాడు. అక్షయ్ వాఖరే నాల్గు వికెట్లు కూల్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన విదర్భకు ఢిల్లీ కేవలం 29 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించగల్గింది. సారథి ఫైజ్ ఫజల్ (2) కేజ్రోలియా బంతికి పెవిలియన్ చేరినా.. సంజయ్ రామస్వామి (9 నాటౌట్), వసీం జాఫర్ (17 నాటౌట్)లు విదర్భ తరఫున వికెట్ నష్టానికి 32 పరుగులు చేశారు. ఐదు ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విదర్భ గెలుపు లాంఛనం చేశారు. దీంతో ఢిల్లీపై తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచిన విదర్భ తొలి సారి రంజీ ట్రోఫీ నెగ్గి చరిత్ర సృష్టించింది. 2016-17 రంజీకి కొత్త చాంపియన్ గుజరాత్‌కు సైతం అదే తొలి ట్రోఫీ కాగా.. 2017-18 రంజీ ట్రోఫీ విజేత విదర్భకు 83 ఏండ్ల చరిత్రలో ఇదే తొలి ట్రోఫీ కావటం విశేషం.


రంజీ ట్రోఫీతో విదర్భ జట్టు ఆటగాళ్లు

ఢిల్లీ తొలి ఇన్నింగ్స్ : 295/10 , విదర్భ తొలి ఇన్నింగ్స్ : 547/10

ఢిల్లీ రెండో ఇన్నింగ్స్ : కునాల్ చండేలా (సి) రాజ్‌నీశ్ గుర్బానీ (బి) అక్షయ్ వాఖరే 9, గంభీర్ ఎల్‌బిడబ్ల్యూ (బి) రాజ్‌నీశ్ గుర్బానీ 36, ధృవ్ శోరే (సి) అక్షయ్ వాడ్కర్ (బి) ఆదిత్య సర్వటే 62, నితీశ్ రానా (సి) అక్షయ్ వాడ్కర్ (బి) రాజ్‌నీశ్ గుర్బానీ 64, రిషబ్ పంత్ (సి) అపూర్వ్ వాంఖడే (బి) సిద్ధేశ్ నేరల్ 32, హిమ్మత్ సింగ్ (బి) అక్షయ్ వాఖరే 0, మనన్ శర్మ (బి) అక్షయ్ వాఖరే 8, వికాస్ మిశ్రా (స్టం) అక్షయ్ వాడ్కర్ (బి) ఆదిత్య సర్వటే 8, నవ్‌దీప్ సైని (సి) ఆదిత్య సర్వటే (బి) అక్షయ్ వాఖరే 5, ఆకాశ్ సుదన్ (సి) అపూర్వ్ వాంఖడే (బి) ఆదిత్య సర్వటే 18, కుల్వంత్ కేజ్రోలియా నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు 11, **మొత్తం :(76 ఓవర్లలో 10 వికెట్లకు) 280.**

వికెట్ల పతనం : 1-32, 2-50, 3-164, 4-189, 5-190, 6-222, 7-228, 8-234, 9-279, 10-280.

బౌలింగ్ : గుర్బానీ 18-2-92-2, ఆదిత్య థాకరే 12-6-14-0, అక్షయ్ వాఖరే 28-2-95-4, ఆదిత్య సర్వటే 9-1-30-3, సిద్ధేశ్ నేరల్ 9-1-39-1.

విదర్భ ఇన్నింగ్స్ : ఫైజ్ ఫజల్ ఎల్‌బిడబ్ల్యూ (బి) కుల్వంత్ కేజ్రోలియా 2, సంజయ్ రామస్వామి 2 నాటౌట్, జాఫర్ 17 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 4, **మొత్తం : (5 ఓవర్లలో 1 వికెట్‌కు) 32.**

బౌలింగ్ : కుల్వంత్ కేజ్రోలియా 3-0-21-1, ఆకాశ్ సుదన్ 2-0-7-0.

అక్సెల్సన్ అదరగొట్టాడు

పీబీఎల్ పోరులో ముంబయిపై 6-(-1)తో బెంగళూరు ఘనవిజయం

లక్నో : పీబీఎల్ పోరులో బెంగళూరు రెండో విజయాన్ని నమోదు చేసింది. తొలి పోరులో ఢిల్లీ డాషర్స్‌పై 5-2తో గెలుపొందిన బెంగళూరు బ్లాస్టర్స్.. సోమవారం జరిగిన రెండో పోరులో ముంబయి రాకెట్స్‌ను తో ఓడించింది. తొలుత మిక్స్‌డ డబుల్స్‌లో బెంగళూరుకు చెందిన సిక్కిరెడ్డి జోడీ 15-8, 10-15, 15-10 తో ముంబయి జంటపై గెలిచింది. మహిళల సింగిల్స్‌లో కిర్‌స్టీ గిల్‌మోర్ రాణించింది. ప్రత్యర్థి బీ జాంగ్‌పై 15-14, 15-8తో వరుస సెట్లలో నెగ్గి బెంగళూరును 2-0 టై స్కోరుతో ఆధిక్యంలో నిలపింది.పరుషుల సింగిల్స్ పోరును ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్నది బెంగళూరు. వరల్డ్ నెంబర్ విక్టర్ అక్సెల్సన్ ధనాధన్ ఆటతో ఏకంగా 4-0టై పాయింట్లతో మరో రెండు మ్యాచులు మిగిలుండగానే విజయం ఖాయం చేసుకున్నది. తొలి సెట్‌లో చెలరేగిన అక్సెల్సన్ వేగంగా పాయింట్లు రాబట్టాడు. అయితే రెండో సెట్‌లో సంగ్‌వాంగ్ హో అక్సె ల్సన్ జోరుకు అడ్డుకట్ట వేశాడు. 8-8, 12-12తో హోరాహోరీ పోరు సాగగా చివరకు 15-13తో అక్సెల్సన్ పైచేయి సాధించాడు. ముం బయి ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న మరో పరుషుల సింగిల్స్‌లో ఓడి నెగిటివ్ మార్క్ మూటగట్టుకున్నది. ఎస్ వర్మ 15-9, 8-15, 6-15తో ఫెంగ్ చేతిలో దారుణ ఓటమి చవిచూశాడు. పురుషుల డబుల్స్ లోనూ ఓడిన ముంబయి (-1)-6తో ఘోర పరాజయం పాలైంది.


రామ్‌కుమార్ శుభారంభం

పుణె : వైల్డ్ కార్డ్ ఎంట్రీతో మహారాష్ట్ర ఓపెన్ బరిలో దిగిన రామ్‌కుమార్ రామనాథన్ శుభారంభం చేశాడు. స్పెయిన్ ఆటగాడు కార్‌బలేస్ బీనాపై 7(7)-6(4), 6-2తో గెలుపొంది ప్రీక్వార్టర్స్‌లో కాలుమోపాడు. తొలిగేమ్‌లో ఇద్దరూ నువ్వానేనా అన్నట్టుగా తల పడగా ఫలితం కోసం టైబ్రేకర్‌కు వెళ్లాల్సొచ్చింది. అక్కడ పైచేయి సాధించిన రామ్‌కుమార్ తదుపరి గేమ్‌లో చెలరేగి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు.


హైదరాబాద్‌లో జరుగుతున్న 65వ సీనియర్ జాతీయ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో చండీఘడ్‌పై 46-19తో తెలంగాణ జట్టు విజయం సాధించింది.

"మిషన్‌భగీరథ ద్వారా వచ్చే వేసవిలో తాగునీటిని గద్వాల, అలంపూర్ ప్రాంతాలకు వదలాలి. అందుకు జూరాల రిజర్వాయర్‌లో నీటిని తగినంత స్థాయిలో ఉంచాలి. జూరాల నుంచి రబీకి నీటి విడుదలను ఆపేయాలి. డి-20 వరకే నీటిని పంపేలా చర్యలు తీసుకోవాలి" అంటూ నీటి సలహా బోర్డు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జూరాల ఆయకట్టు చివరి భూములకు నీరందటం ప్రశ్నార్థకంగా మారింది. రిజర్వాయర్‌లోకి వరద ఆలస్యంగా వచ్చిందనే పేరుతో ఖరీఫ్‌లో కూడా నీళ్లు వదలలేదు. ఏదో ఒక కారణంతో ఐదేండ్లుగా చివరి ఆయకట్టుకు నీరు రాకున్నా.. ఎవరూ.. పట్టించుకోవడం లేదు.

జూరాల.. నీరెలా!



- మిషన్‌భగీరథ పేరుతో తిరస్కరణ
- సాగునీరు వదలరాని సలహాకమిటీ ఆదేశం
- 40వేల ఎకరాలకు మొండిచెయ్యి
- రివిట్‌మెంట్ లేక కాల్వల్లో మొలిచిన జమ్ము
- మరమ్మతుల కోసం నిధులు వచ్చినా పూర్తి కాని పనులు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్‌ప్రతినిధి

జూరాల రిజర్వాయర్‌కు బచావత్ ట్రిబ్యునల్‌లో 17.84 టీఎంసీలు కేటాయించారు. తర్వాత కర్ణాటక ముంపునకు గురవుతున్నదని సామర్థ్యాన్ని 11.94టీఎంసీలకు కుదించారు. ఈ రిజర్వాయర్ నుంచి గద్వాల, అలంపూర్, ఆత్మకూరు, వనపర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలకు సాగు నీరివ్వాలి. సాగునీరంతా గ్రావిటి ద్వారా చేరుతోంది. జూరాల ఎడమ కాల్వ 90 కిలోమీటర్లు, కుడి కాల్వ 50 కిలోమీటర్లు ఉంది. ఈ రెండు కాల్వల ద్వారా లక్షా ఐదు వేల ఎకరాలకు సాగు నీరందివ్వాలి. పాలకుల నిర్లక్ష్యం వల్ల ఐదేండ్లుగా చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. కాల్వలకు లైనింగ్ లేక గండ్లు పడుతున్నాయి. డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాల్వల నిర్వహణ సరిగా లేదు. రివిట్‌మెంట్ లేక కాల్వల్లో జమ్ము పెరిగి వదలిన నీరు కూడా పంట పొలాలకు అందట్లేదు. చిన్నచిన్న పనులకోసం నిధులు వచ్చినా ఖర్చు చేస్తున్నట్టు లెక్కలు చూపుతున్నారు.. కానీ పనులు మాత్రం ఎక్కడా జరగడం లేదు. దీంతో సాగు భూములన్నీ బీళ్లుగా మారుతున్నాయి. దీంతో ప్రాజెక్టు అంచనా వ్యయం 30ఏండ్లలో 18 రెట్లు పెరిగినా.. నిర్దేశించిన లక్ష్యం నెరవేరట్లేదు. మరోవైపు ఆయకట్టు సలహా బోర్డు ఆదేశాల మేరకు డీ-20 వరకే నీళ్లు వదలాలని నిర్ణయించారు. దీంతో ఆయకట్టు పరిధిలోని చివరి 40 వేల ఎకరాలకు సాగునీరందటం ప్రశ్నార్థకంగా మారింది.



తాగునీటి కోసం మిషన్‌భగీరథ పేరుతో రైతులకు సాగు నీరు వదలకపోవడం దారుణమని రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

చివరి ఆయకట్టు గోడు

జూరాల కింద ఉన్న చివరి ఆయకట్టు రైతుల గోడు చెప్పుకోలేనిది. ముఖ్యంగా పెబ్బేరు, తాటిపాముల, యాపర్ల, అయ్యవారిపల్లి, గుమ్మడం, బెక్కెం గ్రామాలకు ఐదేండ్లుగా జూరాల నుంచి సాగునీరు రావట్లేదు. ముఖ్యంగా వీపనగండ్ల, చిన్నంబావి మండలాల రైతులు సాగుకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. జూరాల నీరు గాకున్నా.. చిన్నమరూర్, బెక్కెం, మియాపూర్, గోప్లాపూర్, చెల్లెపాడు వంటి ఎత్తిపోతలను వినియోగంలోని తేవాలి. వీటివైపు పాలకులు కన్నెత్తి చూడట్లేదు. జూరాల నుంచి నీరు తేకపోయినా కింది నీటిని ఉపయోగించుకునే విధంగా ఏర్పాటు చేసిన చిన్న లిఫ్టులను పూర్తి చేస్తే.. రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

ఐదేండ్లుగా సాగు లేదు

జూరాల ఆయకట్టు కింద నాకు ఐదెకరాలుంది. పన్నులు మాత్రం కడుతున్నాం. సాగు నీరు మాత్రం రావట్లేదు. ఈసారి జూరాలకు బాగానే వరదలు వచ్చాయి. కానీ మాకు మాత్రం సాగుకు నీళ్లను వదలట్లేదు. ఐదేండ్లుగా ఇదే పరిస్థితి.

- లక్ష్మయ్య, రైతు, వీపనగండ్ల

చివరి ఆయకట్టకు నీరు అందివ్వాలి

జూరాలను నమ్ముకుని రైతులు వరి నారుమళ్లను తయారు చేసుకున్నారు. తీరా చివరి ఆయకట్టుకు నీరు వదలట్లేదని చెప్పడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. డీ-20 డిస్ట్రిబ్యూటర్ వరకే నీరు వదలడం సరికాదు. ఇంకా రిజర్వాయర్‌లో 7.750 టీఎంసీల నీరు ఉంది. మిషన్‌భగీరథ పేరుతో నీరు ఆపడం సరికాదు. నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. లేనిచో రైతులతో కలిసి ఉద్యమాలు చేయక తప్పదు.

బాల్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.